


నేటి దినపత్రిక

# సూర్య

www.suryaa.com

19వ వసంతంలోకి ...

గ్రేటర్ హైదరాబాద్

సోమవారం 2 ఫిబ్రవరి 2026 పేజీలు 16


### ఆలియా ప్రభుత్వ పాఠశాలలో

# ట్రాఫిక్ అవగాహన పార్క్ ప్రారంభం

## రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్




సిటీబ్యూరో,మేజర్‌న్యూస్‌: ప్రభుత్వం రోడ్డు భద్రతా,ప్రమాదాల నివారణకు పటిష్టమైన చర్యలు తీసుకుంటుందని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. నేషనల్ రోడ్ సేఫ్టీ మాసోత్సవం ముగింపును పురస్కరించుకుని బషీర్‌బాగ్‌లోని ప్రభుత్వ ఆలియా మోడల్ హైస్కూల్‌లో ఎస్.డి.ఎఫ్. ఫండ్స్ ,యూనిసెఫ్ సంయుక్త సహకారంతో రూ.14లక్షల వ్యయంతో అభివృద్ధి చేపట్టిన పార్క్‌ను లాంఛనంగా ప్రారంభించి, తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాల ప్రాంగణంలో ఏర్పాటు చేయడం తొలి ట్రాఫిక్ అవేర్‌నెస్ పిల్లల పార్క్‌గా నిలిచిందని రాష్ట్ర మంత్రి అన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి మాట్లాడుతూ రోడ్డు భద్రత అనేది సమాజం మొత్తం బాధ్యతఅని,రోడ్డు ప్రమాదాల కారణంగా ప్రతి రోజు సగటున 20 మంది ప్రాణాలు కోల్పోతున్నారని,ట్రాఫిక్ భద్రతను పాఠశాలస్థాయినుంచే ఒక సక్రమ విద్యా అంశంగా ప్రవేశపెట్టాల్సిన అవసరం ఎంతో ఉందన్నారు. ఈకార్యక్రమంలో భాగంగా విద్యార్థులు నిర్వహించిన ప్రత్యక్ష ప్రదర్శనలను ఆయన ప్రత్యేకంగా పరిశీలించి, పిల్లలను అభినందించారు. అనంతరం రాష్ట్ర మంత్రి ప్రత్యేకంగా కార్యక్రమంలో హాజరైన వారితో రోడ్ సేఫ్టీ గురించి ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ రోడ్డు భద్రత అనేది సమాజం మొత్తం

మిగతా 2లో

### కాంగ్రెస్ ప్రభుత్వం కక్ష సాధింపు

# చర్యలను మానుకోవాలి

## ఎమ్మెల్యే వివేకానంద



కొంపల్లి మేజర్ న్యూస్ : చట్ట విరుద్ధంగా పసలేని కేసులతో విచారణపేరుతో బిఆర్ఎస్ అధినేత కెసిఆర్ ని ఇబ్బంది పెడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న కక్ష సాధింపు చర్యలను ఎండగడుతూ తెలంగాణ భవన్ వేదికగా విలేకరుల సమావేశంలో బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ ప్రభుత్వ పాలన, కక్ష సాధింపు చర్యలపై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన మొదటి రోజు నుంచి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలనను గాలికి వదిలేసి కేసీఆర్ ని, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ని, హరీష్ రావుని ఇబ్బందులకు గురి చేస్తూ కక్ష సాధింపుతో ఇబ్బందులకు చేయాలని చూడడమే తప్పా చేసింది ఏమీ లేదన్నారు. స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీం (సిట్) ను ఏర్పాటు చేసిందే కేసీఆర్ ని, మా పార్టీ నాయకులను ఇబ్బంది పెట్టడానికేనని అన్నారు. ప్రభుత్వం ఏర్పడి మూడు సంవత్సరాలు కావస్తున్న ఇంకా ఫోన్ ట్యాపింగ్ కేసు ఏందిరా నాయనా అని ప్రజలు పెదవి విరుస్తున్నారని, అధికారంలో వచ్చిన వంద రోజుల్లో అమలుచేస్తామన్న ఆరు గ్యారంటీలు, 420 హామీలు ఏమైనాయి అని ప్రజలు అడుగుతున్నారని అన్నారు. ప్రజల దృష్టిని మళ్లించేందుకు “డైవర్షన్ పాలిటిక్స్” ను చేస్తూ ప్రభుత్వం ఇలాంటి చర్యలకు పాల్పడుతుందన్నారు. ప్రజలు నీరాజనాలు పలుకుతా ఉంటే ఎక్కడికక్కడ వారిని నిర్బంధిస్తూ నిర్బంధ కాండకు పాల్పడుతుంది ఈ ప్రభుత్వం అని, చట్టంలో 65 ఏళ్ల పైబడిన ఎవరినైనా వారి ఇంట్లోనే విచారించవచ్చనీ హైకోర్టు, సుప్రీంకోర్టు తీర్పులు ఉన్నా ప్రభుత్వం వాటిని ఉల్లంఘిస్తూ అన్యాయంగా మా పార్టీ ఇబ్బందులకు గురిచేస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం అడిస్తున్నట్టు సిట్ అధికారులు ఆడుతూ ప్రభుత్వం చేతిలో కీలు బొమ్మగా మారిందన్నారు. ప్రభుత్వం ఆహంకారపూరితంగా వ్యవహరిస్తోందని, ప్రభుత్వానికి తోడుగా పోలీస్ వ్యవస్థ పనిచేస్తుందన్నారు. మున్సిపల్ ఎలక్షన్స్ నడుస్తా ఉంటే మమ్మల్ని ఇబ్బందుల గురిచేస్తూ ప్రజా క్షేత్రంలో తిరగకుండా ఉంచాలనే ఆలోచనతో ఈ ప్రభుత్వం వ్యవహరిస్తోందని తెలిపారు.

మిగతా 2లో

# గెలిచే అభ్యర్థులకే కాంగ్రెస్ అవకాశం

## ఎమ్మెల్యే గాంధీ



కొండాపూర్,మేజర్ న్యూస్ : రాబోయే జీహెచ్ఎంసీ ఎన్నికల్లో గెలిచే అవకాశాలు ఉన్న అభ్యర్థులకే పార్టీ అవకాశం కల్పిస్తుందని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ అన్నారు.శేరిలింగంపల్లి నియోజకవర్గం శ్రీరామ్ నగర్ ఏ బ్లాక్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు బలరాం యాదవ్ సుమారు 200 మంది అనుచరులతో కలిసి ఎమ్మెల్యే గాంధీని కలిసి రాబోయే జీహెచ్ఎంసీ ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం ఇవ్వాలని కోరారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జిహెచ్ఎంసీ టికెట్ల విషయంలో కాంగ్రెస్ అధిష్టానమే తుది నిర్ణయం తీసుకుంటుందని, తన పాత్ర కేవలం ప్రతిపాదనలు పంపడమేనని స్పష్టం చేశారు. నిరంతరం ప్రజల్లో ఉంటూ, ప్రజలకు సేవ చేసే వారికి తప్పకుండా అవకాశం వస్తుందని అన్నారు.ఈసారి ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల సంఖ్య పెరిగే అవకాశముందని, ప్రజల్లో పేరు ఉండి గెలిచే సామర్థ్యం ఉన్నవారికి టికెట్లు ఇస్తామని తెలిపారు. పార్టీ నిర్వహించే సర్వేలో విజయం సాధించే అభ్యర్థులకు అవకాశం కల్పిస్తామని వెల్లడించారు.జిహెచ్ఎంసీ డివిజన్ల సంఖ్య పెరిగే అవకాశం ఉందని, ఎన్నికలకు ఇంకా ఆరు నెలల సమయం ఉందని తెలిపారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి కష్టసుఖాల్లో భాగస్వాములవ్వాలని ఆశావహులకు సూచించారు.ఈ కార్యక్రమంలో బలరాం యాదవ్ అనుచరులు భారీ కన్వాయ్‌తో ఎమ్మెల్యే గాంధీ నివాసానికి చేరుకుని, దారిపొడవునా బలరాం యాదవ్‌కు అనుకూలంగా నినాదాలు చేశారు.

# కూకట్‌పల్లి చెరువులవద్ద దోమల విపత్తు

● గుర్రపు డెక్కతో నిండిపోయిన కాముని చెరువు ● తక్షణ చర్యలు కోరుతున్న స్థానికులు ● అధికార నిర్లక్ష్యంపై ఆగ్రహం




కూకట్‌పల్లి మేజర్ న్యూస్ :కూకట్‌పల్లి పరిసర ప్రాంతాల్లోని చెరువుల పరిస్థితి ఆందోళనకరంగా మారింది. గుర్రపు డెక్కలు విస్తృతంగా పెరిగి చెరువులన్నీ పచ్చని పొలాల్లా కనిపిస్తున్నాయి. ఈ కారణంగా చెరువుల్లో దోమల ఉత్పత్తి విపరీతంగా పెరిగి, సమీప కాలనీల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఉదయం, సాయంత్రం, రాత్రి అన్న తేడా లేకుండా దోమలు దాడి చేస్తున్నాయని స్థానికులు వాపోతున్నారు. వృద్ధులు, చిన్నపిల్లలు, మహిళలు ఎక్కువగా ప్రభావితమవుతున్నప్పటికీ, సమస్యపై సంబంధిత శాఖలు పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. పలుమార్లు ఫిర్యాదులు చేసినా ప్రభుత్వం, అధికారులు నిమ్మకు నీరెత్తినట్లే వ్యవహరిస్తున్నారని స్థానికుల ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం చెరువుల్లో నిల్వ ఉన్నది మురికి నీరేనని, కేవలం గుర్రపు డెక్క తొలగింపు కాంట్రాక్టులతో సమస్య పరిష్కారం కాదని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. ముందుగా చెరువుల్లోని నీటిని పూర్తిగా దిగువకు వదిలి, ఎండాకాలంలో చెరువులను ఖాళీ చేస్తే గుర్రపు డెక్క స్వయంగా ఎండిపోతుందని వారు సూచిస్తున్నారు. దీని వల్ల చెరువు నేలలో పగుళ్లు ఏర్పడి భూగర్భ జలాల రీఛార్జ్‌కు కూడా అవకాశం ఉంటుందని చెబుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి ఏటా చెరువుల పూడికను తొలగించి వ్యవసాయ భూములకు తరలిస్తారని, కానీ నగరాల్లోని చెరువులు దశాబ్దాలుగా పూడిక తీసిన దాఖలాలు లేవని స్థానికులు గుర్తు చేస్తున్నారు. ఇది పట్టణ జల వనరులపై అధికారుల నిర్లక్ష్యాన్ని

మిగతా 2లో

# కూకట్‌పల్లి చెరువులవద్ద దోమల విపత్తు

**మొదటి పేజీ తరువాయి :**స్పష్టంగా చూపిస్తోందని విమర్శిస్తున్నారు. ప్రత్యేకంగా రెయిన్‌బో విస్టాస్ సమీపంలోని కాముని చెరువు పరిస్థితి మరింత దయనీయంగా ఉందని చెబుతున్నారు. అక్కడ భారీ ఎస్‌టీపీ (సీవరేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్) నిర్మాణం కొనసాగుతున్న నేపథ్యంలో, భవిష్యత్తులో శుద్ధి చేసిన నీటిని చెరువులోకి విడుదల చేయనున్నారు. ఈ దశలోనే చెరువును పూర్తిగా ఖాళీ చేసి పూడికను తొలగించి శుభ్రపరిస్తే గుర్రపు డెక్క సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని అన్నారు. చుట్టుపక్కల కాలనీల్లో దోమల బెడద తక్షణమే తగ్గుతుందని చెరువు మళ్లీ మంచినీటి వనరుగా మారుతుందని అన్నారు. భూగర్భ జలాల స్థాయి పెరిగే అవకాశం ఉంటుందని స్థానికులు స్పష్టం చేస్తున్నారు. ఈ ప్రతిపాదనకు కాముని చెరువు చుట్టుపక్కల ఉన్న అన్ని కాలనీలు, గేటెడ్ కమ్యూనిటీల నుంచి ఏకగ్రీవ మద్దతు ఉందని వారు చెబుతున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, జీహెచ్ఎంసీ, సంబంధిత శాఖల అధికారులు స్పందించి కాముని చెరువుతో పాటు కూకట్ పల్లి పరిసర ప్రాంతాల చెరువులపై సమగ్ర ప్రణాళిక రూపొందించి తక్షణ చర్యలు చేపట్టాలని ప్రజలు గట్టిగా డిమాండ్ చేస్తున్నారు. సమస్యను నిర్లక్ష్యం చేస్తే ఆందోళన కార్యక్రమాలకు దిగుతామని హెచ్చరిస్తున్నారు.

# కాంగ్రెస్ ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలను మానుకోవాలి

**మొదటి పేజీ తరువాయి :**

ప్రభుత్వ పాలన అనేది ఈ విధంగా అరాచకాలు, నిర్బంధాలతో చేస్తామంటే రాబోయే రోజుల్లో ప్రజల్లో గుణపాఠం తప్పదని హెచ్చరించారు. ప్రభుత్వ వైఫల్యాలను కేంద్రంలోని సోషియో ఎకానమీ ఫోరం కూడా చెప్పిందని, మేడిగడ్డను వెంటనే మరమ్మత్తులు చేయండి, కాళేశ్వరం ద్వారా తెలంగాణ సస్యశ్యామలం అయ్యిందని చెప్పిందన్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం ఈ ద్వంద వైఖరిని మానుకోవాలని, ప్రజలను తప్పుదోవ పట్టించే డైవర్షన్ పాలిటిక్స్ మానుకోవాలన్నారు. కేసీఆర్ నాయకత్వంలో రానున్న మూడేళ్లలో ప్రభుత్వంలోకి రావడం ఖాయం. ప్రభుత్వానికి రిటర్న్ గిఫ్ట్ ఇవ్వడం ఖాయం అని అన్నారు.

# ఓయూ ప్రొ. మనోహర్ సస్పెన్షన్ వెంటనే ఎత్తేయాలి




హిమాయత్ నగర్, మేజర్ న్యూస్ : ఉస్మానియా యూనివర్సిటీ వైస్ ఛాన్సులర్ ఒక నియంతల వ్యవహరిస్తున్నాడని, అతనిని తొలగించి ప్రొఫెసర్ మనోహర్ సస్పెన్షన్ ను వెంటనే ఎత్తేయాలని యూనివర్సిటీ టీచర్స్ , డెమోక్రటిక్ ఆల్ టీచర్స్ అసోసియేషన్ (డాటా) నేతలు డిమాండ్ చేశారు. ఆదివారం అబిడ్స్ బీసీసీఈ కార్యాలయంలో అసోసియేషన్ అధ్యక్షుడు ప్రొఫెసర్ ఎండి మోహినుద్దీన్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా ప్రొఫెసర్ కే చక్రధరరావు, సీనియర్ ప్రొఫెసర్లు హాజరై మాట్లాడారు. వక్తలుగా ప్రొఫెసర్లు కే శ్రీనివాసులు, అన్వర్ ఖాన్, రత్నం, ఎం వెంకట దాసు, ఒలిగి ప్రభాకర్, ఎం నరసయ్య, ఎం సారముదాసు, ఓయూ ప్రొఫెసర్ రామ్ చందర్, నేతన్యాల్, మాధురి, శశికళ, గన్నారపు సరోజన తదితరులు పాల్గొన్నారు. వీరంతా మాట్లాడుతూ.. ఉస్మానియా వైస్ ఛాన్సర్ కుమార్ యూనివర్సిటీలో ప్రజాస్వామిక వాతావరణాన్ని నడుపుతున్నాడని అన్నారు. చరిత్ర ఉన్న ఓయూ నేడు ఒక పోలీస్ స్టేషన్ గా మారిందన్నారు. ప్రొఫెసర్ మనోహర్ సస్పెన్షన్ అప్రజా స్వామికమని వెల్లడించారు. సి ఏ ఎస్ అనేది వైస్ ఛాన్సర్లు వేసే బిక్ష కాదని, అది పోరాడి సాధించుకున్న హక్కుగా అభివర్ణించారు. యూనివర్సిటీలో ఖాళీగా ఉన్న 950 ప్రొఫెసర్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని సూచించారు. ప్రొఫెసర్ మనోహర్ ను విధుల్లోకి తీసుకోకుంటే ఒక పెద్ద ఉద్యమం నిర్వహిస్తామని వారు హెచ్చరించారు.

# ఉప్పల్ ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా క్లబ్ నూతన కార్యవర్గం ఏకగ్రీవం

### ఉప్పల్ ప్రింటు మరియు ఎలక్ట్రానిక్ మీడియా క్లబ్ అధ్యక్షులుగా సీనియర్ జర్నలిస్ట్ వడ్డేపల్లి కిషోర్





ఉప్పల్, ఫిబ్రవరి 1(సూర్య మేజర్ న్యూస్): ఉప్పల్ ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా క్లబ్ నూతన అధ్యక్షులుగా సీనియర్ జర్నలిస్ట్ వడ్డేపల్లి కిషోర్ ఎన్నికయ్యారు, ఉప్పల్ లో సీనియర్ జర్నలిస్టులు కదారి బాలేశం, చంద్రమౌళిల ఆధ్వర్యంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ఉప్పల్ ప్రింట్ ఒ ఎలక్ట్రానిక్ మీడియా క్లబ్ నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికయ్యింది. నూతన అధ్యక్షుడుగా వడ్డేపల్లి కిషోర్, ప్రధాన కార్యదర్శులుగా ఆనంద నర్సింహరెడ్డి, పెంబళ్ల కుమార్, క్రమశిక్షణా కమిటీ ఛైర్మన్‌గా కొలనుపాక చంద్రమౌళి, గౌరవ సలహదారులుగా కదారి బాలేశం, మాటూరి శ్రీనివాస్, మచ్చ శ్రీహరి, కంచు శ్రీనివాస్, డి సురేష్, పారెల్లి సాగర్, గౌరవ అధ్యక్షులుగా ఓంకారం సంతోష్ రాజు, వర్కింగ్ ప్రెసిడెంట్ గా పయ్యావుల సంతోష్, డిప్యూటి జనరల్ సెక్రటరీగా సీసా నాగరాజు, ఉపాధ్యక్షులుగా బోడ ప్రవీణ్, కందుకూరి ప్రశాంత్, గోరుకంటి నరేందర్, దొంతు స్టాలిన్, కోశాధికారులుగా రెడ్డిమల్ల యాదగిరి, సారా వెంకటేష్ గౌడ్, ఆర్గనైజింగ్ కార్యదర్శులుగా పి.తిరుమల్ రెడ్డి, దూదేకుల మౌలాలి, కొయ్యేడి కరుణాకర్, ఎడపాక సురేష్, దొడ్డి శోభన్, శ్రవణ్, జాయింట్ సెక్రటరీ గా బల్ల సూర్యం, దత్రపు దేవా, ప్రవీణ్, కె. జీవన్ గౌడ్, సాంస్కృతిక కార్యదర్శిలుగా పబ్బు కిరణ్, ఉపేందర్, షేక్ పాషా, ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులుగా బి.వి.రాజు, విష్ణు, ఎన్.ఎస్.రెడ్డి, లక్ష్మణ్, వెంకట్ రెడ్డి, సోనిశ్రీ, ప్రసాద్, చంద్రశేఖర్, అరుణ్, శ్రీకాంత్, శ్రీధర్, సిద్దు, జి.వెంకటేష్, సి.చరేష్, డి.శివ తదితరులు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా అధ్యక్షులు వడ్డేపల్లి కిషోర్ మాట్లాడుతూ ఉప్పల్ నియోజకవర్గంలో ప్రింట్ మరియు ఎలక్ట్రానిక్ మీడియా సమస్యల పరిష్కారం, జర్నలిస్టుల హక్కుల పరిరక్షణ, ప్రజా సమస్యలను నిష్పాక్షికంగా వెలుగులోకి తీసుకురావడమే తమ ప్రధాన లక్ష్యమని తెలిపారు. అలాగే, యువ జర్నలిస్టులకు మార్గదర్శకత్వం అందిస్తూ మీడియా వృత్తికి గౌరవం తీసుకొచ్చేలా నూతన కమిటీ పని చేస్తుందని పేర్కొన్నారు. ఈ నూతన కమిటీ ఏర్పాటుతో ఉప్పల్ మీడియా వర్గాల్లో కొత్త ఉత్సాహం నెలకొందని, జర్నలిజం మరింత బలంగా ముందుకు సాగుతుందని పలువురు సీనియర్ జర్నలిస్టులు వారికి అభినందనలు తెలిపారు.

# తెలంగాణ బిసివై పీఏసీ సభ్యుడిగా ఓరుగంటి వెంకటేశ్వర్లు



హైదరాబాద్, మేజర్ న్యూస్: భారత చైతన్య యువజన పార్టీ (బిసివై) తెలంగాణ పొలిటికల్ ఎఫైర్స్ కమిటీ (పీఏసీ) సభ్యుడిగా మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లాకు చెందిన ఓరుగంటి వెంకటేశ్వర్లును నియమించారు. పార్టీ పట్ల ఆయనకున్న అంకితభావం, క్షేత్రస్థాయిలో ప్రజలతో ఆయనకున్న సంబంధాలను గుర్తించిన బిసివై పార్టీ జాతీయ అధ్యక్షులు బోడె రామచంద్రయాదవ్ ఈ పదవిని కేటాయించారు. ఈ నియామకం పట్ల ఓరుగంటి వెంకటేశ్వర్లు హర్షం వ్యక్తం చేశారు. పీఏసీ సభ్యుడిగా తనను నియమించినందుకు పార్టీ జాతీయ అధ్యక్షులు రామచంద్రయాదవ్ కు ఆయన ధన్యవాదాలు తెలిపారు. తెలంగాణలో పార్టీని బలోపేతం చేయడానికి, ప్రజా సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు. పార్టీ విధానాలను ప్రజలకు వివరిస్తూ, వారిని చైతన్యవంతులను చేస్తానని ఆయన తెలిపారు.

# ఆలియా ప్రభుత్వ పాఠశాలలో ట్రాఫిక్ అవగాహన పార్క్ ప్రారంభం



**మొదటి పేజీ తరువాయి :**బాధ్యతఅని,రోడ్డు ప్రమాదాల కారణంగా ప్రతి రోజు సగటున 20 మంది వరకు ప్రాణాలను కోల్పోతున్నారని,ట్రాఫిక్ భద్రతను పాఠశాలస్థాయినుంచే ఒక సక్రమ విద్యా అంశంగా ప్రవేశపెట్టాల్సిన అవసరం ఎంతో ఉందన్నారు. రాబోయే రోజుల్లో విద్యార్థులు,తల్లిదండ్రుల భాగస్వామ్యంతో ఆన్‌లైన్ సర్టిఫికేషన్,ప్రతిజ్ఞ విధానాన్ని ట్రాన్స్‌పోర్ట్ శాఖ అమలు చేయనుందని,ఇదే తరహాలో ట్రాఫిక్ అవగాహన పార్కులను, ఇతర పాఠశాలల్లోకూడా ఏర్పాటు చేస్తామని,ప్రతి వాహనాదారుడు హెల్మెట్‌ను తప్పకుండా ధరించాలన్నారు. రవాణా శాఖ కమీషనర్ ఇలంబర్తి ప్రసంగిస్తూ తెలంగాణ రాష్ట్రంలో ప్రతి ఏటా సుమారు 7వేల మంది రోడ్డు ప్రమాదాల్లో మృతి చెందుతున్నారని,ఇందులో పాదచారులు,ద్విచక్రవాహనాదారులు,వృద్ధ వయస్సుగలవారు అధికంగా ఉన్నారన్నారు. ద్విచక్రవాహనాదారులకు రక్షణగా హెల్మెట్ వాడడం అత్యంత కీలకమని,రోడ్డు సేఫ్ట్ మాసం సందర్భంగా 64 ప్రభుత్వ,117 ప్రైవేట్ పాఠశాలలు కల్పి మొత్తం 181 పాఠశాలల్లో 24,648 మంది విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించామన్నారు. నగర ట్రాఫిక్ జాయింట్ కమీషనర్ జోయల్ డేవీస్ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలు కుటుంబాలపై తీవ్ర దీర్ఘకాలక ప్రభావం చూపుతాయని,కుటుంబ ఆదాయ భారం కోల్పోతే ఆర్థిక ఇబ్బందులు,పిల్లల విద్యలో అంతరాయం కలుగుతుందన్నారు. ఈ ట్రాఫిక్ అవగాహన పార్క్‌లో చిన్న పరిమాణంగల అస్ఫాల్ట్ రోడ్లు,సరైన లేన్ మార్కింగ్‌లు,జీబ్రా క్రాసింగ్‌లు,పనిచేసే ట్రాఫిక్ సిగ్నల్స్,సంపూర్ణ రోడ్డు సూచికలు ఏర్పాటు చేయబడడం జరిగిందన్నారు. పిల్లలు నియంత్రిత వాతావరణంలో నగర ట్రాఫిక్ ।క్రమశిక్షణను ప్రాక్టికల్‌గా నేర్చుకునేలా రూపొందించబడిన ఈ కార్యక్రమంలో అనుభవాత్మక,ఇంటరాక్టివ్ విద్యా ద్వారా రోడ్డు క్రమశిక్షణను అలవర్చించి,రోడ్డు ప్రమాదాలను తగ్గించడమే లక్ష్యంగా పెట్టుకుందన్నారు. ఈ కార్యక్రమంలో యూనిసెఫ్ ప్రతినిధులు డా. జెలాంలెం, డా. శ్రీధర్,జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమీషనర్లు రమేష్, చంద్రశేఖర్‌గౌడ్,హైదరాబాద్ జిల్లా అధికారి పురుషోత్తంరెడ్డి,జిల్లా విద్యా శాఖాధికారి ఆర్. రోహిణి,కార్పొరేటర్ సురేఖ,రాష్ట్ర రవాణా ఆథారిటీ సభ్యులు సురేష్‌తోపాటు ట్రాన్స్‌పోర్ట్ విద్య,ట్రాఫిక్ పోలీసు శాఖల అధికారులు,పాఠశాల సిబ్బంది,విద్యార్థులు పాల్గొన్నారు.

**IN THE COURT OF HON'BLE PRINCIPAL SENIOR CIVIL JUDGE, M.M DISTRICT.**
**AT: KUSHAIGUDA.**
**S.O.P. No. 48 OF 2025**
**BETWEEN:**
1. Sudi Aparna W/o Late. Anugu Ranjith Kumar, Aged 29 Years, Occ: Pvt Employee,
2. Master Anugu Nivaditha Reddy D/o. Late. Anugu Ranjith, Aged about 17 months,
Rep. by her Natural Guardian Petitioner No.1 Sudi Aparna, Both are R/o. Plote No.14/SP, Rampally, Keesara Mandal Medchal-District.
**.....Petitioners**
**AND**
1. M/s Capgemini Technology Services India Limited. No 158-162P & 165-170P, EPIP Phase-II, Whitefield, Bengaluru, 560066.
2. Anugu Alivelu w/o Anugu Venkataiah R/o H no 1-10 Kothulabad (Village) Palakurthy (Mandal) Jangoan District
3.All Concern
**....Respondents**
Whereas, Smt. Sudi Aparna and another, have instituted the above Succession to declare them as the Legal Heirs and successors of Late. Anugu Ranjith Kumar.
The above case is posted to 06-02-2026 at about 10-30 Am for filing any objection from any one for if no objection will receive from any one the matter will be decided on merits before the said Hon'ble Court.
**(BY THE ORDER OF THE HON'BLE COURT)**
M/s. **D.MADHUKER REDDY**
**P.SANGAMESHWAR,**
Advocates
H.No.5-31, Buddha Nagar, Peerzadiguda, Uppal Depot, Medipalli Mandal, MM Dist.

**IN THE COURT OF THE HON'BLE II ADDITIONAL JUNIOR CIVIL JUDGE, MEDCHAL-MALKAJGIRI DISTRICT**
**AT : KUSHAIGUDA**
**O.S NO. 43 OF 2026**
**Between :**
Smt.Sangeeta Milind Sardesai
**...Plaintiff**
**AND**
The Tahsildar and all concerned
**...Defendants**
**To,**
Whomsoever it may concern
Whereas the Plaintiff had filed above suit against the Defendants for declaration to declare her as the only legal heir, representative and successor of Late Moreshwar Vinayak Desai who died intestate on 14.07.2003 and Late Sunita Moreshwar Desai who died intestate on 17.03.2025.
Take notice that the above case is posted to 25-02-2026 at 10:30 am for appearance and filing objections if any, in default, the case will be decided ex-parte in accordance with law.
**(BY ORDER OF THE COURT)**
**ROHIT PUTTAKOTA**
ADVOCATE
#31/B, First Floor, HMWS & SB Lane, Near Shenoy Nursing Home, East Marredpally, Secunderabad - 500026,
**Mobile No:9533755747**

# పార్టీ పట్ల నిబద్ధతతో పనిచేసే కార్యకర్తలకు తగిన గుర్తింపు : బండి రమేష్



**కూకట్ పల్లిలో కాంగ్రెస్ పార్టీలోకి భారీ చేరికలు**

**200 మంది బిఆర్ఎస్ కార్యకర్తల కాంగ్రెస్ ప్రవేశం**

కూకట్ పల్లి మేజర్ న్యూస్ : కూకట్ పల్లి నియోజకవర్గంలో రాజకీయ పరిణామాలు వేగంగా మారుతున్నాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల ప్రభావంతో ఇతర పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలోకి ఆకర్షితులవుతున్నారని టీపీసీసీ ఉపాధ్యక్షుడు, కూకట్ పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ బండి రమేష్ తెలిపారు.
బిఆర్ఎస్ నాయకుడు మోటేపల్లి రంగ మోహన్ ఆధ్వర్యంలో కేపిహెచ్బి కాలనీ బస్టాండ్ వద్ద నిర్వహించిన బహిరంగ సభలో సుమారు 200 మంది బిఆర్ఎస్ కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో బండి రమేష్ వారికి కాంగ్రెస్ కండువాలు కప్పి పార్టీలోకి అధికారికంగా ఆహ్వానించారు.
ఈ సందర్భంగా బండి రమేష్ మాట్లాడుతూ, పార్టీ పట్ల నిబద్ధతతో పనిచేసే కార్యకర్తలకు తగిన గుర్తింపు, బాధ్యతలు సహజంగానే లభిస్తాయని పేర్కొన్నారు. రానున్న జిహెచ్ఎంసి ఎన్నికలను దృష్టిలో ఉంచుకుంటే కాంగ్రెస్ పార్టీలోకి జరుగుతున్న ఈ చేరికలు శుభ పరిణామమని, ప్రతి కార్యకర్త ఎన్నికల విజయానికి కృషి చేయాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు.
అంతకుముందు మోటేపల్లి రంగ మోహన్ నేతృత్వంలో కూకట్ పల్లి ప్రభుత్వ కళాశాల నుంచి కేపిహెచ్బి బస్టాండ్ వరకు పార్టీ కార్యకర్తలతో భారీ ఎత్తున ద్విచక్ర వాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా బాణాసంచా కాల్చి, కాంగ్రెస్ పార్టీకి మద్దతుగా నినాదాలు చేశారు.
ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, యువ నాయకులు, స్థానిక కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# తెలంగాణ స్టేట్ టైక్వాండో యూనియన్ కలర్ బెల్ట్ ప్రమోషన్ టెస్ట్!




ముషీరాబాద్ మేజర్ న్యూస్ : న్యూ ఏజ్ గ్లోబల్ స్కూల్ లో టైక్వాండో కలర్ బెల్ట్స్ మాస్టర్, కేపీ,,హనుమాన్ ఆధ్వర్యంలో ప్రమోషన్ చేయడం జరిగింది ఇందులో భాగంగా బాలబాలికలు దాదాపు 40 నుంచి 50 మంది పాల్గొనడం జరిగింది బెల్టు ప్రమోషన్ టెస్ట్ ని ఉద్దేశించి ప్రిన్సిపాల్ నీరుగొండ ఫణి కుమారి,, ప్రసంగించడం ప్రతి ఒక్క విద్యార్థిని విద్యార్థులు ఈ యొక్క టైక్వాండోమార్షల్ ఆర్ట్ విద్యను శరీర దృఢత్వమే కాకుండా మనలోని ఆత్మస్థైర్యాన్ని, ధైర్యాన్ని ఆలోచన శక్తిని,పెంచుతుందని ప్రతి ఒక్కరు నేర్చుకోవాలని కోరారు ఇందులో ముఖ్య అతిథులుగా న్యూ ఏజ్ గ్లోబల్ స్కూల్ ప్రిన్సిపల్ ఫణి కుమార్,, తెలంగాణ టైక్వాండో యూనియన్ ఛైర్మన్ కేపీ హను మంతు,సీనియర్ కోచ్ లో కే నరేందర్ యాదవ్, ఏ లోకేష్, ఉదయ్ కుమార్, చంద్రశేఖర్, ఎన్ మౌనిక, జి శిరీష, చరణ్, సుమిత్, తదితరులు ,పాల్గొన్నారు.

# కేసీఆర్‌పై రాజకీయ కక్షతో ప్రజల మనసుల నుంచి తొలగించలేరు

**-కార్పొరేటర్ మాధవరం రోజా దేవి రంగారావు**

**-సిట్ నోటీసులపై శేరిలింగంపల్లి నియోజకవర్గంలో నిరసన ర్యాలీ**

**-సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మ దహనం**



కూకట్ పల్లి మేజర్ న్యూస్ : రాజకీయ కక్షసాధింపు చర్యలతో ప్రజల గుండెల్లో నుంచి కేసీఆర్‌ను తొలగించడం సాధ్యం కాదని వివేకానంద నగర్ డివిజన్ కార్పొరేటర్ మాధవరం రోజా దేవి రంగారావు అన్నారు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి, బిఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్ కు సిట్ నోటీసులు జారీ చేసిన చర్యను ఖండిస్తూ శేరిలింగంపల్లి నియోజకవర్గం వివేకానందనగర్ డివిజన్ పరిధిలో బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు.
వివేకానందనగర్ డివిజన్ మాధవరం నగర్ కాలనీలోని డివిజన్ పార్టీ కార్యాలయం నుంచి స్థానిక పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ర్యాలీగా బయలుదేరిన వారు వడ్డేపల్లి ఎంక్లేవ్ వద్ద ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. అనంతరం కార్యకర్తలతో కలిసి తెలంగాణ భవన్‌కు బయలుదేరారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాధవరం రోజా దేవి మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ చేపడుతున్న డైవర్షన్ రాజకీయాలను తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. కేసీఆర్‌పై జరుగుతున్న దుష్ప్రచారాన్ని ప్రజలు గమనిస్తున్నారని, త్వరలోనే కాంగ్రెస్ పార్టీకి ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని ఆమె వ్యాఖ్యానించారు.
ఈ నిరసన కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీకి చెందిన నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ముషీరాబాద్‌లో నిరసన!



ముషీరాబాద్ మేజర్ న్యూస్ : తెలంగాణ జాతిపిత, తెలంగాణ రాష్ట్ర సాధన నాయకుడు కెసిఆర్ ను విచారణ పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం ఇబ్బందులకు గురి చేయడం దుర్మార్గమైన చర్యని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మాజీ ముఖ్యమంత్రి, అధినేత కేసిఆర్ ను సిట్ అధికారులు విచారణకు పిలవడానికి నిరసిస్తూ గాంధీనగర్ డివిజన్లోని జవహర్ స్కూల్ వద్ద గాంధీనగర్ డివిజన్ బి.ఆర్.ఎస్ అధ్యక్షుడు ముడారపు రాకేష్ కుమార్ ఆధ్వర్యంలో ముషీరాబాద్ శాసనసభ్యులు శ్రీ ముఠాగోపాల్ గారి ఆదేశాల మేరకు ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేసి సీఎం రేవంత్ రెడ్డికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు . ఈ కార్యక్రమంలో పున్న సత్యనారాయణ, ముఠా నరేష్,ఎర్రం శ్రీనివాస్ గుప్త, నరేష్,వెంకటేష్, పాశం రవి, ఎస్టీ ప్రేమ్,దేవయ్య, ముఠా శివ సింహ, రవిశంకర్ గుప్తా, బీటీ సత్యనారాయణ, సంతోష్,ఎం ఆనంద్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

# పాపారాయుడు నగర్‌లో శ్రీ సంజీవని ఆంజనేయ స్వామి వార్షికోత్సవం

**- శ్రీ సీతారామచంద్ర స్వామి కళ్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహణ**

**-ప్రత్యేక పూజల్లో పాల్గొన్న వడ్డేపల్లి రాజేశ్వరరావు**



కూకట్‌పల్లి మేజర్ న్యూస్ :కూకట్‌పల్లి పాపారాయుడు నగర్‌లోని శ్రీ సంజీవని ఆంజనేయ స్వామి ఆలయంలో తృతీయ వార్షికోత్సవ పూజ మహోత్సవం, అలాగే శ్రీ సీతారామచంద్ర స్వామి కళ్యాణ మహోత్సవం సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు భక్తిశ్రద్ధలతో ఆలయాన్ని సందర్శించి పూజల్లో పాల్గొన్నారు.
రాజేశ్వరరావు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, సమస్త ప్రజల శ్రేయస్సు, రాష్ట్రాభివృద్ధి, శాంతి సౌభ్రాతృత్వాల కోసం ప్రార్థనలు చేశారు. అనంతరం మాట్లాడుతూ, ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు సమాజంలో శాంతి, ఐక్యత, ధార్మిక విలువలను పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. యువత ధార్మిక కార్యక్రమాల్లో పాల్గొనడం ద్వారా క్రమశిక్షణ, సత్సంకల్పం అలవడుతాయని తెలిపారు. సంప్రదాయాలు, సంస్కృతి పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్న ఆయన, ఆలయాల ద్వారా ఆధ్యాత్మిక చైతన్యం విస్తరించాల్సిన అవసరం ఉందని అన్నారు.
ఈ పూజా కార్యక్రమాలను ఘనంగా నిర్వహించిన ఆలయ కమిటీ సభ్యులను వడ్డేపల్లి రాజేశ్వరరావు అభినందించారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి కార్యక్రమాలు విజయవంతంగా కొనసాగాలని ఆకాంక్షించారు.
ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు, స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# రాజకీయాలు దిగజారిపోయాయి అనడానికి అంబటి రాంబాబు మాటలు నిదర్శనం -వల్లారపు శ్రీనివాస్



సీతాఫలమండి, మేజర్ న్యూస్: చంద్రబాబుపై అంబటి రాంబాబు మాట్లాడిన మాటలు క్షమించరానివి, రాజకీయాలు దిగజారిపోయాయి అనడానికి అంబటి రాంబాబు మాటలు నిదర్శనం. చేసిన పాపానికి సిగ్గుతో తలదించుకోవాల్సింది పోయి అచ్చోసిన ఆంబోతుల్లా అసత్యాలు ప్రచారం చేస్తూ నాటకాలాడుతున్నారని తెలుగుదేశం పార్టీ సికింద్రాబాద్ నియోజకవర్గం ఇంచార్జ్ వల్లారపు శ్రీనివాస్ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. గతంలో అసెంబ్లీ సాక్షిగా చంద్రబాబు కుటుంబాన్ని అంబటి రాంబాబు అవమానించాడు. నేడు అంబటి ఒక ఆంబోతులా ప్రవర్తిస్తూ చంద్రబాబుపై దుర్భాషలాడుతున్నాడు. అంబటి రాంబాబును రాజకీయాల నుంచి బహిష్కరించాలి. గతంలో వైసీపీ నేతలు అసెంబ్లీలో మహిళలపై అసభ్యకరమైన వ్యాఖ్యలు చేసే 11 సీట్లకు పరిమితమయ్యారు. ఈ రోజు మాట్లాడిన భాష, రెచ్చగొడుతున్న తీరు చూస్తుంటే వైసీపీ నేతలు ప్రజా జీవితంలో ఉండడానికే అర్హులు కాదు. ఇటువంటి బూతులు భవిష్యత్తులో ఎవరూ మాట్లాడకుండా కేసు నమోదు చేసి సంబంధిత అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలి.

# దళితుడి భూమికి అధికారులు రక్షణ కల్పించలేరా



హిమాయత్ నగర్, మేజర్ న్యూస్ : దళితుడినైనందుకే జగద్గిరిగుట్ట లోని తన భూమిని కబ్జాదారులు ఆక్రమించుకున్నారని కాంగ్రెస్ పార్టీ మాజీ ఎస్సీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వయ్యా వినోద్ (69, తండ్రి ముత్తయ్య ) ఆందోళన వ్యక్తం చేశారు. తన భూమికి అధికారులు ఎందుకు రక్షణ కల్పించలేరని ఆయన ప్రశ్నించారు. ఈ మేరకు ఆయన మెడలో చెప్పుల దండ వేసుకుని నిరసన తెలుపుతూ హైదర్గూడా, ఎన్ఎస్ఎస్ భవనంలో తన సహచరులతో కలిసి మీడియాతో మాట్లాడారు. జగద్గిరిగుట్టలోని సర్వే నంబర్ 348/1 లో ఉన్న 1700 గజాల భూమిని చంద్ర రుక్మిణి తో కలిసి 2000 సంవత్సరములో కొన్నానన్నారు. అప్పటినుంచి ఆ భూమిలో రాజీవ్ గాంధీ అనాధాశ్రమం పెట్టి అక్కడే నివసిస్తున్నట్లు తెలిపారు. 2014లో రెగ్యులరైజ్ చేసుకునేందుకు అప్పటి టిఆర్ఎస్ ప్రభుత్వ ప్రకటన మేరకు అప్లై చేసుకున్నట్లు తెలిపారు. ఈ సమయంలో అదే ప్రాంతానికి చెందిన మహేశ్వరరెడ్డి, రాజ్యలక్ష్మి, హనుమయ్య ,వెంకటేష్, వద్దెర చంద్రయ్య తన క్రమబద్ధీకరణకు అడ్డుపడుతూ, కబ్జాకు పూనుకున్నారని చెప్పారు. దీంతో 2018లో హైకోర్టు కు వెళ్లగా స్థానిక పోలీసులు, ఆర్డిఓ ను రక్షణ కల్పించాల్సిందిగా ఆదేశించినట్లు తెలిపారు. కానీ వీరు కబ్జాదారులపై కలిసిపోయి తన పైనే కేసులు పెట్టి జైలుకు పంపినట్లు వాపోయారు. 2019లో వీరంతా కలిసి దొంగ డాక్యుమెంట్లను సృష్టించి భూమిని తాను అమ్ముకున్నట్లుగా నమ్మించే ప్రయత్నం చేశారని అన్నారు. వీరికి ప్రస్తుత సీఐ వెంకటేశం వత్తాసు పలుకుతున్నట్లుగా వెల్లడించారు. కనుక కోర్టు తీర్పు ప్రకారం భూమిని తనకు అప్పగించాలని కోరారు. కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్న వ్యక్తులపై కేసులు పెట్టాలని అన్నారు. కబ్జాదారులకు వంత పాడుతున్న స్థానిక సీఐ , ఎస్ఐలను వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు.

# ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి : ఎమ్మెల్యే గాంధీ




హాఫీజ్ పెట్,మేజర్ న్యూస్ : ప్రజలు ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే గాంధీ అన్నారు.ఆదివారం గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని నల్లగండ్ల హుడా కాలనీలో హుడా జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో శ్రీకృష్ణ యూత్, స్కంద ఆసుపత్రి, రెటినోవా ఐ కేర్ ఆస్పత్రులు సంయుక్తంగా ఏర్పాటు చేసిన ఉచిత మెగా వైద్య శిబిరం.మాదక ద్రవ్యాల నివారణ అవగాహన కార్యక్రమాన్ని ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ ఆదివారం కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి తో కలిసి ముఖ్యఅతిథిగా ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్రీకృష్ణ యూత్, స్కంద ఆసుపత్రి, రెటినోవా ఐ కేర్ ఆస్పత్రులు పేద ప్రజలకు ఉచిత వైద్య సేవలు అందించడం అభినందనీయం, ఆరోగ్యంపై ప్రజలు శ్రద్ధ వహించాలని సూచించారు. శిబిరంలో జనరల్ మెడిసిన్, గైనకాలజీ, పిల్లల వైద్యం, ఆర్థో, చర్మ, నేత్ర, ఈ ఎన్ టి తదితర విభాగాల వైద్యులు ఉచిత పరీక్షలు, మందులు పంపిణీ చేశారు.అదేవిధంగా మాదక ద్రవ్యాల వల్ల యువత భవిష్యత్తు కలిగే నష్టాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు గణేష్ ముదిరాజ్, మంత్రిప్రగడ సత్యనారాయణ, చాంద్ పాషా , అనిల్ ,ప్రభాకర్ రెడ్డి, నగేష్, వేణు గోపాల్ రెడ్డి, మల్లేష్, సలావుద్దీన్, విశ్వనాథ్, పూరీ, అనిల్, రాజేందర్,సురేష్, లక్ష్మణ్, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

# లైసెన్స్డ్ సర్వేయర్లను త్వరగా వీధుల్లోకి తీసుకోవాలి



హిమాయత్ నగర్ , మేజర్ న్యూస్ : రాష్ట్ర ప్రభుత్వం భూభారతి కోసం నియమించిన 5 వేల మంది లైసెన్స్డ్ సర్వేయర్లను త్వరగా వీధుల్లోకి తీసుకోవాలని తెలంగాణ ఎల్ఎస్ఎస్ , లైసెన్స్డ్ సర్వేయర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నేతలు విజ్ఞప్తి చేశారు. ఆదివారం బషీర్బాగ్ ప్రెస్ క్లబ్ లో 33 జిల్లాల కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు నగారా రమేష్, వర్కింగ్ ప్రెసిడెంట్ నరేష్ చాగంటి, కార్యదర్శి సందీప్ లు మాట్లాడారు. సుమారు 60 రోజులపాటు తమకు ట్రైనింగ్ ఇచ్చి లైసెన్సులు అందించిన, ఇంతవరకు వీధిలోకి తీసుకోలేదని ఆవేదన చెందారు.గత అక్టోబర్ 2 నుంచి విధుల్లోకి తీసుకుంటామని మంత్రి పొంగులేటి అన్నప్పటికీ, ఫలితం లేదన్నారు. తమకు ఉద్యోగ భద్రత , స్థిరమైన జీతాన్ని నిర్దేశించాలని కోరారు. హెల్త్ బీమా కల్పించి సొంత మండలంలో పని కల్పించాలని చెప్పారు. ఎస్ ఆర్ ఓ లతో అటాచ్ చేస్తే తమకు పని పెరిగే అవకాశం ఉన్నట్లు సూచించారు. ప్రతి సర్వేయర్ 2000 ఎకరాలు సర్వే చేస్తే రూ .40 వేల జీతం ఇస్తామనడం తగదని అన్నారు. ప్రభుత్వం తమ విధానాలపై పునః సమీక్ష చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. విధుల్లో భాగంగా ప్రతి ఒక్కరికి రోవర్, ల్యాప్టాప్ సబ్సిడీపై కల్పించాలని కోరారు. ప్రతి రెండు సంవత్సరాలకు రెన్యువల్ కాకుండా, తమను శాశ్వత ఉద్యోగులుగా పరిగణించాలని చెప్పారు. ఏ విధమైన జీతభత్యాలు లేకుండా గత ఎనిమిది నెలల్లో ఒక్కో అభ్యర్థి లక్ష ఖర్చు చేసినట్లు వెల్లడించారు. హైదరాబాద్ జిల్లాకు చెందిన 43 మంది సర్వేర్ లను స్థానిక ఎమ్మార్వో ఆఫీసుల్లో గాని సమీప మండలాలకు గాని కేటాయించాలని సూచించారు.తమ పట్ల రెవిన్యూ మంత్రి పొంగులేటి , ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సానుకూల నిర్ణయం తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో పరమేష్, రాజు, సురేష్ ,సౌందర్య, శివ, జగదీష్, అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

## మియాపూర్ డివిజన్‌లో సీసీ రోడ్డు పనులను పరిశీలించిన కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్



మియాపూర్,మేజర్ న్యూస్ : మియాపూర్ డివిజన్‌లోని అన్ని కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం ఇస్తున్నామని కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ అన్నారు.ఆదివారం మియాపూర్ డివిజన్ పరిధిలోని నాగార్జున ఎనక్లేవ్ కాలనీ, కృషి నగర్ కాలనీలో నూతనంగా చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ స్థానిక నాయకులు, కాలనీ వాసులతో కలిసి పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మియాపూర్ డివిజన్‌లోని అన్ని కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం ఇస్తామని, సీసీ రోడ్డు పనులు నాణ్యతా ప్రమాణాలతో చేపట్టాలని తెలిపారు. పనుల్లో జాప్యం లేకుండా త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ సహకారం తో డివిజన్ అభివృద్ధికి శాయశక్తులా కృషి చేస్తానని తెలిపారు.ఈ కార్యక్రమంలో నాగార్జున ఎనక్లేవ్ కాలనీ అధ్యక్షుడు సత్యనారాయణ,కాలనీ వాసులు వర్మ, సుధాకర్ బాబు, మాధవి, మోహన్ రావు, మహేశ్వర్ రెడ్డి, కృషి నగర్ కాలనీ వాసులు పాపి రెడ్డి, వంశీకృష్ణారెడ్డి, పద్మనాభన్, చంద్ర ఓబుల్ రెడ్డి, శ్రీనివాస్, ప్రసాద్, సురేష్ రెడ్డి, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# స్టార్ సైక్లోథాన్ - క్యాన్సర్ అవగాహన కార్యక్రమం




హైదరాబాద్, మేజర్ న్యూస్ ప్రతినిధి: ప్రపంచ క్యాన్సర్ దినోత్సవాన్ని పురస్కరించుకుని, ఆదివారం నానక్‌రామ్‌గూడలో స్టార్ క్యాన్సర్ సెంటర్ (స్టార్ హాస్పిటల్స్), 'ఫిట్ ఇండియా' 'హైదరాబాద్ సైక్లింగ్ రివల్యూషన్' తో కలిసి 'స్టార్ సైక్లోథాన్ -- క్యాన్సర్ అవేర్‌నెస్ రైడ్ 2026' ఘనంగా నిర్వహించబడింది. దాదాపు 1,000 మంది సైక్లిస్టులు పాల్గొన్న 10కిమీ ర్యాలీ, తెలంగాణలో క్యాన్సర్ అవగాహన కోసం నిర్వహించిన అతిపెద్ద సైక్లింగ్ ఈవెంట్‌గా రికార్డు సృష్టించింది. ఈ కార్యక్రమం "యునైటెడ్ బై యూనిక్ " నినాదంతో నిర్వహించబడింది. వైద్యులు, క్యాన్సర్ నుండి కోలుకున్న వారు, విద్యార్థులు, కార్పొరేట్ ఉద్యోగులు కలసి ముందస్తు స్క్రీనింగ్, ఆరోగ్యకరమైన జీవనశైలి ప్రాధాన్యతను ప్రజలకు వివరించారు. భారత్‌లో ప్రతి సంవత్సరం 14 లక్షల కొత్త కేసులు నమోదవుతున్నాయి, ఎక్కువ మంది ముదిరిన దశల్లో గుర్తించబడుతున్నారు, అందువల్ల ముందస్తు గుర్తింపు చాలా అవసరం. హైదరాబాద్ "బ్రెస్ట్ క్యాన్సర్ రాజధాని "గా పిలువబ డుతోంది, 1,00,000 మహిళల్లో 54 కేసులు నమోదు అవుతుండగా, జాతీయ సగటు 26.6 మాత్రమే.డాక్టర్ సాయినాథ్ భేతనభొట్ల మాట్లాడు తూ: "ముందస్తు స్క్రీనింగ్ ప్రాణరక్షకంగా ఉంటు ంది." డాక్టర్ విపిన్ గోయల్ రోబోటిక్, కనిష్ట ఇ న్వాసివ్ శస్త్రచికిత్స ద్వారా రోగులు వేగంగా కోలుకుంటారని వివరించారు. ఎండి డాక్టర్ గోపిచంద్ మన్నం: "ప్రతి రోగికి ఆర్గన్–స్పెసిఫిక్ కేర్ అందిస్తున్నాం; అవగాహన, స్క్రీనింగ్ ద్వారా మాత్రమే ప్రయాణం ప్రారంభమవుతుంది." స్టార్ సైక్లోథాన్ కేవలం ఫిట్‌నెస్ ఈవెంట్ కాదు; క్యాన్సర్ అవగాహన పెంచడం, అపోహలను తొలగించడం, కోలుకున్న వారికి మద్దతు ఇవ్వడం లక్ష్యం. హైదరాబాద్ నగరం ఈ సామాజిక ఉద్యమంలో ఒక్కటిగా నిలిచింది

# మున్సిపల్ ఎన్నికల బరిలో మేడి నరేష్



కర్మన్ ఘాట్, మేజర్ న్యూస్ :బీసీ,ఎస్సీ, ఎస్టీ,మైనార్టీ అగ్రవర్ణాల పేదల బిడ్డగా చిట్యాల మున్సిపాలిటీ 1 వ వార్డు అభ్యర్థిగా మేడి నరేష్ పోటీ పడుతున్నారు. కొన్ని సంవత్సరాలుగా ప్రజా సమస్యల పట్ల పోరాడుతూ ప్రజలకు సేవలు అందిస్తున్నారు. అవినీతితో కలుషితమైన పార్టీలలో కొనసాగటం ఇష్టం లేక పేదల సంక్షేమం కోసం పాటుపడే పార్టీ ఏకైక పార్టీ బహుజన్ సమాజ్ పార్టీ యేనని సొంతగూటికి చేరినట్టు తెలిపారు. పేదల పక్షాన నిలబడి ప్రభుత్వాలను నిలదీసి సమస్యలను పరిష్కరించుకునే అవకాశం నాకు కల్పించే బాధ్యత మీ చేతిలో ఉందని అన్నారు.

## ఘనంగా జయంత్ గుప్తా జన్మదిన వేడుకలు



సరూర్ నగర్ మేజర్ న్యూస్: చైతన్యపురి డివిజన్ బీజేవైఎం ప్రెసిడెంట్ జయంత్ గుప్తా జన్మదిన వేడుకలను కాలనీవాసుల మధ్య ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా స్థానిక కార్పోరేటర్ రంగ నరసింహ గుప్త జయంత్ గుప్తకు శాలువు అందించి సన్మానించారు. జన్మదిన వేడుకల్లో కాలనీవాసులు, డివిజన్ భాజపా కార్యకర్తలు స్నేహితులు కలిసి కేక్ కట్ చేసి, జయంత్ గుప్తను ఘనంగా సత్కరించారు. జయంత్ గుప్తా మాట్లాడుతూ, "కాలనీవాసులు, కార్యకర్తలు, స్నేహితుల మధ్య నా జన్మదిన వేడుకలను జరుపుకోవడం నాకు సంతోషంగా ఉంది. నా జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన అందరికీ నా హృదయపూర్వక కృతజ్ఞతలు." ఈ కార్యక్రమంలో వినోద్ యాదవ్, నవీన్ యాదవ్, రుద్రారపు శంకర్, శ్రీనివాస్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు

# అమీర్‌పేట్ శ్రీ లక్ష్మీ గణనాధుని గుడికి 25 ఏళ్లు



ఖైరతాబాద్ మేజర్ న్యూస్ : అమీర్పేట్‌లోని శ్రీ లక్ష్మీ గణనాధుని గుడి నిర్మించి 25 సంవత్సరాలు పూర్తైన సందర్భంగా గుడి ప్రాంగణంలో ఘనంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం నుంచి అభిషేకాలు, అర్చనలు జరగగా, భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామివారి దర్శనం చేసుకున్నారు. వేడుకల సందర్భంగా అన్నదాన కార్యక్రమాన్ని కూడా విస్తృతంగా నిర్వహించారు. గుడికి వచ్చిన భక్తులకు ప్రసాదం అందిస్తూ సేవా భావాన్ని చాటారు. ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించి కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.ఈ పూజా కార్యక్రమాల్లో సోమాజిగూడ డివిజన్ అధ్యక్షులు, కంటెస్టెడ్ కార్పొరేటర్ నారికల నరేష్ కుమార్‌తో పాటు సునీల్, సుభాష్, బంటి, పరమేశ్, మనోహర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. వారు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్తులకు శుభాకాంక్షలు తెలిపారు.

# కాంగ్రెస్ ప్రభుత్వం కక్షసాధింపు రాజకీయాలకు పాల్పడుతుంది ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు



- ఫోన్ టాపింగ్ కేసు సిట్ విచారణపై బిఆర్ఎస్ ఆందోళనలు
- కూకట్ పల్లి నియోజకవర్గంలో కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేక నిరసనలు
- మాజీ సీఎం కేసీఆర్ నివాసానికి చేరుకుని సంఘీభావం



కూకట్ పల్లి మేజర్ న్యూస్ : ఫోన్ టాపింగ్ వ్యవహారంలో సిట్ విచారణను ఆసరాగా చేసుకుని కాంగ్రెస్ ప్రభుత్వం కక్షసాధింపు రాజకీయాలకు పాల్పడుతోందని కూకట్‌పల్లి నియోజకవర్గం ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆరోపించారు. తెలంగాణ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, బిఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్ ను లక్ష్యంగా చేసుకున్న చర్యలను నిరసిస్తూ, నియోజకవర్గంలోని అన్ని డివిజన్లలో పార్టీ నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు.

అనంతరం ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావుతో పాటు నియోజకవర్గ కార్పొరేటర్లు, బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున నంది నగర్‌లోని మాజీ సీఎం కేసీఆర్ నివాసానికి చేరుకుని సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మాట్లాడుతూ, "కేసీఆర్ తెలంగాణ రాష్ట్రాన్ని సాధించకపోయి ఉంటే, నేడు రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి అయ్యేవారా?" అని ప్రశ్నించారు. కనీస గౌరవం ఇవ్వకుండా కక్షపూరిత రాజకీయాలు చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. అభివృద్ధిని పక్కనపెట్టి విచారణల పేరుతో బిఆర్ఎస్ నాయకులను ఇబ్బంది పెడుతున్న తీరుపై ప్రజల్లో అసంతృప్తి పెరుగుతోందని వ్యాఖ్యానించారు. రాబోయే రోజుల్లో తెలంగాణ రాష్ట్రానికి మళ్లీ కేసీఆర్ ముఖ్యమంత్రి అవుతారని ధీమా వ్యక్తం చేసిన ఆయన, ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం రాజకీయాలకు కాకుండా అభివృద్ధిపై దృష్టి సారించాలని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులు, కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

# టప్పాచబుత్ర ఇన్‌స్పెక్టర్ బాలకృష్ణను సత్కరించిన శ్రీపరశురామ్ సేవా మండల్ వ్యవస్థాపక అధ్యక్షులు నవరతన్ ఇండోరియా



అబిడ్స్‌జోన్ ఇన్‌ఛార్జీ,మేజర్‌న్యూస్ః టప్పాచబుత్ర పోలీస్ స్టేషన్ నూతన ఇన్‌స్పెక్టర్‌గా బాలకృష్ణ పదవి బాధ్యతలు స్వీకరించిన నేపథ్యంలో శ్రీపరశురామ్ సేవా మండల్ వ్యవస్థాపక అధ్యక్షులు నవరతన్ ఇండోరియా ప్రత్యేకంగా నూతన ఇన్‌స్పెక్టర్ బాలకృష్ణను శాలువాకప్పి ఘనంగా సత్కరించారు. అదేవిధంగా ఎస్.ఐ. వంశీనికూడ శాలువాకప్పి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో అంజద్‌ఖాన్,గిరిష్ జోషి,ఠాకూర్ దినేష్‌సింగ్,ఠాకూర్ మనోజ్ సింగ్,లోకేష్ ఇండోరియా,రోహణ్ జోషి,వినయ్‌లు పాల్గొన్నారు.

## తెలంగాణ తొలి ఉద్యమకారుడు జంగంరావు గౌడ్ జన్మదిన వేడుకలు



ముషీరాబాద్ మేజర్ న్యూస్ :తెలంగాణ తొలి దశ ఉద్యమకారుడు, చిక్కడపల్లి వివేకానగర్ వాసి, జంగంరావు గౌడ్ జన్మదిన వేడుకలు వారి నివాసంలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు టి.గోపాల్ ని మర్యాదపూర్వకంగా కలిసి, శాలువాతో సత్కరించి, మెమెంటోను బహుకరించి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు .గోపాల్ బీజేపీ పార్టీ తరుపున గౌరవార్థం ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసారు.. ఈ కార్యక్రమంలో గాంధీనగర్ డివిజన్ బీజేపీ నాయకులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జంగంరావు గౌడ్ టి.గోపాల్ పాత జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ, తెలంగాణ ఉద్యమ విశేషాలపై మనసు విప్పి మాట్లాడుకున్నారు.జంగంరావు గౌడ్ కుమారుడు డాక్టర్ నరేష్ గౌడ్, వాణీశ్వర శాస్త్రి, దోనేటి సత్యం, శ్రీనివాస్ యాదవ్, నర్సింగరావు, శ్రీనివాస్, మధు, సాయి, బంటి, వనజా రాణి తదితర నాయకులు, అభిమానులు పాల్గొని జంగంరావు గౌడ్ కి శుభాకాంక్షలు అందజేశారు.:

# ఉప్పల్ ప్రెస్ క్లబ్ నూతన అధ్యక్షుడుగా వడ్డేపల్లి కిషోర్



ఉప్పల్, ఫిబ్రవరి 1(సూర్య మేజర్ న్యూస్): ఉప్పల్ ప్రెస్ క్లబ్ ( ప్రింట్ ఎలక్ట్రానిక్ మీడియా ) నూతన అధ్యక్షుడు గా వడ్డేపల్లి కిషోర్ ఎన్నికయ్యారు . ఉప్పల్ లో సీనియర్ జర్నలిస్టులు కడారి బాలేశం , చంద్రమౌళి ల ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఉప్పల్ ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు . నూతన అధ్యక్షుడుగా వడ్డేపల్లి కిషోర్ , ప్రధాన కార్యదర్శి లుగా ఆనంద నర్సింహరెడ్డి , పెంబళ్ల కుమార్ క్రమశిక్షణా కమిటీ ఛైర్మన్‌గా కొలనుపాక చంద్రమౌళి , సలహదారులుగా కడారి బాలేశం , మాటూరి శ్రీనివాస్ , మచ్చ శ్రీహరి , కంచు శ్రీనివాస్ , డి సురేష్ , పారెల్లి సాగర్ గౌరవాధ్యక్షులుగా ఓంకారం సంతోష్ రాజు , వర్కింగ్ ప్రెసిడెంట్ గా పయ్యావుల సంతోష్ , డిప్యూటి జనరల్ సెక్రటరీగా సీసా నాగరాజు , ఉపాధ్యక్షులుగా బోడ ప్రవీణ్ , కందుకూరి ప్రశాంత్ , గోరుకంటి నరేందర్ , దొంతు స్టాలిన్ , కోశాధికారులు గా ఆర్ . యాదగిరి , సారా వెంకటేష్ గౌడ్ , ఆర్గనైజింగ్ కార్యదర్శి లుగా పి.తిరుమల్ రెడ్డి , కొయ్యేడి కరుణాకర్ , ఇడపాక సురేష్ , దొడ్డి శోభన్ , శ్రవణ్ , జాయింట్ సెక్రటరీ లుగా దత్రపు దేవా , బల్ల సూర్యం , ప్రవీణ్ , కె. జీవన్ గౌడ్ సాంస్కృతిక కార్యదర్శి లుగా పబ్బు కిరణ్ ,



ఉపేందర్ , షేక్ పాషా , ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులుగా బి.వి.రాజు , విష్ణు , లక్ష్మణ్ , వెంకట్ రెడ్డి , సోనిశ్రీ , ప్రసాద్ , చంద్రశేఖర్ , అరుణ్ , శ్రీకాంత్ , శ్రీధర్ , సిద్దు , జి.వెంకటేష్ , సి.చరేష్ , డి.శివ, డి . యం.మౌలాలి తదితరులు ఎన్నికయ్యారు . ఈ సందర్భంగా అధ్యక్షుడు గా వడ్డేపల్లి కిషోర్ మాట్లాడుతూ ... ఉప్పల్ నియోజకవర్గంలో ప్రింట్ మరియు ఎలక్ట్రానిక్ మీడియా సమస్యల పరిష్కారం, జర్నలిస్టుల హక్కుల పరిరక్షణ, ప్రజా సమస్యలను నిష్పాక్షికంగా వెలుగులోకి తీసుకురావడమే తమ ప్రధాన లక్ష్యమని తెలిపారు. అలాగే, యువ జర్నలిస్టులకు మార్గదర్శకత్వం అందిస్తూ మీడియా వృత్తికి గౌరవం తీసుకొచ్చేలా నూతన కమిటీ పని చేస్తుందని పేర్కొన్నారు. ఈ నూతన కమిటీ ఏర్పాటుతో ఉప్పల్ మీడియా వర్గాల్లో కొత్త ఉత్సాహం నెలకొందని, జర్నలిజం మరింత బలంగా ముందుకు సాగుతుందని పలువురు సీనియర్ జర్నలిస్టులు అభినందనలు తెలిపారు.

# భరత్‌నగర్‌కు సరైన ప్రవేశ మార్గం కావాలి

**- మూసాపేట డివిజన్‌లో రోడ్డెక్కిన కాలనీవాసులు - ఏళ్లనాటి సమస్యపై ధర్నా**



మూసాపేట మేజర్ న్యూస్ :మూసాపేట డివిజన్ పరిధిలోని భరత్‌నగర్ కాలనీతో పాటు అనుబంధ బస్తీల ప్రజలు తమ కాలనీకి సరైన ప్రవేశ మార్గం కల్పించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం రోడ్డెక్కారు. ఎన్నేళ్లుగా పరిష్కారానికి నోచుకోని సమస్యను వెంటనే పరిష్కరించాలని కోరుతూ స్థానికులు ధర్నాకు దిగారు.

కాలనీకి సరైన ప్రవేశ, నిష్క్రమణ మార్గం లేకపోవడం వల్ల రోజువారీ రాకపోకలు తీవ్రంగా ఇబ్బందికరంగా మారాయని, అత్యవసర పరిస్థితుల్లో అంబులెన్స్‌లు, ఫైర్ ఇంజిన్లు కూడా కాలనీలోకి రావడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు, ఉద్యోగాలకు వెళ్లే కార్మికులు తీవ్ర సమస్యలు ఎదుర్కొంటున్నారని తెలిపారు. పలుమార్లు సంబంధిత అధికారులకు, ప్రజాప్రతినిధులకు వినతులు ఇచ్చినా స్పందన లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇకనైనా అధికారులు, జీహెచ్‌ఎంసీ స్పందించి శాశ్వత పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు. ప్రజల ఆవేదనతో మూసాపేట ప్రాంతం మార్మోగగా, సమస్య పరిష్కారం కోసం స్పష్టమైన హామీ ఇవ్వకపోతే ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని కాలనీవాసులు హెచ్చరించారు.

## పనులు పూర్తి చేసుకున్న సీసీ రోడ్- పార్క్‌ను ప్రారంభించిన కార్పొరేటర్ ధర్పల్లి




కర్మన్ ఘాట్,మేజర్ న్యూస్ :లింగోజిగూడ డివిజన్ పరిధిలోని ఎస్‌బిహెచ్ కాలనీ వెంచర్3లో రూ.41 లక్షల వ్యయంతో చేపట్టిన నూతన సీసీ రోడ్ల నిర్మాణం మరియు పార్క్ రీనోవేషన్ అభివృద్ధి పనులు పూర్తయ్యాయి. ఆదివారం కాలనీ సభ్యులతో కలిసి జీహెచ్ఎంసీ ఫ్లోర్ లీడర్, లింగోజిగూడ డివిజన్ కార్పొరేటర్ దరిపల్లి రాజశేఖర్ రెడ్డి ప్రారంభించారు.ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ, "ప్రజలు చెల్లించే పన్నుల ద్వారానే ప్రతి అభివృద్ధి పని జరుగుతోంది. నాపై నమ్మకం ఉంచి గెలిపించిన ప్రజలకు అభివృద్ధి పనుల రూపంలో న్యాయం చేయడమే నా బాధ్యత. లింగోజిగూడ డివిజన్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు నిరంతరం కృషి చేస్తాను" అని తెలిపారు. అలాగే, కాలనీలో పరిశుభ్రతను కాపాడుకోవాలని, రోడ్లపై చెత్త వేయకుండా స్వచ్ఛత పాటించాలని ప్రజలకు ఆయన విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు బాలచందర్ గౌడ్, శివకుమార్, కృష్ణయ్య, సురేష్, వెంకట్ రామయ్య, సుమంత్, గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

# నాట్య ప్రదర్శన..!!



ముషీరాబాద్ మేజర్ న్యూస్ : పూరి జగన్నాథ స్వామి నృత్య నీరాజనం సందర్భంగా జగన్నాథ స్వామి దేవాలయంలో సుమరు 100 మందితో కోలాటం తో ప్రదక్షణ మరియు చిన్నారులు చేసే కూచిపూడి నృత్య ప్రదర్శన జరిగింది, ఈ కరిక్రమంలో ఆలయ సెక్రటరీ రవీంద్రనాథ్ గిరి దిలీప్ ఆదినారాయణ ) పరేష్ జీ పురోహిత్ నాట్య గురువులు శివిక వేద భార్గవి అక్షయ విజయ లక్ష్మి సుచిత్ర మరియూ ఇతర నాట్య గురువులు పాల్గొన్నారు. దేవాలయం వారు యంత గానో సహాయ సహ కారులు అందించారు వారికి ఏ ఎస్ సీ ఏ కృతజ్ఞతలు తెలియజేసారు.ఇంకా యానో ప్రదర్శనములు జరగాలి అని జగన్నాథ స్వామి ఆశీస్సులు అందరికి దొరకాలి అని కోరుకుందాం, మా ఈ కార్యక్రమం ఇంత సక్సెస్ అవటానికి కారణం ప్రధానంగా చిన్నారుల తల్లి తండ్రులకు నాట్య గురువులకు, ఆలయ నిర్వహణ, మరియు అందరికి. అసోసియేషన్ భవాని సీ హెచ్ .సీతారాం బృందం ప్రత్యకంగా ధన్యవాదము తెలియజెసారు నిర్వాహకులు.

# కూకట్‌పల్లి హౌసింగ్ బోర్డులో శ్రీ శ్రీనివాస కళ్యాణం వైభవం

## ● కుటుంబ సమేతంగా తరలివచ్చిన భక్తులు ● అంగరంగ వైభవంగా జరిగిన కల్యాణ మహోత్సవం



కూకట్‌పల్లి మేజర్ న్యూస్ : కూకట్‌పల్లి హౌసింగ్ బోర్డులో ఆదివారం సాయంత్రం నిర్వహించిన శ్రీ శ్రీనివాస కళ్యాణం కార్యక్రమం అంగరంగ వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి హౌసింగ్ బోర్డు పరిసర ప్రాంతాల ప్రజలు కుటుంబ సమేతంగా భారీ సంఖ్యలో హాజరై భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు. పిల్లలు, పెద్దలు, వృద్ధులు అన్న తేడా లేకుండా అందరూ ఈ దివ్య కార్యక్రమంలో భాగస్వాములయ్యారు. కళ్యాణ మహోత్సవంలో స్వామివారు-- అమ్మవారికి తాళికట్టిన శుభ ముహూర్తాన్ని ప్రత్యక్షంగా దర్శించుకునే అదృష్టం భక్తులకు కలగడంతో కార్యక్రమం ఆధ్యాత్మిక వాతావరణంలో కొనసాగింది. భక్తుల నినాదాలు, మంగళ వాయిద్యాల మధ్య స్వామివారి కళ్యాణం కన్నుల పండుగగా సాగింది. ఈ కార్యక్రమాన్ని చత్రపతి ధర్మరక్షణ సేన ఆధ్వర్యంలో కర్రీ వేణుగోపాల్ నేతృత్వంలో నిర్వహించారు. కార్యక్రమం విజయవంతంగా నిర్వహించడంలో సహకరించిన కూకట్‌పల్లి హౌసింగ్ బోర్డు ప్రజానీకానికి నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే ఈ కార్యక్రమానికి సహకరించిన భువన విజయం గ్రౌండ్, ఎంఐజి రెసిడెన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు జి. తిరుపతి రావు, సెక్రటరీ సమయం నాగప్రసాద్ కి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా భక్తులు స్వామివారిని ప్రార్థిస్తూ---ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖశాంతులతో ఉండాలని, ముఖ్యంగా యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగుపడాలని, రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని కోరుకున్నారు. నూతన సంవత్సరం 2026లో ప్రజలందరిపై స్వామివారి ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు. శ్రీ శ్రీనివాస కళ్యాణం అనంతరం భక్తులందరూ ప్రసాదం స్వీకరించారు...

# మౌలిక వసతులకు బడ్జెట్‌లో పెద్దపీట

## - సిమెంట్ మాన్యుఫాక్చరర్స్ అసోసియేషన్ హర్షం





తెలంగాణ బ్యూరో ప్రతినిధి : ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 'వికసిత్ భారత్ 2047', 'ఆత్మనిర్భరత' విజన్ స్ఫూర్తితో ప్రజల ఆకాంక్షలు, సమగ్ర వృద్ధిని సమతుల్యం చేస్తూ 2026-27 కేంద్ర బడ్జెట్ లో మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట వేయ డాన్ని సిమెంట్ మాన్యుఫా క్చరర్స్ అసోసియేషన్ హర్షం వ్యక్తం చేసింది. గడిచిన 12 ఏళ్లుగా భారతదేశం అనుసరిస్తున్న క్రమశిక్షణతో కూడిన ఆర్థిక విధానాలు, స్థిరమైన వృద్ధి, నియంత్రణలో ఉన్న ద్రవ్యోల్బణం దేశ ఆర్థిక పథాన్ని పటిష్టం చేశాయని ఈ బడ్జెట్ నొక్కి చెప్పింది. ఇది సిమెంట్ వంటి మౌలిక సదుపాయాల అనుబంధ రంగాలకు బలమైన డిమాండ్‌ను కల్పిస్తోంది. ఈ సందర్భంగా సిమెంట్ మాన్యుఫాక్చరర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పార్థ్ జిందాల్ మాట్లాడుతూ మౌలిక సదుపాయాల కల్పనకు ఇచ్చే ప్రాధాన్యతలో భాగంగా ప్రభుత్వ మూలధన వ్యయాన్ని గత ఆర్థిక ఏడాది (2025-26) లో ఉన్న రూ.11.2 లక్షల కోట్ల నుంచి రూ.12.2 లక్షల కోట్లకు పెంచారన్నారు. నగరాల అభివృద్ధికి ఐదు లక్షల కంటే ఎక్కువ జనాభా కలిగిన టైర్ 2, టైర్ 3 నగరాలపై ప్రత్యేక దృష్టి సారించారన్నారు. ఒక్కో నగర ఆర్థిక ప్రాంతానికి ఐదేళ్ల కాలానికి రూ.5,000 కోట్ల కేటాయింపులు జరిగాయన్నారు. ఈ సందర్భంగా సిమెంట్ మాన్యుఫాక్చరర్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు డాక్టర్ రాఘవ్‌పత్ సింఘానియా మాట్లాడుతూ ?సిమెంట్ వంటి ఉద్గారాలు ఎక్కువగా వెలువడే పరిశ్రమల కోసం బడ్జెట్‌లో రూ.20,000 కోట్ల వ్యయాన్ని కేటాయించారన్నారు. ఇది భారత పారిశ్రామిక రంగంలో డీకార్బనైజేషన్ (కర్బన ఉద్గారాల తగ్గింపు) దిశగా ఒక విప్లవాత్మక మార్పు అన్నారు. సిమెంట్ రంగం భారీ స్థాయిలో ఉద్గారాలను తగ్గించడానికి ఇది ఒక శక్తివంతమైన సాధనమన్నారు. ఈ నిధులు సాంకేతిక, వ్యయపరమైన సవాళ్లను అధిగమించడానికి తోడ్పడతాయన్నారు. 2070 నాటికి 'నెట్ జీరో' చేరుకోవాలన్న భారత ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా, దేశ మౌలిక అవసరాలను తీరుస్తూనే పర్యావరణాన్ని రక్షించడానికి సిమెంట్ పరిశ్రమ కట్టుబడి ఉందన్నారు. ప్రభుత్వం మౌలిక సదుపాయాలపై చూపుతున్న నిరంతర ఆసక్తి ఉపాధి కల్పనకు, ప్రాంతీయ అభివృద్ధికి, సప్లయ్ చైన్ బలోపేతానికి ఎంతో కీలకమన్నారు. సిమెంట్ తయారీ కేంద్రాలు ఆయా ప్రాంతాలలో ఆర్థిక చోదక శక్తులుగా ఉంటూ నిర్మాణం, లాజిస్టిక్స్ వంటి అనుబంధ రంగాలలో జీవనోపాధిని మెరుగుపరుస్తున్నాయని తెలిపారు. టైర్ 2, టైర్ 3 నగరాలపై దృష్టి, సిటీ ఎకనామిక్ రీజియన్ల ఏర్పాటు సిమెంట్ రంగానికి కొత్త ఊపిరి పోస్తాయన్నారు. జిల్లా ఆసుపత్రులలో ఎమర్జెన్సీ, ట్రామా కేర్ మౌలిక సదుపాయాల బలోపేతం వంటి నిర్ణయాలు సిమెంట్ రంగం సామాజిక పాత్రను నొక్కి చెబుతున్నాయన్నారు.

## మహిళలతో క్యాన్సర్ అవగాహన బైక్ ర్యాలీ నిర్వహించిన, మెడికవర్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్




హైదరాబాద్, మేజర్ న్యూస్ ప్రతినిధి: క్యాన్సర్‌పై భయం వద్దు, అవగాహన ఉంటే విజయం మనదే అనే నినాదంతో మెడికవర్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్ ఆదివారం మహిళల కోసం ప్రత్యేక క్యాన్సర్ అవగాహన బైక్ ర్యాలీని నిర్వహించింది. సుమారు 100 మంది మహిళా రైడర్లు హైటెక్ సిటీ ప్రాంతంలో బైక్ ర్యాలీ నిర్వహించి, క్యాన్సర్ నివారణ ముందస్తు పరీక్షల ప్రాముఖ్యతపై ప్రజల్లో అవగాహన కల్పించారు. ఈ ర్యాలీని మాదాపూర్ ట్రాఫిక్ డీసీపీ టి. సాయి మనోహర్, మిస్ మితాలీ అగర్వాల్ (మిసెస్ ఇండియా గ్లోబల్ అంబాసిడర్) కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మహిళల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాల్సిన అవసరాన్ని వారు ప్రస్తావించారు. డీసీపీ టి. సాయి మనోహర్ మాట్లాడుతూ, క్రమం తప్పకుండా క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకోవడం మహిళల జీవితాలకు రక్షణ అని తెలిపారు. మిస్ మితాలీ అగర్వాల్ మాట్లాడుతూ, మహిళలు తమ ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయకుండా ముందస్తు వైద్య పరీక్షలకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. మెడికవర్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్ వైద్యులు డా. వేణుగోపాల్, డా. రవి చంద్ర, డా. ప్రశాంత్ రెడ్డి మాట్లాడుతూ, ఆధునిక వైద్య సదుపాయాలతో క్యాన్సర్‌ను ప్రారంభ దశలోనే గుర్తిస్తే విజయవంతంగా చికిత్స చేయవచ్చని తెలిపారు. ఈ ర్యాలీ ప్రజల నుంచి విశేష స్పందన పొందింది మరియు మహిళల ఆరోగ్య చైతన్యానికి ప్రేరణగా నిలిచింది

## వైభవంగా శ్రీ పద్మావతి గోదా సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దివ్య తిరుకళ్యాణ మహోత్సవం

కొండాపూర్,మేజర్ న్యూస్ : గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని నల్గొండ లో ఉన్న రాంకీ గెలాక్సీ అపార్ట్‌మెంట్స్‌లో నిర్వహించిన శ్రీ పద్మావతి గోదా సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దివ్య తిరుకళ్యాణ మహోత్సవం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు.ఈ కళ్యాణ మహోత్సవం లో ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్ జగదీశ్వర్ గౌడ్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వెంకటేశ్వర స్వామి వారి కృపతో ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని, స్వామి వారి ఆశీస్సులు అందరికీ ఉండాలని కోరుకున్నారు.ఈ కార్యక్రమంలో గణేష్ ముదిరాజ్, మంత్రిప్రగడ సత్యనారాయణ, చాంద్ పాషా, ఉరిటి వెంకట్రావు, శేఖర్ రెడ్డి, అనిల్, ప్రభాకర్ రెడ్డి, నగేష్, వేణుగోపాల్ రెడ్డి, మల్లేష్, సల్లావుద్దీన్, విశ్వనాథ్, పూరీ, రాజేందర్, సురేష్, లక్ష్మణ్, శ్రీశైలం తదితరులు భక్తులు పాల్గొన్నారు.



## తెలంగాణ తొలి ఉద్యమకారుడు జంగంరావు గౌడ్!



ముషీరాబాద్ మేజర్ న్యూస్ :తెలంగాణ తొలి దశ ఉద్యమకారుడు, చిక్కడపల్లి వివేకానగర్ వాసి, జంగంరావు గౌడ్ జన్మదిన వేడుకలు వారి నివాసంలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు టి.గోపాల్ ని మర్యాదపూర్వకంగా కలిసి, శాలువాతో సత్కరించి, మెమెంటోను బహుకరించి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు.బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు .గోపాల్ బీజేపీ పార్టీ తరుపున గౌరవార్థం ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసారు.. ఈ కార్యక్రమంలో గాంధీనగర్ డివిజన్ బీజేపీ నాయకులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జంగంరావు గౌడ్ టి.గోపాల్ పాత జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ, తెలంగాణ ఉద్యమ విశేషాలపై మనసు విప్పి మాట్లాడుకున్నారు.జంగంరావు గౌడ్ కుమారుడు డాక్టర్ నరేష్ గౌడ్, వాణీశ్వర శాస్త్రి, దోనేటి సత్యం, శ్రీనివాస్ యాదవ్, నర్సింగరావు, శ్రీనివాస్, మధు, సాయి, బంటి, వనజా రాణి తదితర నాయకులు, అభిమానులు పాల్గొని జంగంరావు గౌడ్ కి శుభాకాంక్షలు అందజేశారు.:

# నిరసన!



ముషీరాబాద్ మేజర్ న్యూస్ : తెలంగాణ జాతిపిత, తెలంగాణ రాష్ట్ర సాధన నాయకుడు కెసిఆర్ ను విచారణ పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం ఇబ్బందులకు గురి చేయడం దుర్మార్గమైన చర్యని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మాజీ ముఖ్యమంత్రి, అధినేత కేసిఆర్ ను సిట్ అధికారులు విచారణకు పిలవడానికి నిరసిస్తూ గాంధీనగర్ డివిజన్లోని జవహర్ స్కూల్ వద్ద గాంధీనగర్ డివిజన్ బి.ఆర్.ఎస్ అధ్యక్షుడు ముడారపు రాకేష్ కుమార్ ఆధ్వర్యంలో ముషీరాబాద్ శాసనసభ్యులు శ్రీ ముఠాగోపాల్ గారి ఆదేశాల మేరకు ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేసి సీఎం రేవంత్ రెడ్డికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు . ఈ కార్యక్రమంలో పున్న సత్యనారాయణ, ముఠా నరేష్,ఎర్రం శ్రీనివాస్ గుప్త, నరేష్,వెంకటేష్, పాశం రవి, ఎస్టీ ప్రేమ్,దేవయ్య, ముఠా శివ సింహ, రవిశంకర్ గుప్తా, బీటీ సత్యనారాయణ, సంతోష్,ఎం ఆనంద్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ స్టేట్ టైక్వాండో యూనియన్ కలర్ బెల్ట్ ప్రమోషన్ టెస్ట్!




ముషీరాబాద్ మేజర్ న్యూస్ : న్యూ ఏజ్ గ్లోబల్ స్కూల్ లో టైక్వాండో కలర్ బెల్ట్స్ మాస్టర్, కేపీ,,హనుమాన్ ఆధ్వర్యంలో ప్రమోషన్ చేయడం జరిగింది ఇందులో భాగంగా బాలబాలికలు దాదాపు 40 నుంచి 50 మంది పాల్గొనడం జరిగింది బెల్టు ప్రమోషన్ టెస్ట్ ని ఉద్దేశించి ప్రిన్సిపాల్ నీరుగొండ ఫణి కుమారి,, ప్రసంగించడం ప్రతి ఒక్క విద్యార్థిని విద్యార్థులు ఈ యొక్క టైక్వాండోమార్షల్ ఆర్ట్ విద్యను శరీర దృఢత్వమే కాకుండా మనలోని ఆత్మస్థైర్యాన్ని, ధైర్యాన్ని ఆలోచన శక్తిని,పెంచుతుందని ప్రతి ఒక్కరు నేర్చుకోవాలని కోరారు ఇందులో ముఖ్య అతిథులుగా న్యూ ఏజ్ గ్లోబల్ స్కూల్ ప్రిన్సిపల్ ఫణి కుమార్,, తెలంగాణ టైక్వాండో యూనియన్ చైర్మన్ కేపీ హనుమంతు,సీనియర్ కోచ్ లో కే నరేందర్ యాదవ్, ఏ లోకేష్, ఉదయ్ కుమార్, చంద్రశేఖర్, ఎన్ మౌనిక, జి శిరీష, చరణ్, సుమిత్, తదితరులు ,పాల్గొన్నారు.

# జలమండలి ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షులుగా మొగుళ్ల రాజిరెడ్డి ఎన్నిక

**జలమండలి ఉద్యోగ, కార్మికుల సమస్యల పరిష్కారానికి పోరాడుతా**




హిమాయత్ నగర్, మేజర్ న్యూస్ : ఐ.ఎన్.టి.యు.సి అనుబంధ తెలంగాణ జలమండలి ఎంప్లాయిస్ యూనియన్ కార్మికుల సమస్యల పరిష్కారానికి దశాబ్దాలుగా పోరాడుతూనే ఉందని, అనేక సమస్యలను పరిష్కరించి పెట్టిందని ఐ.ఎన్.టి.యు.సి రాష్ట్ర ఉపాధ్యక్షులు మొగుళ్ల రాజిరెడ్డి తెలిపారు. ఈ మేరకు బర్కత్ పుర, ఐ.ఎన్.టి.యు.సి నగర కార్యాలయంలో ఆదివారం తెలంగాణ జలమండలి ఎంప్లాయిస్ యూనియన్ సర్వసభ్య సమావేశం సి. సతీష్ కుమార్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో ఐ.ఎన్.టి.యు.సి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.డి. చంద్ర శేఖర్, యూనియన్ ప్రధాన కార్యదర్శి రాఘవేంద్ర రాజ్, అసోసియేట్ ప్రెసిడెంట్ అలీ శ్రవణ్ కుమార్ వాటర్ వర్క్స్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షులు కే రాజి రెడ్డి, అసోసియేట్ ప్రెసిడెంట్ ఎండి జాంగిర్ పాల్గొన్నారు. అధ్యక్షులుగా రాజిరెడ్డి ని నియమించాలన్న సి. సతీష్ కుమార్ ఏకగ్రీవ తీర్మానంగా ప్రవేశపెట్టాగ, సభ్యులందరు ఆమోదం తెలిపి ఆయనను యూనియన్ అధ్యక్షులుగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ఐ.ఎన్.టి.యు.సి జాతీయ అధ్యక్షులు జి. సంజీవ రెడ్డి, యూనియన్ గౌరవ అధ్యక్షులు మధు యాష్కీ గౌడ్ సలహాలు, సూచనతో నన్ను యూనియన్ అధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నందుకు ధన్యవాదాలు తెలిపారు. వాటర్ బోర్డులో పనిచేస్తున్న ప్రతి ఉద్యోగి సమస్యలపై నిరంతరంగా పోరాడుతానని, మేనేజ్‌మెంట్‌తో చర్చించి, అవసరమైతే ప్రభుత్వ పెద్దలతో కూడా చర్చించి సమస్యలను పరిష్కరిస్తాను అని స్పష్టం చేశారు. రాబోయే జలమండలి గుర్తింపు సంఘం ఎన్నికల్లో అన్ని యూనియన్లు, అసోసియేషన్లు ఏకతాటిపైకి వచ్చి తెలంగాణ జలమండలి ఎంప్లాయిస్ యూనియన్‌ను తిరుగులేని మెజార్టీతో గెలిపించాలని మొగుళ్ళ రాజిరెడ్డి పిలుపునిచ్చారు. ఆర్.డి. చంద్ర శేఖర్ మాట్లాడుతూ ఐ.ఎన్.టి.యు.సి పూర్తి మద్దతు తెలంగాణ జలమండలి ఎంప్లాయిస్ యూనియన్‌కు ఉంటుందని ప్రకటించడంతో పాటు, ఐ.ఎన్.టి.యు.సి అప్పిలేషన్ కూడ తర్వాత సమావేశంలో అందజేస్తానని తెలిపారు. ఈ సమావేశం యూనియన్ గౌరవ ఉప సలహాదారులుగా సి. సతీష్ కుమార్ ఎన్నుకుంది. ఈ కార్యక్రమంలో మేవ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సైద్ అక్తర్ అలీ, ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బి.నర్సింగ్ రావు, ఏం రాజా, బీసీ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బి జై రాజు, నేతలు పి.చంద్రశేఖర్, బి.శంకర్ ప్రకాష్, కె.ఆనంద్ రెడ్డి, ఎం.రాంచేందర్, సి.రాజు, మజారుద్దీన్, హాసిం, కృష్ణ ముదిరాజ్, రాముల ముదిరాజ్, జయశంకర్, అజయ్ నాథ్, లక్ష్మణ్ యాదవ్, శ్రీనివాస్ యాదవ్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# నగర పోలీస్ విభాగంలో పదవీ విరమణ పొందిన వారిని సత్కరించిన నగర పోలీస్ కమీషనర్ వి.సి. సజ్జనర్



సిటీబ్యూరో,మేజర్‌న్యూస్ః హైదరాబాద్ సిటీ పోలీస్ కమీషనరేట్ పరిధిలో సుధీర్ఘకాలంపాటు సేవలు అందించి,శనివారం పదవీ విరమణ పొందిన 18 మంది పోలీసు అధికారులకు నగర పోలీస్ కమీషనర్ వి.సి. సజ్జనర్ ఘనంగా వీడ్కోలు పలికారు. రిటైర్ అవుతున్న వారిలో ఒక ఆఫీసు సూపరింటెండెంట్,ఆరుగురు ఎస్.ఐ.లు,ఏడుగురు ఎ.ఎస్.ఐ.లు,నలుగురు హెడ్ కానిస్టేబుళ్లు ఉన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో నగర పోలీస్ కమీషనర్ మాట్లాడుతూ పదవీ విరమణ పొందుతున్న అధికారులందరికి తన తరపున,హైదరాబాద్ సిటీ పోలీస్ విభాగం తరపున ప్రత్యేకంగా శుభకాంక్షలు తెలియజేస్తున్నట్లు ఆయన చెప్పారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నుంచి తెలంగాణ రాష్ట్రం ఏర్పడేవరకు, కొవిడ్ వంటి క్లిష్ట సమయాల్లో వారు అందించిన సేవలు వెలకట్టలేనిదన్నారు. పదవి విరమణ అనేది కొత్త ఆరంభమని,శేష జీవితాన్ని కుటుంబంతోకల్సి ఆరోగ్యంగా, ఉత్సాహంగా గడపాలన్నారు. రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ రూపంలో వచ్చే నగదును ప్రభుత్వ బ్యాంకుల్లో,పోస్టాఫీసుల్లో భద్రపరచుకోవాలని,అధిక లాభాల ఆశను చూపే మోసగాళ్లపట్ల,సైబర్ నేరగాళ్ళపట్ల ఎంతో అప్రమత్తంగా ఉండాలని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నగర అదనపు పోలీస్ కమీషనర్ సౌత్ జోన్ తఫ్సీర్ ఏక్బాల్,శ్రీనివాసులు,పోలీసు అధికారుల సంఘం అధ్యక్షులు ఎన్. శంకర్‌రెడ్డి,కార్యదర్శి ఆసిఫ్‌ఖాన్,ఇతర ప్రతినిధులు పాల్గొన్నారు.

# కేసీఆర్ నివాసానికి నోటీసులు అతికించడం అనైతికం

**- హైదర్‌నగర్ అంబేద్కర్ విగ్రహం వద్ద బీఆర్ఎస్ నిరసన - కాంగ్రెస్ ప్రభుత్వం దిగజారుడు రాజకీయాలు చేస్తోంది: సింధం శ్రీకాంత్ యాదవ్**

కూకట్ పల్లి మేజర్ న్యూస్:తెలంగాణ రాష్ట్ర ప్రదాత, తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ నివాసానికి గోడలకు నోటీసులు అతికించడం పూర్తిగా అనైతికం, ప్రజాస్వామ్య విరుద్ధం అని బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, న్యాయవాది సింధం శ్రీకాంత్ యాదవ్ తీవ్రంగా విమర్శించారు. ఈ మేరకు హైదర్‌నగర్ అంబేద్కర్ విగ్రహం వద్ద బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సమ్మక్కసారక్క జాతర సందర్భంగా ఎర్రవల్లిలోని కేసీఆర్ నివాసానికి స్వయంగా వెళ్లి రాష్ట్ర ప్రభుత్వం ఆహ్వానం అందించిన విషయం అందరికీ తెలిసిందేనని, అలాంటి ప్రభుత్వం ఇప్పుడు నోటీసుల విషయంలో మాత్రం కేసీఆర్ ఆచూకీ తెలియనట్టుగా ప్రవర్తిస్తూ గోడలకు నోటీసులు అతికించి వెళ్లడం కాంగ్రెస్ ప్రభుత్వ దిగజారుడు రాజకీయాలకు నిదర్శనం అని విమర్శించారు. గత రెండు సంవత్సరాలుగా 'సిట్ విచారణ' పేరుతో బీఆర్ఎస్ నాయకులను పిలిపించి గంటల తరబడి కూర్చోబెట్టడం, అదే ప్రశ్నలను పునరావృతం చేస్తూ వేధింపులకు గురి చేయడం ప్రతిపక్షాన్ని అణిచివేయడమేనని ఆరోపించారు. విచారణ పేరుతో రాజకీయ కక్ష సాధింపే తప్ప నిజాలు వెలికితీయాలనే చిత్తశుద్ధి కాంగ్రెస్ ప్రభుత్వానికి లేదన్నారు.
ఫోన్ ట్యాపింగ్ అంశంపై రెండేళ్లు గడిచినా ఎవరి ఫోన్లు ట్యాప్ చేశారు? ఎవరి ఆదేశాల మేరకు జరిగింది? అనే విషయాలపై ఇప్పటికీ స్పష్టత ఇవ్వలేకపోతున్నారని మండిపడ్డారు. ప్రజాస్వామ్యంలో ప్రభుత్వానికి జవాబుదారీతనం ఉండాలని, కానీ కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం విచారణ పేరుతో ప్రజల దృష్టిని మళ్లించే ప్రయత్నం చేస్తోందన్నారు. తెలంగాణ తొలి



ముఖ్యమంత్రి కేసీఆర్ ని విచారణ పేరుతో వేధించడం పూర్తిగా అన్యాయం అని పేర్కొన్నారు. మున్సిపల్ ఎన్నికలు జరుగుతున్న సమయంలో రాజకీయ లబ్ధి కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆడుతున్న నాటకమే ఇదని ఆరోపించారు. ఈ నాటకాన్ని ప్రజలు ఇప్పటికే గుర్తించారని, రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన గుణపాఠం తప్పక చెబుతారని సింధం శ్రీకాంత్ యాదవ్ హెచ్చరించారు.పెద్ద సంఖ్యలో పాల్గొన్న బీఆర్ఎస్ నేతలు ఈ నిరసన కార్యక్రమంలో పార్టీ నాయకులు మక్కా శ్రీనివాస్, ఎండి కలీం, వెంకటేష్ యాదవ్, సుబ్బరాజు, షేక్ షరీఫ్, అబ్దుల్ సత్తార్, వెంకట్రావు, నిధి కుమార్ విష్ణు, సంజీవ్ రెడ్డి, రబ్బాని, నరేందర్ రెడ్డి, రామ్ చందర్, అబ్దుల్ హమీద్, చంద్రశేఖర్, నసీర్ తదితరులు పాల్గొన్నారు.

# పీస్ కమిటీ సభ్యుల సమన్వయ సమావేశంలో పాల్గొని ప్రసంగించిన చార్మినార్ జోన్ డి.సి.పి. ఖారే కిరణ్




సిటీబ్యూరో,మేజర్‌న్యూస్ః రాబోయే పండుగలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోడానికి,నగరంలో శాంతిభద్రతలను కాపాడటానికి చార్మినార్ జోన్ డి.సి.పి. ఖారే కిరణ్,శనివారం పాతబస్తీలోని సంజయరీ కన్వెన్షన్ హాల్‌లో సెంట్రల్ పీస్ కమిటీ సభ్యులతో సమన్వయ సమావేశాన్ని నిర్వహించి,ప్రసంగించారు. ఈ సమావేశంలో అదనపు డి.సి.పి. ఎం.ఏ. మాజీద్ ,ఆల్ జోన్స్ జిఎస్ శ్రీకిషన్ శర్మ, కె.ఏ. మోయిజ్, డా. జైన్,హఫీజ్,ముజఫర్ హుస్సేన్,నర్సింగ్‌గౌడ్, ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.

# ఘనంగా డా ఉమర్ ఆలీషా జన్మదిన వేడుకలు



హిమాయత్ నగర్, మేజర్ న్యూస్ : శ్రీ విశ్వ విజ్ఞాన విద్య ఆధ్యాత్మిక పీఠం నవమ పీఠాధిపతి డాక్టర్ ఉమర్ ఆలీషా స్వామి వారి 60వ జన్మదిన వేడుకలు హైదరాబాద్ పీఠం సభ్యులు నగరానికి చెందిన కండ్లకొయ్య గ్రామంలోని హనుమాన్ ఆలయం ఆవరణలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విచ్చేసిన పీఠాధిపతి డాక్టర్ ఉమర్ ఆలీషా స్వామి వారికి పీఠం సభ్యులు ఘన స్వాగతం పలికారు. తొలుత స్వామి వారికి కోలాటంతో స్వాగతం పలికి, ఆలయ అర్చకులు పూర్ణ కుంభంతో స్వాగతించి, పూలతో ఏర్పాటు చేసిన మార్గంలో స్వామిని సభ వద్దకు ఆహ్వానించారు. అనంతరం హనుమాన్ ఆలయ అర్చకులు సభా ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఈశ్వర లింగానికి పీఠాధిపతి డాక్టర్ ఉమర్ ఆలీషా స్వామి వారితో ప్రత్యేక అభిషేకం చేయించి, పూజలు నిర్వహించి వేద ఆశీర్వాదాలు అందించారు. వేదికనలంకరించిన ఉమర్ ఆలీషా స్వామి పూర్వ పీఠాధిపతుల చిత్రపటాలకు పూల మాలలు వేసి, జ్యోతి ప్రజ్వలన చేశారు. తదుపరి ఏర్పాటు చేసిన జన్మదిన కేకును స్వామి కట్ చేసి సభ్యులకు పంపిణీ చేశారు. ఈ జ్ఞాన చైతన్య సభకు సూర్యలత వ్యాఖ్యాతగా వ్యవహరించారు. సప్తమ పీఠాధిపతి రచించిన గీతం పీఠం సభ్యురాలు సన్నిబోయిన వరలక్ష్మి ఆలపించి సభికులను అలరింపజేసింది. పీఠం సభ్యుడు ఎస్.చిన్నబ్బాయి మాట్లాడుతూ గురుశిష్యుల అనుబంధం గురించి సభకు తెలియజేశారు. పీఠం సభ్యుడు గుర్రాల వెంకటేష్ మాట్లాడుతూ స్వామి వారికి సేవ చేసుకోవడం చాలా ఆనందంగా ఉందని తెలిపారు. తాత్విక బాలవికాస్ చిన్నారి ప్రణీత్ గురుశిష్యుల ప్రేమతత్వం గురించి ముద్దు ముద్దుగా మాట్లాడిన మాటలు అందరినీ మంత్రముగ్ధులను చేశాయి. చిన్నారి మోక్ష చేసిన నృత్యం ఆహుతులను ఆకట్టుకుంది. తాత్విక బాలవికాస్ చిన్నారులు ప్రదర్శించిన దృశ్యరూప నాటకం చూపరులను ఆకర్షించింది. పీఠం ఆస్థాన అవధాని యర్రంశెట్టి ఉమా మహేశ్వరరావు మాట్లాడుతూ జ్ఞాన తత్వం ద్వారా స్వామి ఆశీస్సులు పొందవచ్చని తెలిపారు. పీఠాధిపతి డాక్టర్ ఉమర్ ఆలీషా స్వామి వారి 60వ జన్మదినోత్సవం సందర్భంగా స్వామి వారి గురించి ప్రసంగించారు. నవమ పీఠాధిపతి డాక్టర్ ఉమర్ ఆలీషా జన్మదినం సందర్భంగా 60 సంవత్సరాల ఆయన జీవిత పయనంపై నిర్మించిన లఘుచిత్రాన్ని సభలో ప్రదర్శించారు. అనంతరం స్వామి వారికి భక్తులు పుష్ప గుచ్ఛాలను, పూల మొక్కలను, బహుమతులను అందజేశారు. భక్తులు ఉమర్ ఆలీషా స్వామి వారికి అందజేసిన సన్మాన పత్రాన్ని అవధాని యర్రంశెట్టి ఉమా మహేశ్వరరావు చదివి వినిపించారు. అనంతరం పీఠాధిపతి డాక్టర్ ఉమర్ ఆలీషా స్వామి వారు మాట్లాడుతూ భక్తులకు స్వామి వారి యొక్క 60 సంవత్సరాల జీవిత కాలంలో జరిగిన పలు సంఘటనలు, విశేషాలు, అగాథాలను పంచుకున్నారు. స్వామి చేతుల మీదుగా హారతి ఇచ్చారు. భక్తులందరూ స్వామి వారి ఆశీస్సులు పొంది తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో పిఠాపురం, నాగులపల్లి, ఉప్పరగూడెం, ఇసుకపల్లి సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన భక్తులందరికీ సభ్యులు భోజన కార్యక్రమం నిర్వహించారు.

# వి. వెంకటపతి రాజుకు జన్మదిన శుభాకాంక్షలు

**కేక్ కట్ చేసి శాలువాతో సన్మానం**



కూకట్ పల్లి మేజర్ న్యూస్ : రామకృష్ణ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు జనంపల్లి పురంధర్ రెడ్డి తన మిత్రుడు వి. వెంకటపతి రాజు జన్మదిన సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రాజు నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో సుఖశాంతులతో జీవించాలని భగవంతుని ప్రార్థించారు. జన్మదిన వేడుకల్లో భాగంగా పురంధర్ రెడ్డి మిత్రులతో కలిసి రాజు గారితో కేక్ కట్ చేయించి, శాలువాతో ఘనంగా సన్మానించారు. అనంతరం కేక్ తినిపించి శుభాకాంక్షలు తెలిపారు. రాజు ఎల్లప్పుడూ ఆరోగ్యంగా, ఆనందంగా మిత్రులతో కలిసి సరదాగా ఉండాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో జి. నర్సింగ్ రావు, సూర్యనారాయణ, జి. ప్రసాద్, లక్ష్మణ్, గణేష్, సుధాకర్ రెడ్డి, రమేష్, అఖిల్, సురేష్, మురళి తదితరులు పాల్గొని వి. వెంకటపతి రాజు కి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

# రెండేళ్లయినా నిధులు విడుదల చేయలేదు : ఎమ్మెల్యే తలసాని




అమీర్ పేట, మేజర్ న్యూస్: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి రెండేళ్లు అవుతున్నా అభివృద్ధి పనులకు నిధులు విడుదల చేసిన దాఖలాలు లేవని మాజీ మంత్రి, సనత్ నగర్ నియోజకవర్గం ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. సనత్ నగర్ డివిజన్ పరిధిలోని బికెగూడలో ఎల్ఐజీ కాలనీ గోల్డెన్ జూబ్లీ వేడుకలను ఆదివారం నిర్వహించారు. ముఖ్య ఆహ్వానితులుగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నియోజకవర్గం వ్యాప్తంగా వందకోట్ల రూపాయల అభివృద్ధి పనులు చేశామన్నారు. డ్రైనేజీ, వాటర్ పైపులైన్లు, రోడ్లను అభివృద్ధి చేశామని పేర్కొన్నారు. సమస్యల పరిష్కారానికి లెక్కలేనన్ని నిధులను మంజూరు చేసి పరిష్కరించామని గుర్తు చేశారు. కానీ కాంగ్రెస్ పాలనలో అభివృద్ధి కుంటుపడుతోందన్నారు. ప్రజా సమస్యలు నిర్లక్ష్యానికి గురవుతున్నాయని ఆరోపించారు. బల్కంపేట ఎల్లమ్మ దేవాలయంతో పాటు పరిసరాలను అభివృద్ధి చేసి భక్తులకు అన్ని సౌకర్యాలను కల్పించామన్నారు. 2014కు ముందు అమ్మవారి కల్యాణం దేవాలయంలో లోపల నిర్వహించేవారన్నారు. కానీ తదనంతర కాలంలో బయట భారీ షెడ్డును నిర్వహించి లక్షలాది మంది భక్తులు తిలకించేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు ఎంతో గొప్పవని పేర్కొన్నారు. వాటిని గౌరవించడంతో పాటు పరిరక్షించుకోవాలని అభిప్రాయపడ్డారు. నవతరానికి సంస్కృతి, పండుగల ప్రత్యేక తెలియకపోవడం బాధాకరమన్నారు. వారికి తెలియజెప్పాల్సిన బాధ్యత తల్లిదండ్రులకు ఉందన్నారు. ఈ కార్యక్రమంలో అమీర్ పేట డివిజన్ మాజీ కార్పొరేటర్ నామన శేషుకుమారి, సనత్ నగర్ డివిజన్ బిఆర్ఎస్ అధ్యక్షుడు కొలన్ బాల్ రెడ్డి, కాలనీ అధ్యక్షుడు అనంత రెడ్డి, కాలనీవాసులు శేషుకుమారి, లక్ష్మీనారాయణ, స్వామి, కృష్ణమూర్తి, కాశీనాథ్ తదితరులున్నారు.

# పైశాచిక ఆనందానికి పరాకాష్ట

## మహేష్ గౌడ్



మల్కాజిగిరి, మేజర్ న్యూస్: రాజకీయ కక్షసాధింపు చర్యలో భాగంగానే కేసీఆర్ కు సిట్ అధికారులతో గంటల కొద్దీ విచారణకు పాల్పడుతున్నారని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు మహేష్ గౌడ్ విమర్శించారు. ఇదంతా సీఎం రేవంత్ రెడ్డి పైశాచిక ఆనందా నికి పరాకాష్ట అన్నారు. సీఎం కనుసన్నల్లోనే ఇదంతా జరుగుతుందని రాష్ట్ర ప్రజలకు అర్థమైందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి యొక్క తుగ్లక్ పాలనకు ఇంకా మూడేళ్లు మాత్రమే మిగిలి ఉన్నప్పటికీ, కాంగ్రెస్ పార్టీకి మాత్రం చరిత్రలో నిలిచిపోయే విధంగా, ఇక ఎన్నడూ తెలంగాణలో కోలుకోలేని మచ్చ పడిందన్నారు. 125 సంవత్సరాలకు పైగా చరిత్ర కలిగిన కాంగ్రెస్ పార్టీ, కేసీఆర్ విష యంలో ఘోరమైన చారిత్రక తప్పిదం చేసిం దని విమర్శించారు. దీనికి ప్రధాన కారణం వలసొచ్చిన ముఖ్యమంత్రే అయినప్పటికీ, దాని మూల్యం రానున్న రోజుల్లో తెలంగాణ లో కాంగ్రెస్ పార్టీ తప్పుని సరిగా చెల్లించుకుం టుందన్నారు

# మహావీర్ నగర్ కాలనీ అభివృద్ధికి సంపూర్ణ సహకారం: పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ

కూకట్ పల్లి మేజర్ న్యూస్ : ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని మహావీర్ నగర్ కాలనీ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్‌కు కాలనీ ప్రెసిడెంట్‌గా ఏకగ్రీవంగా ఎన్నికైన సంగం మల్లేష్ ని కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ తో కలిసి పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ శాలువాతో సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ మాట్లాడుతూ, మహావీర్ నగర్ కాలనీ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్‌కు నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేశారు. కాలనీ అభివృద్ధిలో ప్రతి నివాసితుడు భాగస్వామి కావాలని, సమిష్టి కృషితో కాలనీని ఆదర్శవంతంగా తీర్చిదిద్దాలని పిలుపునిచ్చారు. కాలనీలో అన్ని రకాల మౌలిక వసతుల కల్పనకు తన వంతు పూర్తి సహాయ సహకారాలు ఎల్లవేళలా ఉంటాయని హామీ ఇచ్చారు. కాలనీకి సంబంధించిన ఏ చిన్న సమస్య అయినా తన దృష్టికి తీసుకువస్తే వెంటనే పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు. అలాగే, అసంపూర్తిగా మిగిలిపోయిన పెండింగ్ పనులను త్వరలోనే పూర్తి చేయడంతో పాటు, మౌలిక వసతుల అభివృద్ధికి పెద్దపీట వేస్తానని పేర్కొన్నారు. నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులు కాలనీ వాసులకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ,



సమస్యలపై స్పందిస్తూ కాలనీ అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. కాలనీ అసోసియేషన్ భాగస్వామ్యంతో అన్ని రంగాలలో అభివృద్ధి సాధించే దిశగా కలిసి ముందుకు సాగాలని గాంధీ కోరారు. ఈ కార్యక్రమంలో సమ్మారెడ్డి, చిన్నోళ్ల శ్రీనివాస్, గోపాల్, వీరేషం, హరీష్, వెంకటేష్, మల్లేష్, శ్రీను, శ్యామ్, నరసింహ, రాఘవయ్య, కటిక రవి, రాంచందర్, ప్లంబర్ శ్రీను, నారాయణ, ఆంజనేయులు, మహేష్, సుధాకర్, వెంకట్, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

# నాట్య ప్రదర్శన..!!



ముషీరాబాద్ మేజర్ న్యూస్ : పూరి జగన్నాథ స్వామి నృత్య నీరాజనం సందర్భంగా జగన్నాథ స్వామి దేవాలయంలో సుమరు 100 మందితో కోలాటం తో ప్రదక్షణ మరియు చిన్నారులు చేసే కూచిపూడి నృత్య ప్రదర్శన జరిగింది, ఈ కరిక్రమంలో ఆలయ సెక్రటరీ రవీంద్రనాథ్ గిరి దిలీప్ ఆదినారాయణ ) పరేష్ జీ పురోహిత్ నాట్య గురువులు శివిక వేద భార్గవి అక్షయ విజయ లక్ష్మి సుచిత్ర మరియూ ఇతర నాట్య గురువులు పాల్గొన్నారు. దేవాలయం వారు యంత గానో సహాయ సహకారులు అందించారు వారికి ఏ ఎస్ సీ ఏ కృతజ్ఞతలు తెలియజేసారు. ఇంకా యానో ప్రదర్శనములు జరగాలి అని జగన్నాథ స్వామి ఆశీస్సులు అందరికి దొరకాలి అని కోరుకుందాం, మా ఈ కార్యక్రమం ఇంత సక్సెస్ అవటానికి కారణం ప్రధానంగా చిన్నారుల తల్లి తండ్రులకు నాట్య గురువులకు, ఆలయ నిర్వహణ, మరియు అందరికి. అసోసియేషన్ భవాని సీ హెచ్ .సీతారాం బృందం ప్రత్యకంగా ధన్యవాదము తెలియజెసారు నిర్వాహకులు.

# ప్రమాదాల నివారణకు స్పీడ్ బ్రేకర్లు

## ఓటర్ ఐడి రిజిస్ట్రేషన్ కేంద్రం ఏర్పాటు చేయాలని కార్పొరేటర్‌కు వినతి



మాదాపూర్,మేజర్ న్యూస్ : గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని నల్లగండ్లలో ఉన్న అపర్ణ సైబర్ స్కైప్ గేటెడ్ కమ్యూనిటీ వాసులు, తమ ప్రాంతంలో ప్రమాదాలు నివారించేందుకు స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని గచ్చిబౌలి డివిజన్ కార్పొరేటర్ గంగాధర్ రెడ్డిని కోరారు. కమ్యూనిటీ వాసుల విజ్ఞప్తికి మేరకు స్పందించిన కార్పొరేటర్ స్వయంగా ప్రాంతాన్ని సందర్శించి సమస్యలను పరిశీలించారు. ప్రధాన రహదారిపై వాహనాల రద్దీ ఎక్కువగా ఉండటంతో ప్రమాదాల అవకాశాలు ఉన్నాయని గుర్తించి, స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని సంబంధిత జీహెచ్ఎంసీ, ట్రాఫిక్ అధికారులతో వెంటనే మాట్లాడారు. అదే విధంగా అక్కడ నివసిస్తున్న చాలామందికి ఓటర్ ఐడి కార్డులు లేకపోవడంతో, ఓటర్ ఐడి రిజిస్ట్రేషన్ కేంద్రం ఏర్పాటు చేయాలని కమ్యూనిటీ వాసులు కోరగా, దానిపై కూడా తగిన చర్యలు తీసుకుంటామని కార్పొరేటర్ హామీ ఇచ్చారు. ప్రజల భద్రత, ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ తన ముఖ్య బాధ్యత అని పేర్కొంటూ, గచ్చిబౌలి డివిజన్ అభివృద్ధి కోసం ఎల్లప్పుడూ కృషి చేస్తానని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో అపర్ణ సైబర్ స్కేప్ కమ్యూనిటీ ప్రతినిధులు, సీనియర్ నాయకులు, స్థానిక నేతలు పాల్గొన్నారు.

# ఘనంగా భగవాన్ వేణు దత్తాత్రేయ స్వామి పాదా పూజా కార్యక్రమం

జీడిమెట్ల మేజర్ న్యూస్ : కలియుగ ప్రత్యక్ష దైవం, విశ్వ గురు, దత్త అవధూత, భగవాన్ శ్రీశ్రీశ్రీ రామదూత స్వామి ఆశీస్సులతో భగవాన్ వేణు దత్తాత్రేయ స్వామి పాదా పూజా కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఆదివారం మియాపూర్ నరేన్ కన్వెన్షన్ లో కలియుగ ప్రత్యక్ష దైవం విశ్వగురు, దత్త అవధూత భగవాన్ శ్రీశ్రీశ్రీ రామదూత స్వామివారి ఆశీస్సులతో, భగవాన్ శ్రీ వేణు దత్తాత్రేయ స్వామి పాదపూజ తో పాటు, అష్టలక్ష్మి సిద్ధి మహాయాగ సహిత గురు పాద పుష్పార్చనలో కుత్బుల్లాపూర్ మాజీ శాసనసభ్యులు కూన శ్రీశైలం గౌడ్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. అనంతరం భక్తులను ఉద్దేశించి అయన మాట్లాడుతూ భక్త అవధూత విశ్వగురు, భగవాన్ శ్రీశ్రీశ్రీ రామదూత స్వామివారి ఆశీస్సులతో పాటు



భగవాన్ దత్తాత్రేయ స్వామి వారి ఆశీస్సులు, స్వామివారు కృపాకటాక్షాలు, ప్రజలందరిపై ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు, కుత్బుల్లాపూర్ డివిజన్ నాయకులు, కార్యకర్తలు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

సూర్య

విలేకరులు కావలెను

కావలసిన సెంటర్లు

ఉప్పల్, నాచారం, మల్లాపూర్, కాప్రా

ఆసక్తి గల అభ్యర్థులు
సిటీ ఇన్‌ఛార్జ్ : నాగభూషణం, హెచ్ఆర్
9494662279
నంబర్‌ను సంప్రదించగలరు.

సూర్య కార్యాలయం

Surya Soudha, Plot No.185, Siddi Vinayaka Nagar,
Opp: Hi-Tech City, Near YSR Statue, 100 Ft. Road,
Madhapur, Hyderabad - 500 072

# విద్యార్థుల భవిష్యత్తుకు దిశానిర్దేశం

- రెసొనెన్స్ ఆధ్వర్యంలో 'కెరీర్ క్లారిటీ కాన్క్లేవ్ ఎక్స్‌పో 2026'







కూకట్ పల్లి మేజర్ న్యూస్:ఇంటర్మీడియట్ అనంతరం విద్యార్థులకు అందుబాటులో ఉన్న వివిధ వృత్తిపరమైన అవకాశాలపై అవగాహన కల్పించేందుకు రెసోనెన్స్ జూనియర్ కళాశాలలు నగరంలోని జేఎన్టీయూ ఆడిటోరియంలో 'కెరీర్ క్లారిటీ కాన్క్లేవ్ ఎక్స్‌పో 2026'ను నిర్వహించాయి. ఉదయం 9.30 నుంచి సాయంత్రం 6.30 గంటల వరకు విద్యార్థులు, తల్లిదండ్రుల కోసం ఐదు ప్రత్యేక సెషన్లు, ప్రశ్నోత్తరాల కార్యక్రమాలు జరిగాయి. ఈ కార్యక్రమంలో ప్రముఖ విద్యా సంస్థల నిపుణులు, పరిశ్రమల ప్రతినిధులు పాల్గొని విద్యార్థులకు కెరీర్ మార్గాలు, కోర్సుల ఎంపిక, పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే విధానం, ప్రీమియర్ విద్యాసంస్థల అడ్మిషన్ ప్రక్రియలపై సమగ్ర అవగాహన కల్పించారు. ప్రతి సెషన్‌లో ఒక ప్రధాన వక్తతో పాటు ఇద్దరు ప్యానెల్ సభ్యులు పాల్గొని వాస్తవ పరిస్థితులపై స్పష్టత ఇచ్చారు.

నిపుణుల సూచనలు

ఐఐటీ డీన్ రమేష్ లోగనాథన్ మాట్లాడుతూ, అభిరుచి, ప్రాథమిక అంశాలపై అవగాహన ఉన్నప్పుడే కంప్యూటర్ సైన్స్‌ను ఎంచుకోవాలని సూచించారు. సమస్యలను పరిష్కరించే సామర్థ్యం అత్యంత కీలకమన్నారు.

గీతం యూనివర్సిటీ కోర్ ఇంజనీరింగ్ డీన్ డా. రామశాస్త్రి వేదుల విద్యార్థులు ప్రాథమిక సూత్రాలను బలంగా అభ్యసించాలన్నారు. కోర్ ఇంజనీరింగ్ విభాగాల్లో విస్తృత అవకాశాలు ఉన్నాయని తెలిపారు.

నెక్స్ట్‌వేవ్ కో-ఫౌండర్ సీఈఓ రాహుల్ అత్తులూరి భవిష్యత్తులో కెరీర్ నైపుణ్యాలకే ప్రాధాన్యత పెరుగుతుందన్నారు. నిరంతర అభ్యాసం తప్పనిసరి అని, పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా సామర్థ్యాలను మెరుగుపర్చుకోవాలని సూచించారు.

యశోద హాస్పిటల్స్ సీనియర్ కన్సల్టెంట్ డా. బీ. బాల రాజు ఎంబీబీఎస్ దీర్ఘకాలిక నిబద్ధతతో కూడుకున్న కోర్సు అని, వైద్య రంగంలో ఉన్న విభిన్న అవకాశాలను ముందుగానే అవగాహన చేసుకోవాలని అన్నారు. ఐసీఎఫ్ఏఐ డైరెక్టర్ సుధాకర్ రావు మాట్లాడుతూ, ఇంజనీరింగ్, మెడిసిన్‌కు మాత్రమే పరిమితం కాకుండా ఇతర వృత్తిపరమైన రంగాలు వేగంగా విస్తరిస్తున్నాయని చెప్పారు. సరైన కెరీర్ ఎంపిక, స్పష్టత, కమ్యూనికేషన్ స్కిల్స్‌పైనే విజయం ఆధారపడి ఉంటుందన్నారు.

నిర్వాహకుల ఈ సందర్భంగా రెసోనెన్స్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ తెలంగాణ, ఏపీ మేనేజింగ్ డైరెక్టర్ పూర్ణచంద్రరావు మాట్లాడుతూ, విద్యార్థుల ఆశయాలువాస్తవ ప్రపంచ అవకాశాల మధ్య ఉన్న వ్యత్యాసాన్ని తొలగించేందుకే ఈ కాన్క్లేవ్‌ను రూపొందించామన్నారు. ఒకే వేదికపై విద్యా నిపుణులు, పరిశ్రమల ప్రతినిధులను కలపడం ద్వారా విద్యార్థులకు వాస్తవాధారిత మార్గదర్శనం అందించామని తెలిపారు. విద్యార్థులు, తల్లిదండ్రులు ఆత్మవిశ్వాసంతో సరైన నిర్ణయాలు తీసుకునేలా ఈ కార్యక్రమం దోహదపడిందన్నారు.

# అర్ధరాత్రి హోటళ్లపై కేపిహెచ్బీ పోలీసుల ఉక్కుపాదం

శాంతిభద్రతల పరిరక్షణే లక్ష్యం

కూకట్ పల్లి మేజర్ న్యూస్ :కేపిహెచ్బీ పోలీస్ స్టేషన్ పరిధిలో అర్ధరాత్రి నిబంధనలకు విరుద్ధంగా పబ్ లు, హోటళ్లు, ఫుడ్ సెంటర్లు నిర్వహిస్తున్న వారిపై పోలీసులు కఠిన చర్యలు చేపడుతున్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కేపిహెచ్బీ ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో మూడు రోజుల నుంచి కేపిహెచ్బీ పోలీస్ స్టేషన్ పరిధిలో అర్ధరాత్రి 12 గంటలు దాటిన తరువాత తెరిచి ఉన్న హోటళ్లపై ప్రత్యేక తనిఖీలు నిర్వహిస్తున్నారు.నిబంధనలను అతిక్రమించి అర్ధరాత్రి తర్వాత కూడా హోటళ్లు నిర్వహిస్తున్న నిర్వాహకులపై కేసులు నమోదు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా, శాంతిభద్రతలు భంగం చెందకుండా అర్ధరాత్రి 12 గంటలలోపు హోటళ్లు మూసివేయాలని పోలీస్ శాఖ స్పష్టంగా సూచించింది.రాత్రి వేళల్లో హోటళ్ల వద్ద గుంపులు, వాహనాల రద్దీ కారణంగా ట్రాఫిక్ సమస్యలు, శాంతిభద్రతల సమస్యలు తలెత్తే అవకాశం ఉందని పోలీసులు పేర్కొన్నారు. అందుకే ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా ఈ తనిఖీలు చేపట్టినట్లు వెల్లడించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరిస్తూ, హోటల్ నిర్వాహకులు పోలీస్ శాఖకు సహకరించాలని కేపిహెచ్బీ పోలీసులు కోరుతున్నారు.

# నివాస కాలనీలో అక్రమ స్పా మసాజ్ కేంద్రాలు?

-కుటుంబాల నివాస ప్రాంతాల్లో ఇలాంటి కార్యకలాపాలు వద్దంటున్న స్థానికులు

- స్పా సెంటర్లపై పోలీసుల చర్యలపై ప్రశ్నలు

కేపిహెచ్బీ మేజర్ న్యూస్ : కేపిహెచ్బీ పోలీస్ స్టేషన్ పరిధిలో నిబంధనలకు విరుద్ధంగా స్పా, మసాజ్ సెంటర్లు కొనసాగుతున్నాయన్న ఆరోపణలు రోజురోజుకు పెరుగుతున్నాయి. ముఖ్యంగా వసంత్ నగర్ కాలనీలో నివాస ప్రాంతం మధ్యలో ఒక స్పా మసాజ్ సెంటర్ నిర్వహణపై స్థానిక కాలనీవాసులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. కుటుంబాలు నివసించే కాలనీలో అనుమానాస్పదంగా స్పా మసాజ్ సెంటర్ నడపడం వల్ల మహిళలు, పిల్లలు, వృద్ధులు భయాందోళనకు గురవుతున్నారని స్థానికులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో సంబంధిత స్పా సెంటర్‌పై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు సమాచారం.అయితే ఫిర్యాదు చేసిన కాలనీవాసులపై స్పా నిర్వాహకుడు దురుసుగా ప్రవర్తిస్తూ, కేంద్రాన్ని కొనసాగిస్తానంటూ బెదిరింపులకు పాల్పడుతున్నాడన్న ఆరోపణలు కూడా వెలుగులోకి వచ్చాయి. గతంలో ఇదే నిర్వాహకునిపై కేసులు నమోదయ్యాయని, అయినప్పటికీ ప్రస్తుతం మళ్లీ యథావిధిగా స్పా మసాజ్ సెంటర్ కొనసాగుతుండటం పలు అనుమానాలకు తావిస్తోంది అని స్థానికులు ఆరోపిస్తున్నారు.పోలీసుల చర్యలు కేవలం నోటీసులు, కాగితాల వరకే పరిమితమవుతున్నాయని, క్షేత్రస్థాయిలో కఠిన చర్యలు కనిపించడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా ఇలాంటి కేంద్రాలు కొనసాగితే శాంతిభద్రతల సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని కాలనీవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.నివాస ప్రాంతాల్లో అక్రమంగా నడుస్తున్న స్పా మసాజ్ సెంటర్లను వెంటనే గుర్తించి మూసివేయాలని, సంబంధిత అధికార యంత్రాంగం ఇకనైనా స్పందించి కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

# ఎల్‌బీఎస్ నగర్‌లో తాగునీటి సమస్యకు పరిష్కారం

- కంచి మహేందర్ వ్యక్తిగత చొరవతో బోరు, పంప్ ప్రారంభం - స్థానికుల హర్షం ఘన సన్మానం



ఫతేనగర్ మేజర్ న్యూస్: ఫతేనగర్ డివిజన్ పరిధిలోని ఎల్‌బీఎస్ నగర్‌లో ఎన్నాళ్లుగానో కొనసాగుతున్న తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభించింది. బీజేపీ సీనియర్ నాయకులు కంచి మహేందర్ స్వయంగా చొరవ తీసుకుని, తన వ్యక్తిగత నిధులతో బోరు తవ్వించి, పంప్ ఏర్పాటు చేయడంతో స్థానికుల ఇబ్బందులకు ముగింపు పడింది.

ఎల్‌బీఎస్ నగర్‌లో తాగునీటి సరఫరా సమస్యపై పలుమార్లు సంబంధిత అధికారులను, అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని ఆశ్రయించినా స్పందన లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని స్థానికులు తెలిపారు. ఈ పరిస్థితిని ప్రత్యక్షంగా గమనించిన కంచి మహేందర్, రాజకీయాలకు అతీతంగా ముందుకు వచ్చి సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టారు. బోరు, పంప్‌ను ప్రారంభించిన అనంతరం ఈ ప్రాంతంలో తాగునీటి సరఫరా మెరుగుపడడంతో కాలనీలో ఆనందోత్సవ వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా స్థానికులు కంచి మహేందర్‌ను ఘనంగా సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా కంచి మహేందర్ మాట్లాడుతూ,"మాటలకన్నా పని ముఖ్యం. ఫతేనగర్‌లో ప్రజల జీవితాల్లో మార్పు తీసుకురావడమే నా లక్ష్యం. ఈ బోరు పంప్ అదే మార్పుకు నిదర్శనం," అని అన్నారు.ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, స్థానిక నాయకులు, శ్రేయోభిలాషులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కూకట్ పల్లి గొల్ల కురుమ సంఘానికి నూతన నాయకత్వం

- ఏకగ్రీవంగా అధ్యక్షుడు రాజు, ప్రధాన కార్యదర్శి మహేందర్ ఎన్నిక

- సమిష్టి కమిటీ ఏర్పాటుకు నిర్ణయం



కూకట్ పల్లి మేజర్ న్యూస్ :కూకట్ పల్లి గొల్ల కురుమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం సంఘ సభ్యుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సంఘానికి నూతన నాయకత్వాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘ అధ్యక్షుడిగా అంకెనపల్లి రాజులు, ప్రధాన కార్యదర్శిగా గుర్రంపల్లి మహేందర్ యాదవ్ లను సమావేశానికి హాజరైన కుల సభ్యులు ఏకగ్రీవంగా ఎంపిక చేశారు.సమావేశంలో పాల్గొన్న సభ్యులు మాట్లాడుతూ, నూతనంగా ఎన్నికైన అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి కలిసి సమిష్టిగా నూతన కమిటీని ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. కూకట్ పల్లి పరిధిలోని అన్ని ఆలయాలను కలుపుకొని, సంఘంలోని అన్ని వర్గాల సభ్యులకు ప్రాతినిధ్యం కల్పించేలా సమన్వయ కమిటీ ఏర్పాటు చేయాల్సిందిగా ఏకగ్రీవ తీర్మానం చేశారు.సంఘ ఐక్యత, సామాజిక అభివృద్ధి, సభ్యుల సంక్షేమమే లక్ష్యంగా ముందుకు సాగాలని సమావేశం అభిప్రాయపడింది. నూతన నాయకత్వం ఆధ్వర్యంలో సంఘ కార్యకలాపాలు మరింత బలోపేతం కావాలని సభ్యులు ఆకాంక్షించారు

# ఆంజనేయ నగర్ పార్కు స్థలం కాపాడాలని నిరాహార దీక్ష

▶▶ మున్సిపల్ కార్యాలయం ఎదుట కాలనీవాసుల ఆందోళన

▶▶ అధికారుల హామీతో విరమించిన దీక్ష



మూసాపేట్ మేజర్ న్యూస్ :ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని పార్కు అభివృద్ధి పూర్తయ్యే వరకు తమ మద్దతు కొనసాగుతుందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు స్పష్టం చేశారు. మూసాపేట్ డివిజన్ పరిధిలోని ఆంజనేయ నగర్, రోడ్ నెంబర్9లో ఉన్న పార్కు స్థలాన్ని పరిరక్షించి, కాలనీ ప్రజల సౌకర్యార్థం అభివృద్ధి చేయాలని డిమాండ్ చేస్తూ ఆంజనేయ నగర్ కాలనీ వాసులు మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరాహార దీక్ష చేపట్టారు. కాలనీ సభ్యులు మహేందర్, లోకేష్ ఆధ్వర్యంలో నిన్న ఉదయం నుంచి ఈ దీక్ష కొనసాగింది.స్థానిక నాయకుల ద్వారా విషయం తెలుసుకున్న రాజేశ్వరరావు మున్సిపల్ కార్యాలయానికి చేరుకుని, దీక్ష చేస్తున్న కాలనీవాసులకు సంఘీభావం ప్రకటించారు. అనంతరం స్వయంగా నిరాహార దీక్షలో కూర్చొని మద్దతు తెలిపారు. అలాగే సంబంధిత మున్సిపల్ అధికారులతో చర్చించి, ఆంజనేయ నగర్‌లో పార్కు స్థల ప్రాధాన్యతను, కాలనీ ప్రజల అవసరాలను వివరించారు.

ఈ చర్చలకు స్పందించిన మున్సిపల్ అధికారులు పార్కు అభివృద్ధి పనులు త్వరలోనే చేపడతామని హామీ ఇచ్చినట్లు సమాచారం. అధికారుల హామీ నేపథ్యంలో, దీక్ష చేపట్టిన మహేందర్, లోకేష్ తో పాటు ఇతర కాలనీ సభ్యులు పరస్పర చర్చల అనంతరం నిరాహార దీక్షను విరమించారు. ఈ సందర్భంగా రాజేశ్వరరావు మహేందర్, లోకేష్‌లకు కొబ్బరి నీళ్లు అందించి దీక్ష విరమింపజేశారు. ఈ కార్యక్రమంలో మూసాపేట్ డివిజన్ కార్పొరేటర్ కొడిచెర్ల మహేందర్, మూసాపేట్, బాలాజీ నగర్ డివిజన్‌ల బీజేపీ నాయకులు, అసెంబ్లీ కన్వీనర్ శ్రీకర్ రావు, డాకయ్య, మల్లేష్ గౌడ్, జీవన్, శేఖర్ గుప్తా, వినోద్ గౌడ్, ఈ. సాయి, పిట్ల మనోహర్, పండుగ రేణుక తదితరులు పాల్గొన్నారు.

## అంగరంగ వైభవంగా...భ్రమరాంబిక మల్లికార్జున స్వామి కళ్యాణ మహోత్సవం





మల్కాజిగిరి, మేజర్ న్యూస్ : గౌతంనగర్ డివిజన్ పరిధిలోని మల్లికార్జున నగర్ మల్లన్న దేవాలయంలో ఆదివారం మల్కా జిగిరి శ్రీకృష్ణ యాదవ సంఘం ఆధ్వర్యంలో భ్రమరాంబిక మల్లికార్జున స్వామి కళ్యాణ మహోత్సవం, బోనాల జాతర అంగరంగ వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి, గౌతంనగర్ డివిజన్ కార్పొరేటర్ మేకల సునీ త రాముయాదవ్, వినాయక్ నగర్ డివిజన్ కార్పొరేటర్ క్యానం రాజ్యలక్ష్మిలు వేర్వేరుగా హాజరై మల్లన్న స్వామిని దర్శించుకుని ప్రత్యే క పూజలో పాల్గొని ఆయన దీవెనలు తీసు కున్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ నిర్వాహకులకు, భక్తులకు వారు శుభాకాంక్ష లు తెలియజేశారు. మల్లన్న స్వామివారి కళ్యాణ మహోత్సవానికి హాజరైన గౌరవ అతిథులను, నిర్వాహకులు పూలమాల, శాలువాలతో ఘనంగా సన్మానించా రు. ఈ సందర్భంగా మహిళలు పెద్ద సంఖ్య లో హాజరై బోనాలు సమర్పించారు. ఒగ్గు కథలు,గొలుసు తెంపుట వంటి కార్యక్రమాలు ఆహుతులను విశేషంగా ఆకట్టుకున్నాయి. అనంతరం భక్తులకు పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ ఏకే మురుగేష్, బీఆర్ఎస్ నాయకులు మేకల రాముయాదవ్, బైరు అనిల్, అనిల్ కిశోర్, మండల చిన్నాయాదవ్ ,బీజేపీ నాయకులు సునీల్ యాదవ్, చారి, గణేష్, మంజుల తదితరులు పాల్గొన్నారు.

## రాజకీయ కక్షతో కేసీఆర్‌ను లక్ష్యంగా చేసుకున్న కాంగ్రెస్: రెడ్డి సతీష్ అరోరా

### - తెలంగాణ రాష్ట్ర నిర్మాణంలో కేసీఆర్ పాత్ర మరచిపోవద్దు - కక్ష సాధింపు రాజకీయాలు మానుకోవాలి



కూకట్ పల్లి మేజర్ న్యూస్ : తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్ రావు (కేసీఆర్) పై కాంగ్రెస్ ప్రభుత్వం అనవసర ఆరోపణలు చేస్తూ రాజకీయ కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నదని కూకట్‌పల్లి నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ కో–ఆర్డినేటర్ రడ్డి సతీష్ అరోరా తీవ్రంగా విమర్శించారు. ఈ సందర్భంగా సతీష్ అరోరా మాట్లాడుతూ కేసీఆర్‌కు సంబంధం లేని అంశాల్లో నోటీసులు జారీ చేసి ఇబ్బందులకు గురి చేయడం పట్ల తెలంగాణ ప్రజలు సైతం గమనిస్తున్నారని, తగిన సమయంలో తగిన గుణపాఠం చెప్పేందుకు రాష్ట్రం సిద్ధంగా ఉందని ఆయన హెచ్చరించారు. అలుపెరగని ఉద్యమంతో ప్రాణాలను సైతం లెక్కచేయకుండా తెలంగాణ సాధించిన నాయకుడు కేసీఆర్ అని గుర్తు చేశారు. ఆయన నేతృత్వంలోనే తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో దేశంలోనే అగ్రగామిగా నిలిచిందని పేర్కొన్నారు. కేసీఆర్ లేకపోతే తెలంగాణ రాష్ట్రం ఏర్పడేదా అనే ప్రశ్నకు కాంగ్రెస్ ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కేసీఆర్ ఉద్యమ ఫలితంగా రాజకీయ భవిష్యత్తు పొందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు, ఆ అవకాశాన్ని ప్రజాసేవకు వినియోగించకుండా మహోన్నత నాయకులను అవమానించేందుకు ప్రయత్నించడం తెలంగాణ ప్రజలు ఎన్నటికీ సహించరని అరోరా స్పష్టం చేశారు.ఎన్ని కుప్పిగంతులు వేసినా బిఆర్ఎస్ పార్టీని, కేసీఆర్‌ను కాంగ్రెస్ ప్రభుత్వం ఏమీ చేయలేదని ఆయన ఎద్దేవా చేశారు. ఇప్పటికైనా కాంగ్రెస్ నాయకులు కక్ష సాధింపు రాజకీయాలు మానేసి, తెలంగాణ ప్రజలకు మేలు చేసే అభివృద్ధి కార్యక్రమాలపై దృష్టి పెట్టాలని హితవు పలికారు. లేకపోతే, ఇదే ధోరణి కొనసాగితే రాబోయే రోజుల్లో కాంగ్రెస్ నాయకుల పరిస్థితి దారుణంగా మారే అవకాశముందని రెడ్డి సతీష్ అరోరా హెచ్చరించారు.

## లయన్స్ క్లబ్ సికింద్రాబాద్ నార్త్ సేవలు ప్రశంసనీయం

### డిస్ట్రిక్ట్ గవర్నర్ సేల్వ సాయి రామ్ రాజ్ అభినందన

కూకట్ పల్లి మేజర్ న్యూస్: లయన్స్ క్లబ్ అఫ్ సికింద్రాబాద్ నార్త్ 320 బి సేవలు ఆదర్శవంతంగా ఉన్నాయని డిస్ట్రిక్ట్ గవర్నర్ సేల్వ సాయి రామ్ రాజ్ అభినందించారు. ఈ మేరకు జీడిమెట్లలోని ఓ ప్రైవేటు హోటల్లో జరిగిన చార్టర్ నైట్ కార్యక్రమం లో గవర్నర్ ముఖ్యఅతిథిగా హాజరై క్లబ్ సేవలను కొని యాడారు.డిస్ట్రిక్ట్ గవర్నర్ చెప్పినట్లుగా, సికింద్రాబాద్ నార్త్ క్లబ్ ఐదు సంవత్స రాలుగా ఉదయం అల్పాహారం అందిస్తూ, అన్ని లయన్స్ క్లబ్బులకు ఆదర్శంగా నిలిచింది. రానున్న రోజుల్లో మరిన్ని సేవా కార్యక్రమాలను చేపట్టాలని ఆకాంక్షలు తెలిపారు. క్లబ్ గ్లోబల్ గుర్తింపులోనూ ప్రత్యేకంగా గుర్తింపు పొందింది. సికింద్రాబాద్ నార్త్ క్లబ్ ప్రపంచంలో ఎనిమిదవ అత్యంత పెద్ద క్లబ్గా గుర్తింపుపొందింది అని గవర్నర్ వివరించారు. కార్యక్రమంలో మల్టీ జోనల్ కౌన్సిల్ చైర్మన్ రాజేంద్ర ప్రసాద్, మాజీ గవర్నర్లు విద్యాసాగర్, విజయ్ కుమార్





శెట్టి, అలాగే క్లబ్ అధ్యక్షుడు బిర్రు ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శి జనార్దన్ దయాకర్, నాయకులు శైలజ నాయర్, చల్ల శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.

## ప్రభుత్వం మారినా మారని అధికారుల పని తీరు

### కూకట్‌పల్లి టౌన్ ప్లానింగ్‌లో టిపిఎస్ అవినీతి ఆరోపణలు

కూకట్ పల్లి మేజర్ న్యూస్ : గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కూకట్ పల్లి జోనల్ పరిధిలో టౌన్ ప్లానింగ్ విభాగంలో కొనసాగుతున్న పరిస్థితులు మరోసారి వివాదాస్పదంగా మారాయి. అక్రమ నిర్మాణాలను అడ్డుకోవాల్సిన బాధ్యత కలిగిన అధికారులే వాటికి అప్రత్యక్షంగా తోడ్పడుతున్నారన్న ఆరోపణలు స్థానిక ప్రజల నుంచి వెల్లువెత్తుతున్నాయి.

కూకట్‌పల్లి జోనల్ పరిధిలోని కూకట్‌పల్లిఆల్విన్ కాలనీ సర్కిల్‌లో సెక్షన్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న ఒక టిపిఎస్, తన పరిధిలో జరుగుతున్న అక్రమ నిర్మాణాలను నియంత్రించడంలో పూర్తిగా విఫలమయ్యారని, పైగా వాటి నుంచి అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారన్న ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. రోజుకు లక్షల రూపాయల మేర వసూళ్లు జరుగుతున్నాయన్న ప్రచారం ఉన్నప్పటికీ, ఇప్పటివరకు ఎలాంటి విచారణ జరగకపోవడం అనేక ప్రశ్నలకు తావిస్తోంది. సంబంధిత టిపిఎస్ కార్యాలయంలో అరుదుగా కనిపిస్తారని, అక్రమ నిర్మాణాలు జరుగుతున్న ప్రాంతాల్లో మున్సిపల్ డెమోలేషన్ వాహనంతో సంచరిస్తూ పరిస్థితిని తనకు అనుకూలంగా మలుచుకుంటున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. గత ప్రభుత్వ హయాంలో మొదలైన ఈ వ్యవహారాలు, రాష్ట్ర ప్రభుత్వం మారి రెండేళ్లు గడిచినా కొనసాగుతుండటం గమనార్హం. మరింత ఆందోళన కలిగించే అంశం ఏమిటంటే, "ఏసీబీ అధికారులు సన్నిహితులే" అంటూ తనను ఎవరూ ఏమి చేయలేరన్న ధీమాతో ఈ అధికారి వ్యవహరిస్తున్నాడన్న ప్రచారం అధికార వర్గాల్లోనే వినిపిస్తోంది. ఐఏఎస్ అధికారి జోనల్ కమిషనర్‌గా ఉన్నప్పటికీ, క్షేత్రస్థాయిలో నియంత్రణ లోపిస్తున్నదన్న విమర్శలు కూడా వ్యక్తమవుతున్నాయి. అక్రమ నిర్మాణాలపై ఎలాంటి రాజీ ఉండదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పలు సందర్భాల్లో స్పష్టంగా పేర్కొన్న నేపథ్యంలో, కూకట్‌పల్లి జోనల్ పరిధిలోని పరిస్థితి ప్రభుత్వ ఆదేశాలకు విరుద్ధంగా ఉందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. టౌన్ ప్లానింగ్ నిబంధనలు కాగితాలకే పరిమితమవుతున్నాయా? అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో సంబంధిత ఉన్నతాధికారులు, అవినీతి నిరోధక శాఖ వెంటనే స్పందించి, కూకట్‌పల్లిఆల్విన్ కాలనీ సర్కిల్ పరిధిలో పనిచేస్తున్న టిపిఎస్ పాత్రపై సమగ్ర విచారణ చేపట్టి వాస్తవాలు ప్రజల ముందుకు తీసుకురావాలని స్థానిక ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. బాధ్యులపై చర్యలు తీసుకున్నప్పుడే పాలనపై ప్రజల విశ్వాసం నిలుస్తుందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

## 2026-27 వ కేంద్ర బడ్జెట్‌ను వికసిత్ బడ్జెట్‌గా అభివర్ణించిన చింతల్ రామచంద్రారెడ్డి



సోమాజిగూడ/మేజర్ న్యూస్: కేంద్ర ఆర్థిక మంత్రి పార్లమెంట్ లో ప్రవేశపెట్టిన 2026–27 కేంద్ర బడ్జెట్‌ను వికసిత్ భారత్ అభివృద్ధి బడ్జెట్‌గా అభినందించారు ఖైరతాబాద్ మాజీ ఎమ్మెల్యే చింతల్ రామచంద్రారెడ్డి. 2026–27 కేంద్ర బడ్జెట్‌పై స్పందిస్తూ, ఈ బడ్జెట్ ద్వారా వికసిత్ భారత్ లక్ష్యాన్ని సాధించే అభివృద్ధి బడ్జెట్‌గా అభివర్ణించారు. దేశ ఆర్థిక వ్యవస్థను మరింత బలోపేతం చేసేలా, మౌలిక సదుపాయాలు, వ్యవసాయం, పరిశ్రమలు, ఎం..ఎస్.ఎం.ఈ లు, యువత ఉపాధి అవకాశాలు, మధ్యతరగతి వర్గాలకు ఊరటనిస్తూ రూపొందించారని పేర్కొన్నారు. క్యాపిటల్ ఎక్స్‌పెండిచర్ పెంపు ద్వారా రహదారులు, రైల్వేలు, పోర్టులు, నగరాభివృద్ధి వంటి కీలక రంగాల్లో వేగవంతమైన పురోగతి సాధ్యమవుతుందని చింతల్ గారు తెలిపారు. కొత్త ఆదాయపు పన్ను చట్టం ప్రకారం పన్ను వ్యవస్థను సరళీకరించడం ప్రజలకు ప్రయోజనకరమని అన్నారు.వ్యవసాయ రంగానికి ఇచ్చిన ప్రాధాన్యత రైతులకు దీర్ఘకాలిక భరోసా కల్పిస్తుందని, లకు కేటాయింపులు చిన్న పరిశ్రమలకు ఊపిరి పోస్తాయని ప్రత్యేకంగా ప్రశంసించారు. రక్షణ, సెమీకండక్టర్లు, బయోఫార్మా వంటి ఆధునిక రంగాలపై దృష్టి పెట్టడం ద్వారా భారత్‌ను ప్రపంచ స్థాయిలో పోటీగల దేశంగా మార్చే దిశగా ఈ బడ్జెట్ దోహదపడుతుందని స్పష్టం చేశారు.మొత్తంగా, 2047 నాటికి వికసిత్ భారత్ లక్ష్యాన్ని సాధించే కీలక మైలురాయిగా ఈ బడ్జెట్ నిలుస్తుందని చింతల్ రామచంద్రారెడ్డి అభివర్ణించారు.

## పీపుల్స్ వ్యతిరేక కేంద్ర బడ్జెట్

### - మామిండ్ల రమేష్ రాజా రాష్ట్ర కార్యదర్శి, సీపీఐ (ఎంఎల్) లిబరేషన్



సోమాజిగూడ/మేజర్ న్యూస్: కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన 2026–27 ఆర్థిక నివేదిక (కేంద్ర బడ్జెట్) పూర్తిగా ప్రజా వ్యతిరేకంగా మారిందని సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ రాష్ట్ర కార్యదర్శి మామిండ్ల రమేష్ రాజా తీవ్రంగా వ్యాఖ్యానించారు. గత కొన్ని ఏళ్లుగా కార్మికులు, రైతులు, గిరిజనులు, విద్యార్థులు, యువకులు తమ జీవనోపాధి మెరుగుపరచుకోవాలని, జీవన భద్రత కాపాడుకోవాలని లేవనెత్తిన డిమాండ్లను ఈ బడ్జెట్ పూర్తిగా విస్మరించిందని అభిప్రాయపడ్డారు. కేంద్ర ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా వాటిని తిరస్కరించి, కార్పొరేట్‌లకు మద్దతుగా బడ్జెట్ కేటాయింపులు చేసిందని ఆరోపించారు.రాష్ట్రాలకు నిధుల లోపం, హిందుత్వ పథకాలకు ప్రాధాన్యత బడ్జెట్ నివేదికను, కేటాయింపులను పరిశీలిస్తే రాష్ట్రాలకు తగిన నిధులు కేటాయించబడలేదని రమేష్ రాజా పేర్కొన్నారు. హిందుత్వ–కాషాయీకరణ పథకాల అమలు కోసం పూర్తి స్థాయిలో బడ్జెట్‌ను వాడుతున్నారని, అందుకు అనుగుణంగా కేటాయింపులు జరిగాయని నివేదిక స్పష్టం చేస్తుందని విమర్శించారు. కార్మిక, రైతు, గిరిజన, యువక, విద్యార్థి వర్గాల డిమాండ్లకు స్పందించకపోవడం వల్ల ప్రజల జీవన ప్రమాణాలు మరింత క్షీణిస్తాయని హెచ్చరించారు.ప్రజా ఆమోదం లేని ఆర్థిక విధానాలపై తీవ్ర అసంతృప్తి ని అయన వ్యక్తం చేశారు. బడ్జెట్ ప్రజలకు వ్యతిరేకంగా, కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా ఉందని అయన మండిపడ్డారు. దేశ ఆర్థిక వ్యవస్థలో సమానత్వం, సామాజిక న్యాయం పూర్తిగా అణచివేయబడ్డాయని, ప్రభుత్వం ప్రజా ఆకాంక్షలను పూర్తిగా విస్మరించిందని ఆరోపించారు. ఈ బడ్జెట్‌కు వ్యతిరేకంగా పోరాటాలు చేపట్టనున్నామని ఆయన తెలిపారు.

## భరత్ నగర్ హరిహరక్షేత్రంలో ద్వాదశ జ్యోతిర్లింగాల మహా పూజ

### మాఘ పౌర్ణమి సందర్భంగా గురు స్వామి నరసింహ ఆధ్వర్యంలో ఘన ఉత్సవం



కూకట్ పల్లి, మేజర్ న్యూస్: కూకట్‌పల్లి నియోజ కవర్గం భరత్ నగర్ కాలనీ లోని హరి హరక్షేత్రంలో మాఘ పౌర్ణమి సందర్భంగా గురు స్వామి నరసింహ ఆధ్వర్యంలో ద్వాదశ జ్యోతిర్లింగాల మహా పడిపూజ ఘనంగా నిర్వహించారు. పూజా కార్యక్రమంలో భక్తులు స్వామివారి ఆశీస్సులు పొందుతూ, మాఘ పౌర్ణమి ఉత్సవాన్ని ఆధ్యాత్మికంగా ఘనంగా జరుపుకున్నారు. ఈ పవిత్ర పూజా కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు నాగిరెడ్డి, వికే రావు, జి.ఎల్. రెడ్డి తో పాటు స్థానిక భక్తులు ఆంజనేయులు, గురుస్వామి, నాగరాజు, మహేష్, రమేష్, శ్రావణ్, వేణు గోపాల్ తదితరులు పాల్గొని భక్తిశ్రద్ధలతో పూజలో పాల్గొన్నారు.

# ప్రతిభ చాటిన ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు




సనత్ నగర్,మేజర్ న్యూస్:ఇటీవల నిర్వహించిన చిగురు అనే పోటీల్లో ప్రభుత్వ ఉన్నత పాఠశాల సనత్ నగర్ ఓల్డ్ కు చెందిన విద్యార్థులు ప్రతిభ చాటారు. యూత్ ఫర్ సేవ,ఇతర ఎన్జీఓల సంయుక్త ఆధ్వర్యంలో ఈ పోటీలను నిర్వహించారు. ఇందులో మేడ్చల్, హైదరాబాద్, రంగారెడ్డి, సంగారెడ్డి జిల్లాలకు చెందిన సుమారు 300ల పాఠశాలలకు చెందిన విద్యార్థులు పోటీ పడ్డారు. ఈ పోటీలకు ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు కూడా హాజరయ్యారు. సనత్ నగర్ ఓల్డ్ పాఠశాలకు చెందిన తొమ్మిదో తరగతి విద్యార్థులు అక్షయ, శ్రావణి, సహజ, సాయి, కీర్తన, లక్ష్మీకళ గ్రూప్ డాన్స్ విభాగంలో పోటీపడి రెండో బహుమతి గెలుచుకున్నారు. అదే తరగతికి చెందిన సఫూర జస్ట్ ఎ మినిట్ పోటీలో ప్రతిభ చాటి రెండో బహుమతిని కైవసం చేసుకుంది. ఈ విషయమై పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మార్త మాట్లాడుతూ తమ పాఠశాల విద్యార్థులు జిల్లాల స్థాయి పోటీల్లో విజయం సాధించడం ఆనందంగా ఉందన్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు శుభాకాంక్షలను తెలియజేశారు. భవిష్యత్తులో వారు మరిన్ని విజయాలను సాధించాలని ఆకాంక్షించారు. బహుమతులు గెలుపొందిన విద్యార్థులను తల్లిదండ్రులతో పాటు ఉపాధ్యాయులు, తోటి విద్యార్థులు అభినందనలతో ముంచెత్తారు.

# బిఎన్‌రెడ్డినగర్ డివిజన్ పలు కాలనీలలో అభివృద్ధి పనుల ప్రారంభోత్సవం

**శ్రీ పురం కాలనీ ఫేస్ – 1లో ఓపెన్ జిమ్ ప్రారంభోత్సవం**

**డివిజన్ అభివృద్దే లక్ష్యంగా పని చేస్తున్నాను : కార్పోరేటర్ మొద్దు లచ్చిరెడ్డి**



వనస్థలిపురం, మేజర్‌న్యూస్ఃబిఎన్‌రెడ్డినగర్ డివిజన్ అభివృద్ధిలో భాగంగా పలు కాలనీలలో సిసి రోడ్ల ప్రారంభం, శంఖుస్థాపన కార్యక్రమాలలో కార్పోరేటర్ మొద్దు లచ్చిరెడ్డి పాల్గొన్నారు. డివిజన్ పరిధిలోని శ్రీ పురం కాలనీలో 37 లక్షల రూపాయల నిధులతో చేపట్టనున్న సిసి రోడ్డుకు శంఖుస్థాపన, శ్రీ పురం కాలనీ పేస్ -2లో 18 లక్షల రూపాయల నిధులతో చేపట్టనున్న సిసి రోడ్డుకు శంఖుస్థాపన, ఫేస్–1లో 21 లక్షల రూపాయల నిదులతో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌ను కార్పోరేటర్ ప్రారంభోత్సవం చేశారు. పద్మావతీ కాలనీలో 22 లక్షల రూపాయల నిధులతో సిసి రోడ్లు, శ్రీ వీరాంజనేయ కాలనీలో 34 లక్షల రూపాయలతో సిసి రోడ్ల నిర్మాణం పనులకు కార్పోరేటర్ శంఖుస్తాపన చేశారు. ఈ సందర్భంగా కార్పోరేటర్ మాట్లాడుతూ బిఎన్‌రెడ్డినగర్ డివిజన్ అభివృద్ధి కొరకు పలు కాలనీలలో రోడ్ల నిర్మాణం చేపట్టడం చాలా సంతోషంగా ఉందని, త్వరలోనే పనులు ప్రారంభమయ్యే విధంగా చర్యలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు ముత్యం రావు, శ్రీధర్‌రెడ్డి, రాజుగౌడ్, సత్యనారాయణ, కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు నారాయణరెడ్డి, విఠల్‌రెడ్డి, సికిందర్‌రెడ్డి, పురుషోత్తమ్‌రెడ్డి, డాక్టర్ బృంగి శిరీష్ కుమార్, రాజేందర్‌రెడ్డి, వెంకటరమణారెడ్డి, రాజేందర్, వెంకటేశ్వర్‌రావు, దయాకర్, దామోదర్‌రావు, సిహెచ్ శ్రీధర్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, రామయ్య, కిరణ్‌కుమార్, మదన్‌మోహన్, సాయికుమార్, పాండురంగారావు, ప్రసాద్, మధుసూదన్‌రెడ్డి, రామ్మోహన్‌రావు, నరేష్‌రెడ్డి, సురేష్‌రెడ్డి, నరహరి, నరేష్,సుధాకర్‌రావు, శివ, శంకరయ్య, రెహమాన్, ఖాదర్‌పాష, సత్యనారాయణ, అనిల్‌కుమార్, రమేష్, శ్రీవాత్సవ, ఫణీందర్, బిజెపి డివిజన్ కార్యదర్శి కల్లు విష్ణువర్దన్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు పవన్‌రెడ్డి, ఓబిసి మోర్చా అధ్యక్షుడు మహేష్‌గౌడ్, సురేష్‌కుమార్, దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# అమ్మ వారి ఆశీస్సులతో ప్రజలంతా సుఖ శాంతులతో ఉండాలి

**శ్రీ మంగళంపల్లి మహమ్మాయి అమ్మ వారి కళ్యాణ మహోత్సవంలో కౌలె జగన్నాదం**

వనస్థలిపురం,మేజర్‌న్యూస్ః శ్రీ మంగళంపల్లి మహమ్మాయి అమ్మ వారి ఆశీస్సులతో ప్రజలంతా సుఖ శాంతులతో ఉండాలని అఖిల భారత విశ్వకర్మ మహాసభ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు కౌలె జగన్నాదం అన్నారు. శ్రీశ్రీశ్రీ మంగళంపల్లి మహమ్మాయి అమ్మ వారి కళ్యాణ మహోత్సవానికి నిర్వాహకుల ఆహ్వానం మేరకఉ జగన్నాదం ముఖ్య అతిధిగా హాజరై కళ్యాణాన్ని వీక్షించి యజ్ఞ,యాగాలు నిర్వహించడం ద్వారా శాంతి సమాజం నెలకొంటుందని ఆకాంక్షించారు. కార్యక్రమంలో భీష్మ పితా మహులు లాల్ కోట వెంకటాచారి, అఖిల



భారత విశ్వకర్మ మహాసభ ప్రధాన కార్యదర్శి సంకోజు లింగాచారి, రాష్ట్ర ఉపాధ్యక్షులు కాసోజు శ్రీనివాసచారి, యూత్ అధ్యక్షులు కౌలె అభిషేక్, బ్రహ్మాచారి హాజరై అమ్మ వారి ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా పాల్గొన్న అతిధులు అమ్మ వారి విశిష్టతను వివరించారు.

# అంబటి అనుచిత వ్యాఖ్యలు హేయమైన చర్య

- అంబటి పై కఠిన చర్యలు తీసుకోవాలి
- టిడిపి మాల్కాజ్‌గిరి పార్లమెంట్ నియోజకవర్గం అడ్ హాక్ కమిటి సభ్యుడు గద్దె విజయ్‌నేత



వనస్థలిపురం,మేజర్‌న్యూస్ఃఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పై అంబటి రాంబాబు అనుచిత వ్యాఖ్యలు హేయమైన చర్య అని, బాధ్యతాయుతమైన పదవిలో పని చేసిన వ్యక్తి బూతు పురాణం అందుకోవడం ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టు అని తెలుగుదేశం పార్టీ మాల్కాజ్‌గిరి పార్లమెంట్ నియోజకవర్గం అడ్ హాక్ కమిటి సభ్యుడు, బిఎన్‌రెడ్డినగర్ డివిజన్ కంటెస్టెడ్ కార్పోరేటర్ గద్దె విజయ్‌నేత మండి పడ్డారు. అనుచిత వ్యాఖ్యలు చేసిన అంబటి రాంబాబుపై ప్రభుత్వం చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. రాజకీయాల్లో విమర్శలు, ప్రతి విమర్శలు సహజం అయినప్పటికి మాజీ మంత్రి అంబటి రాంబాబు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ను ఉద్దేశించి ఉపయోగించిన బాష అత్యంత హేయమైనదన్నారు. ఒక బాధ్యాతాయుతమైన పదవిలో పని చేసిన వ్యక్తి ఇలాంటి బూతు పురాణం అందుకోవడం ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టు అన్నారు. అంబటి రాంబాబు వాడిన పదజాలం కేవలం రాజకీయ విమర్శ మాత్రమే కాదని, అది వ్యక్తిగత ధూషణ అని, అసభ్యతతో సంస్కార హీనమైన భాషతో కూడుకున్నదన్నారు. ఇది తెలుగు రాజకీయ సంస్కృతిని మరింత దిగజార్చేలా ఉందన్నారు. ముఖ్యమంత్రి అనే వ్యక్తి ఒక పార్టీకి మాత్రమే కాకుండా, రాష్ట్రం మొత్తానికి ప్రతినిధి అటువంటి గౌరవనీయమైన పదవిలో ఉన్న వారిపై బహిరంగంగా బూతులు మాట్లాడడం వ్యవ స్థలను అగౌరవపరచడమేనని, ప్రజల హృద్య విద్వేషాలను ప్రేరేపించేలా, శాంతి బద్రతలకు విఘాతం కలిగించేలా అసభ్య పదజాలంతో మాట్లాడడం చట్టరీత్యా నేరం అని, సమాజంలో ఇలాంటి ధోరణనికి అరికట్టాలంటే ఇలాంటి వారిపై కఠినమైన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని గద్దె విజయ్‌నేత పేర్కొన్నారు.

# కేసీఆర్ కు ఇచ్చే గౌరవం ఇదేనా...?

**వంశీ ముదిరాజ్**



మల్కాజిగిరి, మేజర్ న్యూస్ : చావు నోట్లో తలపెట్టి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కు ఇచ్చే గౌరవం ఇదేనా అని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు వంశీ ముదిరాజ్ ప్రశ్నించారు. తెలంగాణ రాష్ట్రం తొలి ముఖ్యమంత్రిగా కేసీఆర్ పదవిని చేపట్టి, తన పదేళ్ళ పాలనలో బంగారు తెలంగాణ సాధన కోసం అహర్నిశలు శ్రమిం చారని కొనియాడారు. అభివృద్ధిలో రాష్ట్రా న్ని అగ్రగామిగా నిలిపిన కేసీఆర్ లాంటి గొప్ప నాయకుడిని, విచారణ పేరిట ఇంతగా ఇబ్బందులకు గురిచేయడం శోచనీయం. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారెంటీలు, అనేక హామీలను నమ్మి ప్రజలు ఓట్లు వేస్తే, వాటిని నెరవేర్చ డంలో ఘోరంగా విఫలమైందని, ప్రశ్నించిన నాయకులపై కేసులు పెట్టి, నోటీసులు జారీ, గంటల కొద్దీ విచారణ చేపడుతూ కక్షసాధిం పులకు పాల్పడుతుందన్నారు. కేసీఆర్ ను ఆయన కుటుంబీకులను వేధించడం అంటే తెలంగాణ ప్రజలను అవమానించడమే అన్నారు. ఇకనైనా కాంగ్రెస్ నాయకులు తమ ప్రభుత్వ పాలనలో ఈ తరహా కక్ష రాజకీ యాలకు స్వస్తి పలికి, ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీ హామీలను చిత్తశుద్ధితో అమలు చేయాలని, లేని పక్షంలో తెలంగాణ రాష్ట్ర ప్రజలు తగిన సమయంలో తగిన రీతిలో గుణపాఠం చెబుతారని వంశీ ముదిరాజ్ హెచ్చరించారు

# శ్రీరాముడిని ఆదర్శంగా తీసుకోవాలి

**జ్ఞాన వశిష్టము, సారము, ప్రశ్నలు జవాబులపై చర్చ**



కూకట్ పల్లి, మేజర్ న్యూస్: మహీంద్రా అస్విత సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నెలవారి అంశాలపై చర్చల్లో భాగంగా ప్రముఖ రచయిత ఎం సుదర్శన్ "జ్ఞాన వశిష్టము సారము, ప్రశ్నలు, జవాబులు పుస్తకం నుండి వైరాగ్య ప్రకంపం 30 ప్రశ్నలకు జవాబులు చదివి వినిపించారు. అశ్విత సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ అధ్యక్షుడు నాదెండ్ల పాపారావు వ్యాఖ్యాతగా వ్యవహరించారు. వశిష్ఠుడు శ్రీరాములవారు వారి ప్రశ్నలకు ఇచ్చిన జవాబులు వాల్మీకి మహర్షి భరద్వాజ మునికి ఉపదేశించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఆస్కా సభ్యులు కృష్ణంరాజు, వివివి సత్యనారాయణ, ఎల్ అర్జున్ రావుల జన్మదినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అక్కడ హాజరైన వారందరూ వారికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. తెలుగు దిన పత్రిక నిర్వహించిన కార్యక్రమంలో విజేతలుగా గెలుపొందిన చిరంజీవి, వైనవి తులసిరాముకు బంగారు పతకం సాధించగా చిరంజీవి వైష్ణవ్ అరుణో విజేతలు పథకాలు అందుకున్నారు. చిరంజీవిలకు ప్రత్యేక బహుమతితో అశ్విత సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ అందించడం జరిగింది.

# అంగరంగ వైభవంగా ఆంజనేయ సమి వార్షికోత్సవం

**పాల్గొన్న కూకట్ పల్లి పుర ప్రముఖులు**



కూకట్ పల్లి, మేజర్ న్యూస్: కూకట్ పల్లిలోని పాపారాయుడు నగర్ లో ప్రతిష్టించిన శ్రీ ఆంజనేయ స్వామి వార్షికోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా పలువురు ప్రముఖులు హాజరై ఆంజనేయస్వామి కి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేకంగా పూజలు నిర్వహించిన అనంతరం ప్రముఖులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ప్రముఖ సంఘ సేవకులు కురుమయ్య గారి కొండల్ రావు, మాధవరం భూపతి రావు, మాధవరం అభిలాష్ రావు, మాజీ కార్పొరేటర్ జి వెంగళరావు, బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు, చౌదరి వెంకట్ రావు, దేవేందర్ రావు, మాధవరం మాధవరం రామ్మోహన్ రావు తదితరులు పాల్గొన్నారు.

# కేంద్ర ప్రభుత్వ బడ్జెట్ అద్భుతం

● సామాజిక న్యాయానికి నిలువెత్తు నిదర్శనం ● అంత్యోదయ భావనతో సమగ్ర సంస్కరణల దిశగా కేంద్ర బడ్జెట్ ● వికసిత భారత్ దిశగా ప్రవేశ ద్వార బడ్జెట్‌గా కేంద్ర బడ్జెట్ 2026--27 ● రంగారెడ్డి జిల్లా బిజెపి అర్బన్ ఉపాధ్యక్షురాలు చెన్నమనేని స్రవంతి



హైదరాబాద్, మేజర్ న్యూస్: ఆదివారం కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ లోక్‌సభలో ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్ 2026--27 సామాజిక న్యాయానికి నిలువెత్తు నిదర్శనంగా నిలిచిందని రంగారెడ్డి జిల్లా బిజెపి అర్బన్ ఉపాధ్యక్షురాలు చెన్నమనేని స్రవంతి అన్నారు. ఈ కేంద్ర బడ్జెట్‌లో సంక్షేమాన్ని విడివిడిగా పథకాలుగా కాకుండా, సమాజాన్ని దీర్ఘకాలిక మార్పు దిశగా నడిపించే సమగ్ర సంస్కరణాత్మక దృక్పథం స్పష్టంగా ప్రతిబింబిస్తోందని ఆయన పేర్కొన్నారు. రైతులు, ఎస్సీ, ఎస్టీ, వెనుకబడిన తరగతులు (ఓబీసీ లు), మహిళలు, యువత, సంచార జాతులు--కులాలు, పేద వర్గాలకు అభివృద్ధి ఫలాలు చేరాలనే ఆలోచన ఆర్థిక విధాన నిర్మాణంలోనే నిక్షిప్తమై ఉందన్నారు. విద్య, ఉపాధి, నైపుణ్యాభివృద్ధి, ఆరోగ్యం, స్వయం ఉపాధి రంగాలను సామాజిక న్యాయ సాధనాలుగా కేంద్ర బడ్జెట్ రూపకల్పన చేయడం ఈసారి ప్రత్యేకంగా కనిపిస్తోందని డాక్టర్ కృష్ణ మోహన్ రావు విశ్లేషించారు. ఉన్నత విద్యలో బాలికలకు నివాస సౌకర్యం కల్పించాలనే ఉద్దేశంతో ప్రతి జిల్లాలో హాస్టల్ ఏర్పాటు చేయాలన్న నిర్ణయం, సామాజిక--ఆర్థిక అడ్డంకులను తొలగిస్తూ సమాన అవకాశాలకు దారితీసే గాఢమైన సంస్కరణాత్మక చర్యగా ఆయన విశ్లేషించారు. ఓబీసీ లు అధికంగా ఆధారపడే చిన్న వ్యాపారాలు, స్వయం ఉపాధి, హస్తకళలు, చేతివృత్తులు, పశుపోషణ, మత్స్యకార రంగాలు, సేవా రంగాలపై కేంద్ర బడ్జెట్‌లో పెట్టిన దృష్టి సమాన భాగస్వామ్య అభివృద్ధి నమూనాకు నిదర్శనంగా నిలుస్తోందన్నారు. ఈ విధానం సామాజిక వర్గాలను వేరు చేయకుండా, అభివృద్ధి ప్రధాన ప్రవాహంలో భాగస్వాములుగా మార్చే దృక్పథాన్ని ప్రతిబింబిస్తోందని తెలిపారు. మానసిక ఆరోగ్య సేవల విస్తరణ, జిల్లా ఆసుపత్రుల్లో అత్యవసర వైద్య--ట్రామా సంరక్షణ బలోపేతం, ఉపాధి ఆధారిత రంగాల బలపరచడం వంటి చర్యలు మానవ గౌరవం కేంద్రంగా ఉన్న సంక్షేమ ఆలోచనకు స్పష్టమైన న్యాయబద్ధీకరణగా నిలుస్తున్నాయని ఆయన వ్యాఖ్యానించారు. ఆర్థిక క్రమశిక్షణను కాపాడుకుంటూనే సంక్షేమానికి ప్రాధాన్యం ఇవ్వడం ఈ కేంద్ర బడ్జెట్ ప్రధాన లక్షణమని పేర్కొన్నారు. ఇది బలహీన వర్గాల ప్రయోజనాలను తాత్కాలికంగా కాకుండా, స్థిరమైన విధానాల ద్వారా దీర్ఘకాలికంగా పరిరక్షించే దృక్పథాన్ని సూచిస్తోందన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో రూపొందించిన బడ్జెట్ వికసిత భారత్ దిశగా ప్రవేశ ద్వార బడ్జెట్‌గా రంగారెడ్డి జిల్లా బిజెపి అర్బన్ ఉపాధ్యక్షురాలు చెన్నమనేని స్రవంతి అభివర్ణించారు. అంత్యోదయ భావనను విధానాల స్థాయిలో బలపరుస్తూ, అభివృద్ధి--న్యాయం--గౌరవాన్ని ఒకే దిశలో నడిపించే ప్రయత్నం ఇందులో స్పష్టంగా కనిపిస్తోందన్నారు. సామాజిక న్యాయం, జాతీయ అభివృద్ధి రెండు వేర్వేరు లక్ష్యాలు కాకుండా, ఒకే సమగ్ర ప్రయాణంగా ఈ కేంద్ర బడ్జెట్ ముందుకు తీసుకెళ్తోందని అభిప్రాయపడ్డారు.

## సిట్ విచారణకు వ్యతిరేకంగా బిఎన్‌రెడ్డినగర్‌లో బిఆర్ఎస్ శ్రేణుల నిరసన



వనస్థలిపురం,మేజర్‌న్యూస్ః బి.ఆర్.ఎస్ పార్టీ అధినేత, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ పై కక్ష్య సాధింపు చర్యల్లో భాగంగా ఆదివారం సిట్ విచారణకు వ్యతిరేకంగా ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి పిలుపు మేరకు బిఆర్ఎస్ పార్టీ బిఎన్‌రెడ్డినగర్ డివిజన్ అధ్యక్షుడు కటికరెడ్డి అరవింద్‌రెడ్డి ఆధ్వర్యంలో సాహెబ్‌నగర్ శివాలయం దగ్గర బిఆర్ఎస్ శ్రేణులు నిరసన కార్యక్రమం చేపట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వం వైఫల్యాలు కప్పిపుచ్చుకోవడానికి డైవర్షన్‌లో భాగంగా ఫోన్ ట్యాపింగ్ కేసుతో తెలంగాణ జాతిపిత కేసీఆర్ ను అప్రతిష్ట పాలు చేయాలని కుట్ర పన్నుతున్నారని ప్రజలకు ఇచ్చిన 6 గ్యారంటీలను గాలికి వదిలేశారని ఈ సందర్భంగా బిఆర్ఎస్ శ్రేణులు నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో గడ్డి అన్నారం మార్కెట్ కమిటి మాజీ డైరెక్టర్ అనిల్ చౌదరి, సీనియర్ నాయకులు ముద్దగౌని సతీష్‌కుమార్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి సతీష్‌చౌదరి, ఉపాధ్యక్షులు గౌరిశెట్టి మనోజ్‌కుమార్, దయాకర్‌ముదిరాజ్, సందడి సందీప్‌రెడ్డి, ముదుపు సందీప్‌రెడ్డి, గగన్, మధురెడ్డి, సంతోష్‌రావు, భాస్కర్‌గౌడ్, నరేష్, రాజుగౌడ్, శ్రీశైలం, శేఖర్, వెంకటేష్, శంకర్, రాజేందర్‌గౌడ్, సురేష్, సుమన్, శ్రీనివాస్‌రెడ్డి, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

## కేసీఆర్ కు 'సిట్' నోటీసులు ఇచ్చి విచారించ డాన్ని వ్యతిరేకిస్తూ బీఆర్ఎస్ శ్రేణుల ఆందోళన





మల్కాజిగిరి, మేజర్ న్యూస్: తెలంగాణ రాష్ట్రంలో సంచలనం సృష్టించిన ఫోన్ టాపిం గ్ కేసులో బీఆర్ఎస్ అధినేత, తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ కు 'సిట్' అధికారులు నోటీసులు ఇచ్చి విచారించ డాన్ని వ్యతిరేకిస్తూ బీఆర్ఎస్ రాష్ట్ర పార్టీ ఇచ్చిన పిలుపు మేరకు ఆదివారం మల్కా జిగిరి నియోజకవర్గంలో 'గులాబీ దండు' పెద్ద ఎత్తున నిరసన వ్యక్తం చేసింది. భారీ వాహ నాలతో ర్యాలీ నిర్వహించి, పలు కూడళ్లలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపట్టింది. ఫోన్ టాపింగ్ వ్యవహారంలో కేసీఆర్ పై కాంగ్రెస్ ప్రభుత్వం రాజకీయ కక్షతోనే సిట్ నోటీసులు జారీ చేసిందని నిరసిస్తూ, ఆదివారం మల్కా జిగిరి నియోజకవర్గంలోని నేరేడ్‌మెట్ చౌర స్తా, మౌలాలి చౌరస్తాల వద్ద బీఆర్ఎస్ పార్టీ నాయకులు పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమా లు చేపట్టారు. తెలంగాణ ఉద్యమకారులు మోనార్ భాగ్యానంద్ రావు, మహమ్మద్ ఉస్మాన్ ఆధ్వర్యంలో మౌలాలి చౌరస్తా, కమాన్ ల వద్ద ఆందోళనలు నిర్వహించారు. జై కేసీఆర్, జై తెలంగాణ అంటూ బిగ్గరగా నినాదాలు చేశారు. అనంతరం మౌలాలి చౌరస్తా నుండి నేరేడ్ మెట్ చౌరస్తా వరకు బీఆర్ఎస్ నాయకులు బైక్ ర్యాలీ నిర్వహిం చారు. ఈ నిరసన కార్యక్రమానికి హజరైన మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం అవలం బిస్తున్న ప్రజా వ్యతిరేక, రాజకీయ వేధింపుల విధానాలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి , కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా వారు నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎంబీసీ కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ నందికంటి శ్రీధర్, కార్పొరేటర్లు మేకల సునీత రామuయాదవ్, చింతల శాంతి శ్రీనివాస్ రెడ్డి, మాజీ కార్పొరే టర్లు ఏకే మురుగేష్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు రావుల అంజయ్య, భాగ్యానంద్ రావు, మహ్మద్ ఉస్మాన్, అమీనుద్దీన్, వాస గోని శ్రీనివాస్ గౌడ్,సూర్యప్రకాష్, వంశీ ముది రాజ్, తుపాకుల జనార్ధన్, మండలి చిన్న యాదవ్, రాముయాదవ్, అనిల్ కిషోర్ గౌడ్, మౌలాలి డివిజన్ సీనియర్ నాయకులు ఎస్ కె బాబా, సాధిక్, బుద్ధి నర్సింగ్ రావు,గౌలీకర్ శైలందర్, ఆదినారాయణ, సంతోష్ గుప్తా, మహేష్ గౌడ్, నవాబ్, సాబేర్, దుర్గేష్, మారు తీ ప్రసాద్, కాశీ నాథ్ యాదవ్, గణేష్, సాయి, అరవింద్ గౌడ్, స్వామి,ఆజమ్, ఇసాక్, జుబే ర్, సమీర్, జంగమయ్యతో పాటుగా పెద్ద సంఖ్యలో మహిళలు, యువత, బీఆర్ఎస్ శ్రేణులు, నాయకులు, పార్టీ కార్యకర్తలు హాజరైనారు.

## వనస్థలిపురంలో రేవంత్‌రెడ్డి దిష్టి బొమ్మ దగ్గం చేసిన బిఆర్ఎస్ శ్రేణులు

### పాలన చేత కాక అక్రమ కేసులు

### మాజీ కార్పోరేటర్ జిట్టా రాజశేఖర్‌రెడ్డి, వనస్థలిపురం బిఆర్ఎస్ అధ్యక్షులు చింతల రవికుమార్



వనస్థలిపురం,మేజర్‌న్యూస్ఃకాంగ్రెస్ ప్రభుత్వానికి పాలన చేత కాక, ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చలేక, ప్రజల దృష్టిని మళ్లించడానికి కేసీఆర్ పై రాజకీయ వేదింపులకు పాల్పడుతుందని వనస్థలిపురం డివిజన్ మాజీ కార్పోరేటర్ జిట్టా రాజశేఖర్‌రెడ్డి, వనస్థలిపురం డివిజన్ బిఆర్ఎస్ అధ్యక్షులు చింతల రవికుమార్‌లు విమర్శించారు. రాజకీయ వేదింపులకు పాల్పడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని రాబోయే రోజుల్లో ప్రజలే భూ స్థాపితం చేస్తారని వారు పేర్కొన్నారు. బిఆర్ఎస్ అధినేత కేసీఆర్‌పై కాంగ్రెస్ ప్రభుత్వ కక్ష్య సాధింపు చర్యలకు వ్యతిరేకంగా వనస్థలిపురంలో బిఆర్ఎస్ శ్రేణులు వనస్థలిపురం కాంప్లెక్స్ వద్ద ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దిష్టి బొమ్మను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చట్టాన్ని గౌరవిస్తానని కేసీఆర్ చెప్పినా ఎందుకు కక్ష్య సాధిస్తున్నారని ప్రశ్నించారు. కేసీఆర్‌కు సిట్ పేరిట నోటీసులివ్వడం అత్యంత దుర్మార్గమైన చర్య అన్నారు. కార్యక్రమంలో డివిజన్ పార్టీ వర్కింగ్ ప్రసిడెంట్ లగ్గోని శ్రీధర్‌గౌడ్, ఖైసర్ కొంకిమళ్ల కిషోర్‌కుమార్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

## జనరంజకంగా కేంద్ర బడ్జెట్ దేశాభివృద్ధికి దిక్సూచిగా నిలిచింది : బిజెపి సీనియర్ నాయకులు జక్కిడి ప్రభాకర్‌రెడ్డి



వనస్థలిపురం,మేజర్‌న్యూస్ఃకేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశ పెట్టిన కేంద్ర బడ్జెట్ జనరంజకంగా ఉందని బిజెపి సీనియర్ నాయకులు, దక్షిణ మధ్య రైల్వే బోర్డు మాజీ సలహాదారులు జక్కిడి ప్రభాకర్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. మౌలిక సదుపాయాల కల్పనతో పాటు విద్య, ఆరోగ్యం, వ్యవసాయం, యువత సంక్షేమానికి ఈ బడ్జెట్ లో పెద్ద పీట వేశారని ఆయన తె లిపారు. ముఖ్యంగా విదేశీ యాత్రలపై పన్నులను తగ్గించడం ద్వారా విమాన యాన రంగానికి నూతన ఉత్తేజం లభిస్తుందని, ఇది పర్యాటక రంగాన్ని మరింత బలోపేతం చేస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కేంద్ర బడ్జెట్ ఆర్ధిక పురోగతి కి దోహదపడే విధంగా ఉందన్నారు. దేశ అభివృద్ధి, దేశ ప్రజల సంక్షేమం, సబ్ కా సాత్, సబ్ కా వికాస్ కోసం బడ్జెట్ ఉందన్నారు. దేశంలో ఎలక్ట్రానిక్ రంగం, ఉద్యోగావకాశాలు పెరుగుతాయని, టెక్స్‌టైల్ పార్కుల ఏర్పాటు, తెలంగాణ కు హై స్పీడ్ రైళ్లు కెటాయింపు హర్షణీయమన్నారు. బడ్జెట్ ద్వారా దేశ ఆర్ధిక రంగం 4వ స్థానం నుండి 3వ స్థానానికి చేరకుంటుందన్నారు. విదేశాల్లో ఉన్నత చదువులు చదువుకోవాలనే విధ్యార్ధులకు మెరుగైన వైద్యం కోసం ఇతర దేశాలకు వెళ్లే వారికి తీపి కబురన్నారు. తాజా బడ్జెట్‌లో లిబరలైజ్డ్ రెమిటెన్స్ స్కీమ్ (ఎల్.ఆర్.ఎస్ ) కింద విదేశాలకు పంపే నగదుపై వర్తించే టిసిఎస్ ను 5 శాతం నుండి 2 శాతం కు తగ్గిస్తు నిర్ణయం తీసుకుందని, పెరిగిన అంతర్జాతీయ ఖర్చుల దృష్ట్యా విద్యార్ధుల తల్లిదండ్రులకు ఇది పెద్ద ఊరటనిచ్చే అంశం అని జక్కిడి వివరించారు. ఈ నిర్ణయం వల్ల ముఖ్యంగా మధ్య తరగతి కుటుంబాలపై ఉన్న ఆర్ధిక భారం గణనీయంగా తగ్గుతుందన్నారు. ఏది ఏమైనా దేశ ప్రజల అభిమానాన్ని నిర్మలా సీతారామన్ చూరగొన్నదని జక్కిడి ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు.

## వినాయక్ స్వామికి సర్టిఫికేట్ ఇచ్చిన కొంత దీపికా నరేష్



# ఘనంగా కమ్యూనిటీ ప్యూర్ వాటర్ వార్షిక ఫండ్‌రైజర్ 2026



తెలంగాణ బ్యూరో ప్రతినిధి : గ్రామీణ భారతదేశంలో సురక్షిత తాగునీటి అందుబాటుతో ఆరోగ్యం మరియు జీవన ప్రమాణాలను మెరుగుపరచాలనే సమిష్టి సంకల్పంతో హైదరాబాద్‌లోని ప్రతిష్టాత్మక చౌమహల్లా ప్యాలెస్ వేదికగా కమ్యూనిటీ ప్యూర్ వాటర్ వార్షిక ఫండ్‌రైజర్ 2026 ఘనంగా నిర్వహించింది. ఈ వేడుకకు ముఖ్య అతిథులుగా భారత సైన్యం, ప్రభుత్వం, సంస్కృతి మరియు పౌర సమాజానికి చెందిన పలువురు ప్రముఖులు కూడా పాల్గొన్నారు. వారిలో మేజర్ జనరల్ అజయ్ మిశ్రా తెలంగాణ ౘ ఆంధ్రప్రదేశ్ జనరల్ ఆఫీసర్ కమాండింగ్, భారత సైన్యం, తెలంగాణ డీజీపీ శివధర్ రెడ్డి , తెలంగాణ పర్యాటక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ జయేశ్ రంజన్ , దాతృత్వవేత్త మరియు నిర్మాత పింకీ రెడ్డి , ప్రముఖ నటి, దర్శకురాలు సామాజిక కార్యకర్త నందితా దాస్ ప్రత్యేక అతిథులుగా హాజరయిన ఈ కార్యక్రమంలో హైదరాబాద్‌లోని అమెరికా కాన్సులేట్ జనరల్ కాన్సుల్ జనరల్ లారా విలియమ్స్ , అలాగే నటి రేజినా కసాండ్రా, రేస్2విన్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు మరియు టైటిల్ స్పాన్సర్ గోపీ రావు, కమ్యూనిటీ ప్యూర్ వాటర్ బోర్డు సభ్యుడు కిషోర్ కోతపల్లి, అవార్డు విజేత చిత్రం పానీ దర్శకుడు నటుడు అడ్డినాథ్ కోతారే, అలాగే కమ్యూనిటీ ప్యూర్ వాటర్ చీఫ్ ఫిలాంత్రోపీ ఆఫీసర్ సుమీత్ రావ్లా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. కాగా, ఈ ఫండ్‌రైజర్‌కు రేస్2విన్ ఫౌండేషన్ సంస్థ టైటిల్ స్పాన్సర్‌గా వ్యవహరించింది. నేడు దేశవ్యాప్తంగా గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో 550కు పైగా కమ్యూనిటీ ప్యూర్ వాటర్ శుద్ధి కేంద్రాలను ఏర్పాటు చేయడం ద్వారా ప్రతి రోజూ 12 లక్షలకుపైగా విద్యార్థులకు, ఉపాధ్యాయులకు సురక్షితమైన తాగునీటిని పొందుతున్నారు. ప్రతి కమ్యూనిటీ ప్యూర్ వాటర్ కేంద్రం 24 గంటలు పనిచేసే ఐఎస్ఓ సర్టిఫైడ్ మైక్రో యుటిలిటీగా రూపుదిద్దుకుంది. సాంకేతికత, ఆటోమేషన్, ముందస్తు నిర్వహణ మరియు కమ్యూనిటీ యాజమాన్య సమ్మిళితంతో ఈ కేంద్రాలు రోజుకు 9 లక్షల లీటర్లకు పైగా శుద్ధి చేసిన నీటిని పంపిణీ చేస్తూ, 97 శాతం కంటే ఎక్కువ ఆపరేషనల్ అప్‌టైమ్‌ను కొనసాగిస్తున్నాయి. దీని ద్వారా వ్యాధుల భారాన్ని తగ్గించి, పోషకాహార స్థాయిని మెరుగుపరచి, కుటుంబాలకు ఆరోగ్యకరమైన మరియు ఉత్పాదక జీవనాన్ని అందించడంలో గణనీయమైన మార్పు తీసుకొస్తోంది. ఫండ్‌రైజింగ్ కమిటీ చైర్‌పర్సన్, బోర్డు సభ్యురాలు ప్రతిక్ష ప్రసాంత్ నాయకత్వంలో నిర్వహించిన ఈ వార్షిక ఫండ్‌రైజర్ 2026 సురక్షిత నీటి ప్రాధాన్యతను వివరిస్తు విభిన్న రంగాల ప్రతినిధులను ఒక వేదికపైకి తీసుకువచ్చింది. వారి ఉదార సహకారంతో, ఇంకా 25 గ్రామీణ పాఠశాలలకు సురక్షిత తాగునీటిని అందించేందుకు అవసరమైన లక్ష్యాన్ని కమ్యూనిటీ ప్యూర్ వాటర్ సాధించింది.

## 'కేసీఆర్' పై రాజకీయ కక్ష సాధింపు చర్య : నందికంటి శ్రీధర్



మల్కాజిగిరి, మేజర్ న్యూస్ : బీఆర్ఎస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్య మంత్రి కేసీఆర్ ను కాంగ్రెస్ ప్రభుత్వం రాజకీయ కక్ష సాధిం పులో భాగంగా ఫోన్ టాపింగ్ వ్యవహారంలో సిట్ నోటీసులు జారీ చేయడాన్ని నిరసిస్తూ ఆదివారం బీఆర్ఎస్ పార్టీ తెలంగాణ భవన్ వద్ద నిర్వహించిన నిరసన కార్యక్రమానికి రాష్ట్ర ఎంబీసీ కార్పొ రేషన్ మాజీ ఛైర్మన్ నందికంటి శ్రీధర్ హాజరై సంఘీభావం తెలి పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ, వివిధ కేసులు, విచారణ పేరిట కాంగ్రెస్ ప్రభుత్వం, కేసీఆర్ పైన, ఆయన కుటుంబం పైన రాజకీయ కక్ష సాధింపు చర్యలకు పాల్ప డుతుందని విమర్శించారు. తన ప్రాణాలు ఫణంగా పెట్టి పోరాడి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించడంతో పాటు పదేళ్లు ముఖ్యమం త్రిగా పని చేసి రాష్ట్రాన్ని అభివృద్ధి, సంక్షేమం తో అగ్రగామిగా నిలిపిన కేసీఆర్ పై అక్కసు తోనే కేసులు మోపి విచారణ పేరిట వేధిస్తున్నారని దుయ్యబట్టారు. ఇందులో భాగమే సిట్ ఆయనకు నోటీసులు జారీ చేసి, గంటల కొద్దీ విచారణ చేపట్టడం జరిగిందని ఇది అన్యాయమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎన్నికల హామీలను తుంగలో తొక్కిందని, వాటిని ప్రశ్నిస్తున్న బీఆర్ఎస్ నాయకులపై కక్షపూ రిత చర్యలకు పాల్పడుతుందని ఆయన విమర్శించారు. ఇలాంటి తాటాకు చప్పుళ్ళ కు బీఆర్ఎస్ పార్టీ నేతలు భయపడబోరని, మరింత ఉత్సాహంగా ప్రజల తరఫున పోరా టం చేస్తామని నందికంటి శ్రీధర్ స్పష్టం చేశా రు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయ కులు వాసగోని శ్రీనివాస్ గౌడ్, కేశెట్టి రాము లు, సూర్యప్రకాష్, వంశీ ముదిరాజ్ తదితరు లు పాల్గొని తమ సంఘీభావం తెలిపారు.

## హిట్ అండ్ ఫిట్ క్రికెట్ స్పోర్ట్స్ జట్టు మొదటి వార్షికోత్సవం సందర్భంగా క్రికెట్ జట్టు నూతన జెర్సీ ఆవిష్కరణ

- ముఖ్య అతిధిగా పాల్గొన్న శ్రీ గాయత్రినగర్ కాలనీ అధ్యక్షులు నేనావత్ సూర్య నాయక్
- మానసిక, శారీరక ధృఢత్వానికి క్రీడలు దోహదపడతాయి : సూర్య నాయక్





వనస్థలిపురం,మేజర్‌న్యూస్:ఎల్బీనగర్ నియోజకవర్గం సాహెబ్‌నగర్ డివిజన్ పరిధిలో శ్రీ గాయత్రినగర్ కాలనీ హిట్ అండ్ ఫిట్ క్రికెట్ స్పోర్ట్స్ జట్టు మొదటి వార్షికోత్సవ వేడుకలు ఆదివారం జరిగాయి. కార్యక్రమానికి శ్రీ గాయత్రినగర్ కాలనీ అధ్యక్షులు నేనావత్ సూర్య నాయక్ ముఖ్య అతిధిగా పాల్గొని హిట్ అండ్ ఫిట్ క్రికెట్ జట్టు నూతన జెర్సీని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సూర్య నాయక్ మాట్లాడుతూ హిట్ అండ్ ఫిట్ జట్టు స్థాపించి సంవత్సరం పూర్తయిన సందర్భంగా వ్యవస్థాపకులు అన్నవరపు ప్రసాద్, సహాయ వ్యవస్థాపకులు శివరామక్రిష్ణ, రమేష్, వారి జట్టు సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. క్రీడలు, శారీరక, మానసిక ఆరోగ్యానికి అత్యంత ఆవశ్యకమన్నారు. క్రీడలు క్రమశిక్షణ, టీమ్ వర్క్, మానసిక వత్తిడిని తగ్గించి ఉల్లాసాన్ని కలిగిస్తాయని ఈ సందర్భంగా సూర్య నాయక్ తెలిపారు. జీవితంలో ఆటను అనుదినం ఒక వ్యాయామంగా మలచుకోవాలని తద్వారా ఆరోగ్యంగా ఉండడమే కాకుండా, అనారోగ్య సమస్యలకు ప్రభావితం కాకుండా దోహదపడతాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా హిట్ అండ్ ఫిట్ క్రికెట్ జట్టు సభ్యులు అజిత్, మధు, భరత్, చరణ్, ప్రేమ్, లింగం, అమర్, దేవ, రాజేంద్ర, హరి అందరిని అభినందించి రాబోయే రోజుల్లో పలు టీంలతో క్రికెట్ ఆటలో పోటీ పడి విజయాలను సొంతం చేసుకోవాలని సూర్యనాయక్ ఆకాంక్షించారు. అనంతరం జట్టు సభ్యులు తమను అన్ని విధాల ప్రోత్సహిస్తున్న సూర్య నాయక్‌ను శాలువాతో సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు.

## ఇండియా వుడ్ 2026 భారత వుడ్‌వర్కింగ్ రంగానికి గ్లోబల్ వేదిక

హైదరాబాద్, మేజర్‌న్యూస్ : న్యూర్న్‌బర్గ్ మెస్సే ఇండియా నిర్వహిస్తున్న ఇండియా వుడ్ 2026 బెంగళూరులోని బి ఐ ఈ సి లో జరగనుంది. 50కుపైగా దేశాల నుంచి 1,000కు పైగా బ్రాండ్లు, సుమారు 90,000 మంది పరిశ్రమ నిపుణుల పాల్గొనడంతో ఇది ఇప్పటివరకు జరిగిన అతిపెద్ద ఎడిషన్. భారత్--ఈ యూ ఎఫ్ టి ఏ నేపథ్యంలో ఎగుమతులు, సాంకేతికత మరియు గ్లోబల్ భాగస్వామ్యాలకు ఈ ప్రదర్శన బలమైన బూస్ట్ ఇస్తుంది. ఆటోమేషన్, స్మార్ట్ మాన్యుఫాక్చరింగ్, స్థిరత్వ ఆధారిత పరిష్కారాలపై ఫోకస్‌తో '.ఇండియా వుడ్ 2026 మేక్ ఇన్ ఇండియా'కి కీలక వేదికగా నిలవనుంది

# భారతీయ యోగా సంస్థ ఆధ్వర్యంలో ఘనంగా వసంత ఉత్సవ్




సరూర్ నగర్, మేజర్ న్యూస్ : భారతీయ యోగా సమస్తాన్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో ఈస్ట్ వెస్ట్ ప్రాంతాలలో ఉచిత యోగా శిక్షణా కేంద్రాలు గత కొన్ని సంవత్సరాలుగా నిర్వహించబడుతున్నాయి. ఈ కేంద్రాల్లో ప్రతిరోజూ యోగా సాధకులకు ఉచిత శిక్షణ అందిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమానికి భాగంగా, లోయర్ ట్యాంక్ బండ్ గోశాల ప్రాంగణంలో వసంత ఉత్సవ్ ఘనంగా నిర్వహించబడింది. ప్రెస్ కాలనీ పార్క్‌లోని మహిళా యోగా సాధకులు, ప్రెస్ కాలనీ యోగా ఛీఫ్ లక్కి మాధవరెడ్డి ఆధ్వర్యంలో, "తెలంగాణ బతుకమ్మ ఫేమస్ పాట -- తెలంగాణలో పుట్టి పుల పల్లకి ఎక్కి" అనే పాటతో నృత్య ప్రదర్శన చేశారు. తెలంగాణ ఈస్ట్ ప్రెసిడెంట్ కులకర్ణి మాట్లాడుతూ:"భారతీయ యోగా సమస్తాన్ ఆధ్వర్యంలో వసంత ఉత్సవ్ ఘనంగా నిర్వహించబడింది. నగరంలోని వివిధ ప్రాంతాల నుండి యోగ శిక్షకులు, సాధకులు పాల్గొన్నారు." ఈ కార్యక్రమంలో భారతీయ యోగా సమస్తాన్ సభ్యులు, డిస్టిక్ ట్రీ ప్రెసిడెంట్ బి.కృష్ణయ్య, సెంటర్ ఇంచార్జి కాయితి లక్ష్మరెడ్డి తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు

## ఆరోగ్య పరిరక్షణకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి

**-మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్**




సనత్ నగర్,మేజర్ న్యూస్: ప్రతిఒక్కరూ ఆరోగ్య పరిరక్షణకు తగిన జాగ్రత్తలను తీసుకోవాలని మాజీ మంత్రి, సనత్ నగర్ నియోజకవర్గం ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. సనత్ నగర్ డివిజనులోని సాయిబాబానగర్ కొత్తపల్లి రమేశ్ గౌడ్ ఆధ్వర్యంలో ఓపెన్ క్లాసిక్ బెంచ్ ప్రెస్ కాంపీటీషన్ ఆదివారం నిర్వహించారు. ముఖ్య ఆహ్వానితులుగా హాజరైన ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యాయామం చేయడం వలన ఆరోగ్యంగా ఉంటామన్నారు. అంతేకాకుండా దేహధారుడ్యం పెరుగుతుందన్నారు. క్రీడాకారులు సాధనపై దృష్టి సారించాలన్నారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని విజయాలు సాధించడానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. అందుకు తన తరపున తగిన సహకారం ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సనత్ నగర్ డివిజన్ కార్పొరేటర్ కొలను లక్ష్మి, అమీర్ పేట డివిజన్ మాజీ కార్పొరేటర్ నామన శేషుకుమారి, సనత్ నగర్ బిఆర్ఎస్ అధ్యక్షుడు కొలను బాల్ రెడ్డి, నాయకులు సురేశ్ గౌడ్, ఖలీల్, కరుణాకర్ రెడ్డి, రాజేశ్ ముదిరాజ్ తదితరులున్నారు.

# బీవీఆర్‌కు ఘన సత్కారం!!

విశ్వకర్మ ఉద్యోగుల సంఘం నిజామాబాద్ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా ప్రపంచ ప్రఖ్యాత శిల్పి పద్మభూషణ్,పద్మశ్రీ, ఠాగూర్ అవార్డు గ్రహీత అయినా శ్రీరామ్ వీ సుతార్ వారి పేరు మీద తొలి పురస్కారం అందుకున్నారు బీవీఆర్ చారి (ఉద్యమ తెలంగాణ తల్లిరూప శిల్పి) . పురస్కార ప్రదాత పరమ పూజ్య శ్రీ శ్రీ శ్రీ వీర శివకుమార స్వామివారు కందిమల్లయపల్లి. శ్రీ శ్రీ ఈశ్వరీ దేవి మఠం పీఠాధిపతులు వీరబ్రహ్మేంద్రస్వామి మఠం వారి సువర్ణ హస్తాల మీదుగా అందుకున్నారు బీ వీ ఆర్ చారి : **ముషీరాబాద్‌ మేజర్ న్యూస్**



# ఘనంగా జంటకవుల అష్టావధానం!



ముషీరాబాద్ మేజర్ న్యూస్ :వాగ్దేవి సంస్కృత భారతి 25 వ వార్షికోత్సవం సందర్భంగా వార్షికోత్సవ వేడుకలను దీనదయాళ్ నగర్ విజయ వినాయక దేవాలయంలో వాగ్దేవి సంస్కృత భారతి వ్యవస్థాపకులు అంబికానాథ్ శర్మ సంధ్య దంపతులు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో సరస్వతి దేవి అమ్మవారికి విశేష అభిషేకం ,సహస్రనామార్చనలు , అనంతరం సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా సంస్కృతాంధ్ర అష్టావధానం కార్యక్రమం నిర్వహించారు, అష్టావధానం ను జంట కవులైన డా ముదిగొండ అమర్నాథ్ శర్మ ముత్యంపేట గౌరీ శంకర్ శర్మ ఆధ్వర్యంలో నిర్వహించారు, పృచ్ఛకులుగా కవి రచయిత అక్షర కౌముది సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు డా తులసి వెంకట రమణా చార్యులు, గణపతి ఉపాసకులు డా నిర్మల సిద్ధరామేశ్వర శర్మ విశ్రాంత తెలుగు ఉపాధ్యాయులు ముదిగొండ శరభ లింగ శర్మ, సంస్కృత ఆంధ్ర భాష అభిమానులు ముత్యంపేట మల్లికార్జున శర్మ, శ్రీ శైవ మహా పీఠం మల్కాజిగిరి శాఖ అధ్యక్షులు ఎస్పీ సతీశ్ చంద్ర, హైదరాబాద పబ్లిక్ స్కూల్ తెలుగు ఉపాధ్యాయులు కవి రచయిత ముదిగొండ సంతోష్ కుమార్ శర్మ ఆసిటెంట్ ప్రొఫ్సర్ డా బి ఆర్ అంబేద్కర్ కాలేజీ సంస్కృత ఉపన్యాసకులు డా కృష్ణమూర్తి, కవయిత్రి రచయిత్రి మూర్తి శ్రీదేవి తెలుగు అధ్యాపకురాలు సరోజ కొడాలి మానస ఆర్ట్స్ థియేటర్ సంస్థ కార్యదర్శి సాహితీవేత్త రఘుశ్రీ ఉపాధ్యాయురాలు ప్రణీత,శ్రీ నిర్మల శివానంద అధ్యక్షులు జ్యోతిష్య విద్వాంసులు నిర్మల రామనాథ శర్మ సంస్కృత ఆంధ్ర పండితులు మున్నాలాల్ , శివ శ్రీ నిమ్మల నీలకంఠ శాస్త్రి గౌతమాస్ర వ్యవస్థాపక అధ్యక్షులు రాజవీరేశ్వర శాస్త్రి బ్రహ్మానందం శర్మ తదితరుల పాల్గొన్నారు, సంస్కృతాంధ్ర అష్టావధానం చేసిన జంట కవులైన అవధానులు , పృచ్ఛకులను నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. ఈసందర్భంగా కవి రచయిత ముదిగొండ సంతోష్ కుమార్ శర్మ కథ మంజీరా పిల్లల కథలు పుస్తకావిష్కరణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు

## హెచ్ఎంఏటి, కిమ్స్ - సన్షైన్ ఆధ్వర్యంలో సిఎంఇ

హిమాయత్ నగర్, మేజర్ న్యూస్ : హోమియోపతిక్ మెడికల్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ ( హెచ్ ఎం. ఎ.టి), హిమాయత్ నగర్ , కిమ్స్ సన్-షైన్ హాస్పిటల్ (బేగంపేట) సంయుక్తంగా నిర్వహించిన సి.ఎం.ఇ కార్యక్రమం అమీర్ పేట గ్రీన్ పార్క్ హోటల్ లో ఆదివారం సాయంత్రం జరిగింది. ఈ సందర్భంగా కూనపరెడ్డి వేణిభూషణ్ మరియు డా.టి. శేషాచారి స్మారక ఉపన్యాసాలు నిర్వహించారు. మొదటగా డా.హానీమన్ , వేణిభూషణ్, శేషాచార్ల చిత్రపటాలకు నివాళులు అర్పించి, హెచ్.ఎం.ఎ.టి. అధ్యక్షుడు డా. కె. గోపాలకృష్ణ స్వాగతోపన్యాసం చేసి ఆహుతులకు స్వాగతం పలికారు. డా.శేషాచారి హోమియోపతి అభివృద్ధికి ఎనలేని కృషిచేశారని ముఖ్యంగా హెచ్. ఎం.ఎ.టి. స్థాపకులల్లో ఒకరిగా ఉండి, చివరి వరకు అసోసియేషన్ కార్యమాలు , ఉచిత వైద్య సేవలు విస్తరిపజేసారని కొనియాడారు. అనంతరం ప్రధాన కార్యదర్శి డా. జి. దుర్గాప్రసాద్ రావు మాట్లాడుతూ, తాము గత 55 సంవత్సరాలుగా అసోసియేషన్ ద్వారా అందిస్తున్న వైద్య సేవలు, ఇతర కార్యక్రమాలగురించి వివరించారు. శేషాచారి స్మారక ఉపన్యాసం , కిమ్స్ సన్ షైన్ హాస్పిటల్ యూరాలజిస్ట్ డా. బొక్క శ్రీహర్ష , పల్మనాలజిస్ట్ డా. కునాల్ వాగ్రే ప్రసంగించగా, వేణిభూషణ్ స్మారక ఉపన్యాసం , జే యస్.పి యస్ ప్రభుత్వ హోమియో వైద్య కళాశాల లెక్చరర్ డా. హిమభువన, హెచ్ .ఎం .ఎ. టి తరపున డా. అన్నపూర్ణ మంత హోమియోపతి వైద్యానికి సంబంధించిన



అంశాలపై ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఆయుష్ (హోమియో )అదనపు సంచాలకులు , హెచ్.ఎం.ఎ.టి ముఖ్య సలహాదారుడు, వేణిభూషణ్ స్మారక ఉపన్యాసం స్పాన్సర్ డా. శివశంకర్ కూనపరెడ్డి మరియు కుటుంబ సభ్యులు - పురుషోత్తం ,శాంతి హెచ్.ఎం.ఎ.టి - ఐ.సి.ఆర్ . హెచ్, క్లినికల్ డైరెక్టర్ డా. వేణు గోపాల్ గౌరీ , టెక్నికల్ అడ్వైజర్ ., డా. సి. వి స్వామి, ఉపాధ్యక్షుడు ( కన్వీనర్) ,డా.మధువారణాసి, . డా. ఆనంద్ రావు మెంగ్జి, డా. రఘురాం ఇతర గవర్నింగ్ కౌన్సిల్ సభ్యులు , ఆర్గనైజింగ్ సెక్రటరీలు డా. గౌతమ్ , డా.చాముండేశ్వరి , సహాయ కార్యదర్శులు , డా. గణేష్ ఆచార్య ,డా. సాయి శృతి , డా. హర్షిత పూరే,సీనియర్ డాక్టర్లు హాజరయ్యారు.

# సామాజిక న్యాయానికి నిలువెత్తు నిదర్శనం

- అంత్యోదయ భావనతో సమగ్ర సంస్కరణల దిశగా కేంద్ర బడ్జెట్
- వికసిత భారత్ దిశగా ప్రవేశ ద్వార బడ్జెట్‌గా కేంద్ర బడ్జెట్ 2026--27
- బీసీ కమిషన్ మాజీ చైర్మన్ వకుళాభ రణం కృష్ణ మోహన్ రావు



హైదరాబాద్, మేజర్ న్యూస్: ఆదివారం కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ లోక్‌సభలో ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్ 2026--27 సామాజిక న్యాయానికి నిలువెత్తు నిదర్శనంగా నిలిచిందని తెలంగాణ వెనుకబడిన తరగతుల కమిషన్ మాజీ చైర్మన్, సామాజిక శాస్త్రవేత్త డాక్టర్ వకుళాభరణం కృష్ణ మోహన్ రావు అభిప్రాయపడ్డారు. ఈ కేంద్ర బడ్జెట్‌లో సంక్షేమాన్ని విడివిడిగా పథకాలుగా కాకుండా, సమాజాన్ని దీర్ఘకాలిక మార్పు దిశగా నడిపించే సమగ్ర సంస్కరణాత్మక దృక్పథం స్పష్టంగా ప్రతిబింబిస్తోందని ఆయన పేర్కొన్నారు. రైతులు, ఎస్సీ, ఎస్టీ, వెనుకబడిన తరగతులు (ఓబీసీ లు), మహిళలు, యువత, సంచార జాతులు--కులాలు, పేద వర్గాలకు అభివృద్ధి ఫలాలు చేరాలనే ఆలోచన ఆర్థిక విధాన నిర్మాణంలోనే నిక్షిప్తమై ఉందన్నారు. విద్య, ఉపాధి, నైపుణ్యాభివృద్ధి, ఆరోగ్యం, స్వయం ఉపాధి రంగాలను సామాజిక న్యాయ సాధనాలుగా కేంద్ర బడ్జెట్ రూపకల్పన చేయడం ఈసారి ప్రత్యేకంగా కనిపిస్తోందని డాక్టర్ కృష్ణ మోహన్ రావు విశ్లేషించారు. ఉన్నత విద్యలో బాలికలకు నివాస సౌకర్యం కల్పించాలనే ఉద్దేశంతో ప్రతి జిల్లాలో హాస్టల్ ఏర్పాటు చేయాలన్న నిర్ణయం, సామాజిక--ఆర్థిక అడ్డంకులను తొలగిస్తూ సమాన అవకాశాలకు దారితీసే గాఢమైన సంస్కరణాత్మక చర్యగా ఆయన విశ్లేషించారు. ఓబీసీ లు అధికంగా ఆధారపడే చిన్న వ్యాపారాలు, స్వయం ఉపాధి, హస్తకళలు, చేతివృత్తులు, పశుపోషణ, మత్స్యకార రంగాలు, సేవా రంగాలపై కేంద్ర బడ్జెట్‌లో పెట్టిన దృష్టి సమాన భాగస్వామ్య అభివృద్ధి నమూనాకు నిదర్శనంగా నిలుస్తోందన్నారు. ఈ విధానం సామాజిక వర్గాలను వేరు చేయకుండా, అభివృద్ధి ప్రధాన ప్రవాహంలో భాగస్వాములుగా మార్చే దృక్పథాన్ని ప్రతిబింబిస్తోందని తెలిపారు. మానసిక ఆరోగ్య సేవల విస్తరణ, జిల్లా ఆసుపత్రుల్లో అత్యవసర వైద్య--ట్రామా సంరక్షణ బలోపేతం, ఉపాధి ఆధారిత రంగాల బలపరచడం వంటి చర్యలు మానవ గౌరవం కేంద్రంగా ఉన్న సంక్షేమ ఆలోచనకు స్పష్టమైన న్యాయబద్ధీకరణగా నిలుస్తున్నాయని ఆయన వ్యాఖ్యానించారు. ఆర్థిక క్రమశిక్షణను కాపాడుకుంటూనే సంక్షేమానికి ప్రాధాన్యం ఇవ్వడం ఈ కేంద్ర బడ్జెట్ ప్రధాన లక్షణమని పేర్కొన్నారు. ఇది బలహీన వర్గాల ప్రయోజనాలను తాత్కాలికంగా కాకుండా, స్థిరమైన విధానాల ద్వారా దీర్ఘకాలికంగా పరిరక్షించే దృక్పథాన్ని సూచిస్తోందన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో రూపొందిన ఈ కేంద్ర బడ్జెట్‌ను డాక్టర్ వకుళాభరణం కృష్ణ మోహన్ రావు వికసిత భారత్ దిశగా ప్రవేశ ద్వార బడ్జెట్‌గా అభివర్ణించారు. అంత్యోదయ భావనను విధానాల స్థాయిలో బలపరుస్తూ, అభివృద్ధి--న్యాయం--గౌరవాన్ని ఒకే దిశలో నడిపించే ప్రయత్నం ఇందులో స్పష్టంగా కనిపిస్తోందన్నారు. సామాజిక న్యాయం, జాతీయ అభివృద్ధి రెండు వేర్వేరు లక్ష్యాలు కాకుండా, ఒకే సమగ్ర ప్రయాణంగా ఈ కేంద్ర బడ్జెట్ ముందుకు తీసుకెళ్తోందని ఆయన తేల్చి చెప్పారు.

## పురాతనమైన ప్రత్యేకమైన నృత్య ప్రక్రియ ఆంధ్ర నాట్యం





రవీంద్ర భారతి, మేజర్ న్యూస్ : పురాతనమైన ప్రత్యేకమైన నృత్య ప్రక్రియ ఆంధ్రనాట్యమని ప్రముఖ నాట్య గురువు డాక్టర్ కళా కృష్ణ అన్నారు. ప్రముఖ నాట్య కళాకారిణి నికిత ఆంధ్రనాట్య ప్రదర్శన త్రయి పేరిట తెలంగాణ సరస్వత పరిషత్ లో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కళా కృష్ణ పాల్గొని ప్రముఖ న్యాయవాది వెంకటేశ్వరి, కళా పత్రిక ఎడిటర్ మహమ్మద్ రఫీ తో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆంధ్ర నాట్యం ఒక విశిష్ట శాస్త్రీయ నృత్య ప్రదర్శన అని పేర్కొన్నారు. ఆంధ్ర నాట్యం, భరత నాట్యం, కూచిపూడి నాట్య శైలులను ఒకే వేదికపై ప్రదర్శించడం ద్వారా, వాటి మధ్య ఉన్న సూక్ష్మమైన వ్యత్యాసాలను సహజంగా అర్థం చేసుకునేలా ప్రదర్శన రూపొందించడం అభినందనీయమన్నారు. ఆంధ్రనాట్యం నికిత, భరతనాట్యం అర్చేశ్మతి, కూచిపూడి: సాయి పూజిత ఒకే కీర్తనను వేర్వేరు శైలుల్లో ప్రదర్శించి ప్రత్యేకతను చాటుకున్నారు.

## సాధన సాహితీ స్రవంతి 44వ వార్షికోత్సవ వేడుకలు



రవీంద్ర భారతి, మేజర్ న్యూస్ : సాధన సాహితీ స్రవంతి 44వ వార్షికోత్సవం సందర్భంగా "రజతోత్సవ పద్య సాధన" విజయోత్సవ కార్యక్రమం సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం, డా. ఎన్.టి. రామారావు కళావేదికలో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రిటైర్డ్ ఐఏఎస్ : డా. కెవి రమణాచారి పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సాధన సాహితీ స్రవంతి నిర్వహణలో సాధన నరసింహచార్య అనేక విలక్షణమైన కార్యక్రమాలను నిర్వహిస్తూ.. సాహితీ సంస్కృతి కాపాడుతున్నారని పేర్కొన్నారు. శ్రీశ్రీ తర్వాత జాతీయస్థాయి కవిగా సుద్దాల అశోక్ తేజ ఎదిగారని కొనియాడారు. జాతీయ కవి, ప్రముఖ సినీ గేయ కవి డా. సుద్దాల అశోక్ తేజ మాట్లాడుతూ.. సాహిత్య రంగానికి సాధన నరసింహ చార్య చేసిన సేవలను ఆయన కొనియాడారు. కార్యక్రమంలో వివేకానంద సేవాసమితి చైర్మన్ సి.హెచ్. హనుమంతరావు, తెలుగు విశ్వవిద్యాలయం విశ్రాంత రిజిస్ట్రార్ డా. టి. గౌరీశంకర్, అశ్వినీ ఛారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ అశ్వినీ సుబ్బారావు పాల్గొన్నారు. అనంతరం తెలంగాణ నందూరి' శతక పద్య మౌఖిక పరీక్ష విజేతలకు బహుమతులను ప్రధానం చేశారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు సాధన నరసింహాచార్య , శంభుని కుమార్, సహాయ కార్యదర్శి పి. నరేంద్ర కృష్ణ, ఉపాధ్యక్షుడు, కడియాల ప్రభాకర రావు, సంయోజకులు ఎన్. శశికళ, సవిత, సూర్యకుమారి తదితరులు పాల్గొన్నారు.

## ఐ విజన్ యూత్ పార్లమెంట్ –2025 గ్రాండ్ పినాలే కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ





సిటీబ్యూరో,మేజర్‌న్యూస్ః పాఠశాల విద్యార్థులకోసం రూపొందించిన సృజనాత్మక,వినూత్న పౌర విద్యా కార్యక్రమం ఐ విజన్ యూత్ పార్లమెంట్–2025 గ్రాండ్ పినాలే కార్యక్రమం బంజారహిల్స్‌లోని బి.జె.ఆర్. భవన్‌లో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమం హైదరాబాద్ జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి మార్గదర్శకత్వంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ పాల్గొని కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ మాట్లాడుతూ విద్యార్థులను భవిష్యత్ నాయకులుగా,దేశ రాయబారులుగా తీర్చిదిద్దాలని, పార్లమెంట్,రాష్ట్ర శాసన సభలు దేశం,రాష్ట్ర భవిష్యత్ దిశను నిర్ణయించే అత్యున్నత ప్రజాస్వామ్య సంస్థలన్నారు. జాతీయ విద్యా విధానానికి అనుగుణంగా అనుభవాత్మక విద్య ప్రాముఖ్యతను ఆయన వివరించారు. విద్యార్థులు రూపొందించిన వైట్ పేపర్‌ను ఆయన భవిష్యత్తుకోసం ప్రస్తుతం తరగతి ఆశలు ప్రతిబింబించే ఆకాంక్షపత్రంగా ఆయన అభివర్ణించారు. ఈ వైట్ పేపర్‌లో సమకాలిన పరిపాలన, అభివృద్ధి అంశాలు ప్రతిబింబించాయని, బాలికల విశేష భాగస్వామ్యం ఎంతో ప్రశంసనీయమన్నారు. మహిళా సాధికారత భారతదేశంలో నిశ్శబ్దమైన విప్లవాత్మక ప్రజాస్వామ్య మార్పుగా అభివృద్ధి చెందిందని ఆయన చెప్పారు. ఈ సందర్భంగా జిల్లా స్థాయిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు పురస్కారాలు,సర్టిఫికేట్లను రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అందజేశారు. రాష్ట్ర బి.సి. సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రసంగిస్తూ ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయడానికి ,రాజకీయాల నాణ్యతను మెరుగుపరుచడానికి యువత పాల్గొనడం ఎంతో అత్యవసరమని,విద్యార్థి రాజకీయాలనుంచి ప్రజా జీవితానికి తన ప్రయాణాన్ని గుర్తు చేసుకుంటూ,చదువుకున్న,అవగాహన కలిగిన యువత ప్రజాస్వామ్య సంస్థలతో అనుసంధానం కావాలని ఆయన పిలుపునిచ్చారు. జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి మాట్లాడుతూ ఐ విజన్ యూత్ పార్లమెంట్‌ను దాటి,తరగత గదులను ప్రజాస్వామ్యానికి జీవంతమైన ప్రయోగశాలలుగా మార్చే లక్ష్యంతో రూపొందించబడిందన్నారు. విద్యార్థులు ఆలోచించడం, ప్రశ్నించడం, చర్చించడ,సహకరించడం నాయకత్వం వహించడం వంటి నైపుణ్యాలను పెంపొందించడమే లక్ష్యమన్నారు. 6వ తరగతినుంచి 11వ తరగతుల విద్యార్థులకోసం రూపొందించిన ఈ కార్యక్రమం జాతీయ విద్యా విధానం,సస్టైనబుల్ డెవలప్‌మెంట్ గోల్స్‌కు అనుగుణంగా, హైదరాబాద్ జిల్లాలోని 183 ప్రభుత్వ పాఠశాలలు,50కిపైగా ప్రైవేట్ సంస్థలను కవర్‌చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యా శాఖ ఆధ్వర్యంలో డి.ఈ.ఓ. ఆర్. రోహిణి, ఇక్షణ మార్కెటింగ్ ప్రతినిధులు అంజలి గుప్తా,అంకుర్ గుప్తా,రోటరి లేక్ డిస్ట్రిక్ట్ ప్రతినిధులు రోటేరియన్లు సునీల్ సరాఫ్,రాజ్‌శేఖర్‌తోపాటు స్పాన్సర్ల సహకారంతో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యా శాఖ కిందిస్థాయి అధికారులు,పాఠశాలల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## గోల్కొండ తహసిల్దార్ దండు అహల్య అందించిన సేవలు ఎంతో స్పూర్తిదాయకం

**–జిలా కలెకర్ హరిచందన దాసరి**





సిటీబ్యూరో,మేజర్‌న్యూస్ఃగోల్కొండ మండల తహసిల్దార్‌గా విధులు నిర్వహించిన దండు అహల్య సేవలు ఎంతో స్పూర్తిదాయకమని,ఆమె గత 39సంవత్సరాలపాటు రెవెన్యూ శాఖలో వివిధ హోదాల్లో విధులు నిర్వహించిన పదవి విరమణ పొందారని,గోల్కొండ మండల తహసిల్దార్‌గా ఆమె అందించిన సేవలు ఎంతో స్పూర్తిదాయకంగా నిలుస్తుందని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి అన్నారు. శనివారం అత్తాపూర్ రింగ్‌రోడ్డులోని హోటల్ కినార గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన పదవి విరమణ కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా విచ్చేసి,తహసిల్దార్ దండు అహల్యను ఘనంగా సత్కరించి పదవి విరమణ శుభకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ హైదరాబాద్‌లోని గోల్కొండ బోనాలు,ఇటీవల కురిసిన భారీ వర్షాల సమయంలో ఎంతో నిబద్ధతతో విధులు నిర్వహించి, ఏ పని చెప్పిన ఎంతో బాధ్యతాయుతంగా చేపట్టడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో డి.ఆర్.ఓ. వెంకటాచారి,రెవెన్యూ శాఖ సంఘ అధ్యక్షులు లచ్చిరెడ్డి, హైదరాబాద్ డివిజన్ ఆర్డీవో కె. రామకృష్ణ,సికింద్రాబాద్ డివిజన్ ఆర్డీవో పి. సాయిరాం,హైదరాబాద్ జిల్లా తహసిల్దార్ల అసోసియేషన్ అధ్యక్షులు ఎం. ప్రేమ్‌కుమార్‌తోపాటు వివిధ మండలాల తహసిల్దార్లు,రెవెన్యూ శాఖ కిందిస్థాయి అధికార,సిబ్బందితోపాటు గోల్కొండ మండల కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా గోల్కొండ మండల కార్యాలయ అధికార,సిబ్బంది ప్రత్యేకంగా తహసిల్దార్ దండు అహల్యను శాలువాకప్పి ఘనంగా సత్కరించి, మెమోంటోను అందజేశారు.

## పన్నుల రంగంలో క్రాస్ బోర్డర్ టాక్సేషన్ ఎంతో కీలకం

**- ఏపీ జీఎస్టీ అప్పీలేట్ ట్రిబ్యునల్ న్యాయ సభ్యులు వేమిరెడ్డి భాస్కర్ రెడ్డి**



హిమాయత్ నగర్, మేజర్ న్యూస్ : దేశంలోని పన్నుల రంగంలో క్రాస్ బోర్డర్ టాక్సేషన్ ఎంతో కీలకం అని ఏపీ జీఎస్టీ అప్పీలేట్ ట్రిబ్యునల్ న్యాయ సభ్యులు వేమిరెడ్డి భాస్కర్ రెడ్డి చెప్పారు. సికింద్రాబాద్‌లోని హోటల్ తాజ్ ట్రైస్టార్ లో క్రాస్ బోర్డర్ టాక్సేషన్ అనే అంశంపై తెలంగాణ ? ఆంధ్రప్రదేశ్ ట్యాక్స్ బార్ అసోసియేషన్ స్పీకర్ మీట్ నిర్వహించింది. ఈ స్పీకర్ మీట్ లో వేమిరెడ్డి భాస్కర్ రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగిస్తూ భారతదేశంలో సరిహద్దు లావాదేవీలను నియంత్రించే పన్ను చట్టాల సంక్లిష్టతల కారణంగా, విదేశాలలో వ్యాపారం చేయడం ఒక కష్టతరమైన మరియు సవాలుతో కూడిన పని అని, అందువల్ల, సంస్థలు తామ కార్యకలాపాలు నిర్వహించే వివిధ దేశాల పన్ను వాతావరణం మరియు చట్టాల గురించి పూర్తి సమాచారాన్ని కలిగి ఉండటం చాలా ముఖ్యం అని అన్నారు. క్రాస్ బోర్డర్ టాక్సేషన్ లో అంతర్జాతీయ నిబంధనలకు అనుగుణంగా, పారదర్శకతతో స్థిరమైన పన్ను వ్యూహాలను నిర్మిస్తే విజయాలకు చేరువవుతారని తెలిపారు. జ్ఞాన ఆధారిత కార్యక్రమాలను నిర్వహిస్తూ పన్నుల రంగ నిపుణుల్లో నిరంతర వృత్తి అభివృద్ధిని ప్రోత్సహిస్తున్న తెలంగాణ ? ఆంధ్రప్రదేశ్ ట్యాక్స్ బార్ అసోసియేషన్ కృషిని ప్రశంసించారు. అలాగే, జీఎస్టీ అప్పీలేట్ ట్రిబ్యునల్ సజావుగా మరియు సమర్థవంతంగా పనిచేయడానికి చార్టెడ్ అకౌంటెంట్లు మరియు అడ్వొకేట్లు పరస్పరం సమన్వయంతో పనిచేయడం ఎంతో కీలకమని ఆయన పేర్కొన్నారు. అసోసియేషన్ అధ్యక్షులు చంద్రశేఖర్ వేముల మాట్లాడుతూ వేమిరెడ్డి భాస్కర్ రెడ్డి ఏపీ ట్యాక్స్ బార్ సభ్యులు కావడం మనందరికీ గర్వకారణం అని అన్నారు. ఈ నియామకం ఆయన అనుభవం, నిష్ట, పన్నుల రంగానికి చేసిన సేవలకు గుర్తింపుగా నిలుస్తుందని తెలిపారు. అలాగే, ఫిబ్రవరి 21న హైదరాబాద్, బిర్లా ప్లానెటేరియంలోని భాస్కర ఆడిటోరియంలో మూట్ ట్రిబ్యునల్ పోటీలు, మరియు ఫిబ్రవరి 5న యూనియన్ బడ్జెట్‌పై ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నట్లు ప్రకటించారు. అంతేకాక, 18 సంవత్సరాల తర్వాత ట్యాక్స్ బార్ సభ్యుల డైరెక్టరీని విడుదల చేయనున్నట్లు కూడా తెలిపారు. అనంతరం ఇటీవలే ఆంధ్రప్రదేశ్ జీఎస్టీ అప్పీలేట్ ట్రిబ్యునల్ న్యాయ సభ్యుడిగా నియమితులైన వేమిరెడ్డి భాస్కర్ రెడ్డి ని శాలువా, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమాన్ని అసోసియేషన్ కార్యదర్శి ఆశిష్ జోషి సమన్వయం చేయగా, పూర్వ అధ్యక్షులు సిఏ హితేష్ జైన్, సలహాదారులు రామ్‌దేవ్ భుటాడా, అమృత్ కుమార్ కోట, ఉపాధ్యక్షులు నారాయణ రావు,కార్యవర్గ సభ్యులు, గవర్నింగ్ కౌన్సిల్ సభ్యులు, పన్నుల రంగానికి చెందిన చార్టెడ్ అకౌంటెంట్లు, అడ్వొకేట్లు, ట్యాక్స్ ప్రాక్టీషనర్లు హాజరయ్యారు.

## ఆర్యవైశ్యులే దేశానికి ఆర్థిక వెన్నెముక

**ఆలిండియా ఆర్యవైశ్య ఇండస్ట్రియలిస్ట్ ఫోరం సదస్సులో మంత్రి శ్రీధర్ బాబు**



హిమాయత్ నగర్, మేజర్ న్యూస్ : ఆర్యవైశ్యులు అంటే ఒక కమ్యూనిటీ మాత్రమే కాదని ఈ దేశానికి ఆర్థిక వెన్నెముక, అసలైన 'వెల్త్ క్రియేటర్స్' మీరే అని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. ఆదివారం హైదరాబాద్ లో సిల్వర్ జూబ్లీ సందర్భంగా నిర్వహించిన ఆలిండియా ఆర్యవైశ్య ఇండస్ట్రియలిస్ట్ ఫోరం సదస్సులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో 'ఎకనామిక్స్' అనే పదం పుట్టకముందే, మార్కెట్ అనే కాన్సెప్ట్ ప్రపంచానికి తెలియకముందే, దేశ ఆర్థిక వ్యవస్థను నిలబెట్టిన అసలైన ఆర్కిటెక్ట్స్ ఆర్యవైశ్యులేనని చెప్పారు. ప్రపంచం మొత్తం ఇప్పుడు స్టార్టప్‌ల గురించి మాట్లాడుతున్నా వందల ఏళ్ల క్రితమే ఎలాంటి సపోర్ట్ లేకుండా వ్యాపార సామ్రాజ్యాలను నిర్మించిన అసలైన ఎంటర్‌ప్రెన్యూర్స్ ఆర్యవైశ్యులేనని మంత్రి శ్రీధర్ బాబు అన్నారు.ఒకప్పుడు కస్టమర్ షాపుకు వచ్చేవాడని, ఇప్పుడు బిజినెస్ కస్టమర్ దగ్గరకే వెళ్తోందని చెప్పారు.టెక్నాలజీ ఇప్పుడు ఆప్షన్ కాదు, అవసరమని అన్నారు. ఏఐ, మెషిన్ లెర్నింగ్, ఆటోమేషన్ వంటి ఆధునిక టెక్నాలజీలు కేవలం ఐటీ కంపెనీలకే కాకుండా సంప్రదాయ వ్యాపారాలను 'స్మార్ట్ బిజినెస్‌లు'గా మార్చడానికి ఉపయోగపడతాయని మంత్రి వివరించారు. గత రెండేళ్లలో తెలంగాణ పారిశ్రామికవేత్తలకు స్వర్గధామంలా మారిందని, గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ డెస్టినేషన్‌గా ప్రపంచం దృష్టిని ఆకర్షిస్తోందని మంత్రి అన్నారు.'ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్'తో పాటు 'పీస్ ఆఫ్ డూయింగ్ బిజినెస్'అందిస్తున్న ప్రో–బిజినెస్ ప్రభుత్వం తమదని మంత్రి శ్రీధర్ బాబు పేర్కొన్నారు.'లోకల్ ప్రొడక్షన్ టు గ్లోబల్ డామినేషన్' లక్ష్యంగా తెలంగాణను ప్రపంచ పారిశ్రామిక పటంలో అగ్రస్థానంలో నిలబెట్టడమే ప్రభుత్వ ధ్యేయమన్నారు. 'మేడ్ ఇన్ తెలంగాణ' ట్యాగ్‌ను అంతర్జాతీయ మార్కెట్‌లో క్వాలిటీ బెంచ్‌మార్క్‌గా మార్చాలన్నదే లక్ష్యమని చెప్పారు. ఇన్నోవేటివ్, డిస్రప్టివ్ ప్రాజెక్టులతో ముందుకు రావాలని, ప్రభుత్వమే పూర్తి మద్దతుగా ఉంటుందని హామీ ఇచ్చారు. అన్నదానం, విద్యాదానం, ధార్మిక కార్యక్రమాల ద్వారా సమాజానికి తిరిగి ఇస్తున్న సేవ ఆర్యవైశ్యుల ప్రత్యేకత అని ప్రశంసించారు. సిల్వర్ జూబ్లీ దాటి గోల్డెన్ జూబ్లీ దిశగా ఆర్యవైశ్యుల ప్రయాణం కొనసాగాలని, తెలంగాణ అభివృద్ధిలో వారి భాగస్వామ్యం ఎప్పటికీ కీలకంగా ఉండాలని మంత్రి శ్రీధర్ బాబు ఆకాంక్షించారు.

## నిబంధనలకు విరుద్ధంగా కేసీఆర్ విచారణ తెలంగాణ భవన్ ఎదుట ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ధర్నా



కూకట్ పల్లి మేజర్ న్యూస్ : విచారణ పేరుతో తెలంగాణ రాష్ట్ర సాధకుడు, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు ని సాయంత్రం ఆరు గంటల తరువాత కూడా నిబంధనలకు విరుద్ధంగా సిట్ అధికారులు విచారించడాన్ని తీవ్రంగా నిరసిస్తూ కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు తెలంగాణ భవన్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ శ్రేణులను ఎక్కడికక్కడ పోలీసులు అడ్డుకోవడాన్ని కూడా ఆయన తీవ్రంగా ఖండించారు. ధర్నా సందర్భంగా మాట్లాడిన కృష్ణారావు ప్రభుత్వ తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్రంలో ప్రజాస్వామ్య విలువలను పక్కనపెట్టి పోలీసు రాజ్యాన్ని నడుపుతున్నారని ఆరోపించారు. ప్రజల గొంతును నొక్కే ప్రయత్నంగా ఎక్కడికక్కడ పోలీసులను మోహరించి భయభ్రాంతుల వాతావరణం సృష్టిస్తున్నారని విమర్శించారు. ప్రజాస్వామ్య హక్కులను కాలరాస్తూ, ప్రతిపక్ష గొంతులను అణిచివేయాలనే ఉద్దేశంతో ప్రభుత్వం వ్యవహరిస్తోందని ఆయన వ్యాఖ్యానించారు. ఈ తీరును తక్షణమే మార్చుకోకపోతే ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ఉద్యమాలు మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

# పర్యావరణహితమే ప్రజాహితం

**● కళలు, సంప్రదాయ సాంస్కృతిక సందడిగా సాగిన "నైమిషం" ● ఎర్త్ ని మించిన వెల్త్ లేదని చాటిన ఎర్త్ ఫెస్టివల్ 2026 ● అలరించిన సాంస్కృతికోత్సవం**



**నేర్చుకో.. నేర్పు గా..** ఫెస్టివల్‌లో అత్యంత ఆకర్షణీయంగా నిలిచింది లెర్నింగ్ జోన్. దీనిలో నేయడం, సహజ రంగులతో డైయింగ్, చెరియాల్ మాస్క్ పెయింటింగ్, సీడ్‌బాల్ తయారీ, రాక్ స్టాకింగ్, రంగోలి, సంప్రదాయ హస్తకళల శిక్షణ లో వందలాది మంది చిన్నారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. స్వయంగా స్పర్శించి నేర్చుకునే విధానం పిల్లల్లో ఏకాగ్రత, పర్యావరణంపై బాధ్యతను పెంపొందింపడమే లక్ష్యం గా నిర్వహించారు.



తెలంగాణ బ్యూరో ప్రతినిధి : పర్యావరణ హితమే అందరి అభిమతం కావాలని, అదే భవిష్యత్ లో మానవాళి కి మేలు చేస్తుందని భిన్న రంగాల ప్రముఖులు అభిప్రాయపడ్డారు. జె కృష్ణమూర్తి హైదరాబాద్ సెంటర్, టీమ్ రేట్రో ల సంయుక్త ఆధ్వర్యంలో గచ్చిబౌలి, ఖాజాగూడ లోని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ అఫ్ ఇండియా (ఈఎస్ సిఐ ) ప్రాగంణలో ఆదివారం నాడు నైమిషం - ఎర్త్ ఫెస్టివల్ 2026 , 3వ ఎడిషన్ నిర్వహించారు. ఈ ఒక్కరోజు పర్యావరణ ఉత్సవంలో 70కి పైగా స్వచ్ఛంద సంస్థలు (ఎన్‌జీవోలు), కళాకారులు, చేనేత కార్మికులతో పాటు పలు కమ్యూనిటీ గ్రూపులు పాలుపంచుకున్నాయి. ఈ ఫెస్టివల్ కు ముఖ్య అతిథిగా హాజరైన యునిసెఫ్ చీఫ్ ఫీల్డ్ ఆఫీసర్ డా. జెలాలెం బి. టాఫెస్సే తో పాటు ఈఎస్‌సీఐ డైరెక్టర్ డా. జి. రమేశ్వర్ రావు మాట్లాడుతూ, పిల్లలు, భవిష్యత్ తరాలు, పర్యావరణ సంరక్షణ--మానవ సంక్షేమం మధ్య ఉన్న లోతైన సంబంధాలపై ఫెస్టివల్ బలంగా దృష్టి సారించిందని పేర్కొన్నారు. పద్మభూషణ్ అవార్డు గ్రహీత , నైమిశం ఎర్త్ ఫెస్టివల్ గౌరవ సలహాదారు స్వప్న సుందరి ఈ ఫెస్ట్ లో సంస్కృతి, సంప్రదాయాలు, పర్యావరణ అవగాహన మధ్య ఉన్న అనుబంధాన్ని విశ్లేషించే ముఖ్య సెషన్‌ను క్యూరేట్ చేశారు.



**చేనేత...భాగ్య విధాత..** కార్యక్రమంలో ఏర్పాటు చేసిన చేనేత, హస్తకళల జోన్‌లో సిద్ధిపేట, పోచంపల్లి, నారాయణపేటతో పాటు ఇతర చేనేత, ఖాదీ క్లస్టర్ల నుంచి వచ్చిన నేతన్నలు సందర్శకులతో నేరుగా మమేకమయ్యారు. పలువురు సందర్శకులు మొక్కల ఆధారిత, చేతితో నేసిన వస్త్రాలు, సంప్రదాయ హస్తకళలను కొనుగోలు చేయడం ద్వారా ఫెస్టివల్ సందేశాన్ని బలపరిచారు. "వాయిసెస్ ఆఫ్ ది డెక్కన్" పేరిట జరిగిన చర్చా కార్యక్రమంలో యువ పర్యావరణ కార్యకర్త, అంతర్జాతీయ గుర్తింపు పొందిన క్లైమేట్ పిటిషనర్ రిధిమా పాండే కీలక ప్రసంగం చేశారు తరాలకతీతంగా వాతావరణ బాధ్యత ఎంత అత్యవసరమో వివరించారు. డెక్కన్ పీఠభూమి, అడవులు, సరస్సులు, రాళ్లు, పక్షులు, హస్తకళలు, కమ్యూనిటీల వంటి అంశాలపై సురేష్ హెబ్లికర్ సహా పలువురు ప్రముఖులు ప్యానెల్ చర్చలు చేసి ప్రెజెంటేషన్స్ సమర్పించారు.

**అలరించిన సాంస్కృతికోత్సవం..** ఫెస్టివల్ లో భాగంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. సుర్ మండల్ ఆధ్వర్యంలో వీణా మాథ్ వయోలిన్ కచేరీ, పాఠశాల విద్యార్థుల ప్రదర్శనలు, భద్రాచలం పాటలు అలరించాయి. సొసైటీ టు సేవ్ రాక్స్ సంస్థకు చెందిన నయనతార నంద కుమార్ సమర్పించిన నృత్య-నాటక ప్రదర్శన "ఎ పీస్‌ఫుల్ మూవ్‌మెంట్" ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ ప్రదర్శన, పర్యావరణ సంరక్షణ విశ్వ జన ఉద్యమంగా మారాల్సిన అవసరాన్ని చాటింది.

దక్షిణాది ప్రాంతపు ప్రత్యేక రుచులతో డెక్కన్ ఫుడ్ జోన్‌లో వీగన్ వంటకాలతో సహా స్థానిక రుచులను సందర్శకులు ఆస్వాదించారు. ఇక ఫెస్టివల్ అంతటా వ్యర్థాల వర్గీకరణ, వ్యర్థ మార్పిడి కార్యక్రమాలు, ప్లాస్టిక్ వినియోగం తగ్గింపు, నీటి సంరక్షణ వంటి చర్యల ద్వారా సస్టైనబిలిటీ ఆచరణలో ఎలా సాధ్యం చేయాలో వివరించారు.

# అవకాశం ఇవ్వండి సేవకుడిగా ఉంటా

**▶▶ కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించండి ▶▶ బీఆర్ఎస్ కౌన్సిలర్ అభ్యర్థి శేరి పావనిశివారెడ్డి**






చేవెళ్ల, మేజర్‌న్యూస్(ఫిబ్రవరి 01) ః మల్కాపూర్ వార్డు అభివృద్ధికి మరోసారి అవకాశం ఇవ్వండి...వార్డు సేవకురాలిగా ఉంటూ వార్డు అభివృద్ధికినిరంతరం కృషి చేస్తానని 4వ వార్డు బీఆర్ఎస్ అభ్యర్థి శేరి పావనిశివారెడ్డి అన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో భాగంగా గురువారం ఇంటింటి ప్రచారం నిర్వహించి కారు గుర్తుకు మీ అమూల్యమైన ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను కోరారు. మున్సిపల్‌లోని 4వ వార్డు కౌన్సిలర్‌గా అవకాశం ఇస్తే వార్డు అభివృద్ధికి పాటుపడుతానని తెలిపారు. పార్టీలకతీతంగా వార్డును అభివృద్ధి చేయడమే తన లక్ష్యమన్నారు. ప్రజల ఆశీర్వాదం తనకు కావాలని ఓటర్లను వేడుకున్నారు. మున్సిపల్‌కు సేవ చేసే భాగ్యం కల్పిస్తే రుణపడి ఉంటానని చెప్పారు. ప్రభుత్వంతో కొట్లాడి అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ పథకాలు అందిస్తానని తెలిపారు. అవసరం ఉన్న వారికి ఇందిరమ్మ ఇల్లు ఇప్పించే బాధ్యత నాదేనన్నారు. పింఛన్లు లేని పేదలకు పింఛన్లు ఇప్పిస్తానని హామీ ఇచ్చారు. ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా కృషి చేస్తానని తెలిపారు. వార్డులో సీసీ రోడ్లు, మురుగుకాల్వలు, వీధిలైట్లు, యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తానని హామీ ఇచ్చారు. మీ అమూల్యమైన ఓటు కారు గుర్తుకు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.

## అవకాశమివ్వండి.. అభివృద్ధి చేస్తా

**-10వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థి ఎండి మగ్బుల్**




చేవెళ్ల, మేజర్‌న్యూస్ (ఫిబ్రవరి 01): ఒక్కసారి అవకాశమిస్తే.. 10వ వార్డులో అభివృద్ధి చేసి చూపిస్తానని 10వ వార్డు అబ్యర్థి ఎండి మగ్బుల్ అన్నారు. ఆదివారం 10వ వార్డులో ప్రత్యర్థికి దీటుగా ప్రచారాన్ని నిర్వహించారు. గడప గడపకు వెళ్లి ప్రచారం చేశారు. తనకు ఓటు వేయాలని అభ్యర్థించారు. కంకి కొడవలి గుర్తుకు ఓటేయాలని కోరారు. ప్రజలకు చేసే చేసే భాగ్యం కల్పించాలని కోరారు. రామన్నగూడ, దామరగిద్ద వార్డులోని సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు కృషి చేస్తానని చెప్పారు. పేదలకు ఇంటి పట్టాలు ఇప్పించేందుకు ఉద్యమిస్తానని, పట్టాలు వచ్చేంత వరకు పోరాటం చేస్తానని తెలిపారు. గతంలో చేవెళ్లలో సీపీఐ పార్టీ చేసిన పోరాటానికి అప్పటి ప్రభుత్వం పేదలకు ఇండ్ల స్థలాలు ఇచ్చిందని గుర్తు చేశారు. విలువైన ఓటు కంకి కొడవలికి వేసి తనను భారీ మెజారిటీతో గెలిపించాలని ఆయన కోరారు.

## కమలం గుర్తు ఓటేసి ఆశీర్వదించండి

**-కౌన్సిలర్ అభ్యర్థి వడ్డె అమృత రామచంద్రయ్య**



చేవెళ్ల, మేజర్‌న్యూస్ (ఫిబ్రవరి 01) : కమలం గుర్తు ఓటేసి తనను ఆశీర్వదించాలని 7వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థి వడ్డె అమృత రామచంద్రయ్య అన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో భాగంగా ఆదివారం 7వ వార్డు పరిధిలో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె ఇంటింటికి వెళ్లి తనకు ఓటు వేయాలని అభ్యర్థించారు. కమలం గుర్తుకు ఓటేసి భారీ మెజారిటీతో గెలిపిస్తే.. 7వ వార్డులో తాగునీరు, వీది దీపాలు, డ్రైనేజీ వంటి మౌళిక సదుపాయలను కల్పిస్తానని చెప్పారు. ప్రజల ఆశీర్వాదం ఉంటే తాను కౌన్సిలర్‌గా గెలుపొందుతానని అన్నారు. బడుగు, బలహీన వర్గాల ప్రజల అభ్యున్నతికి బీజేపీ కృషి చేస్తుందని తెలిపారు. కేంద్రం అందిస్తున్న సంక్షేమ పథకాలు తనకు శ్రీరామ రక్ష అని పేర్కొన్నారు.

## ఘనంగా కాంగ్రెస్ పార్టీసీనియర్ నాయకుని జన్మదిన వేడుకలు




కందుకూరు, మేజర్‌న్యూస్ ( పిభ్రవరి 01): కందుకూరు మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఎండి అఫ్జల్‌బేగ్ జన్మదిన వేడకులు ఆదివారం నాయకులు,అభిమానుల మధ్య ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో పీసీసీ సభ్యులు దేప భాస్కర్‌రెడ్డి, సర్పంచ్‌లు పాండు, కొండల్‌రెడ్డి, రాజు గొల్లూరు, నాయకులు ప్రభాకర్‌రెడ్డి, రాణప్రతాప్‌రెడ్డి, భూపాల్‌రెడ్డి, జగన్‌మోహన్‌రెడ్డి, డిల్లీ శ్రీధర్,సయ్యద్ అజీజ్, వెంకటేష్ గౌడ్, కత్తుల వెంకటేష్,జగన్, బుక్క పాండురంగారెడ్డి, దర్శన్, శకర్, సర్వర్‌లు పాల్గొని జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.